www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 230

సోమవారం | 18-11-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: తదియ రా. 6.56 తదుపరి చవితి; నక్షత్రం: మృగశిర మ. 3.49 తదుపరి ఆరుద్ర; వర్జ్యం: రా.11.54-1.26; దుర్ముహూర్తం: మ.12.22-1.07, మ.2.36-3.21; అమృతఘడియలు: ఉ.7.35-9.04, తె.5.18; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.25; సూర్యాస్తమయం: 5.35 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విశ్వ సుందరి..
విక్టోరియా కెజార్



2 డెన్మార్క్ భామను వరించిన కిరీటం
ఆ దేశానికి 'మిస్ యూనివర్స్' ఇదే తొలిసారి
రన్నరప్‌లుగా నైజీరియా, మెక్సికో యువతులు
టాప్-30లో భారత్‌కు చెందిన రియా

హైపర్‌సానిక్ క్లబ్‌లో భారత్



ఒడిశాలో విజయవంతంగా దీర్ఘ శ్రేణి క్షిపణి పరీక్ష

- ఇదో చరిత్రాత్మక ఘట్టం: రాజ్‌నాథ్ సింగ్
- ఇప్పటికే ఈ క్షిపణులను వాడుతున్న రష్యా
- చైనా, అమెరికా పరీక్షలూ విజయవంతం
- తాజా ప్రయోగంతో వీటి సరసన భారత్

అల్వాల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారతదేశపు తొలి దీర్ఘ శ్రేణి హైపర్‌సానిక్ (శబ్దం కన్నా ఐదు రెట్లు, అంతకు మించి వేగంతో వెళ్లే) క్షిపణిని రక్షణ రంగ పరిశోధన, అభివృద్ధి (డీఆర్‌డీవో) సంస్థ ఒడిశాలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ దీవి నుంచి విజయవంతంగా పరీక్షించింది. డీఆర్‌డీవో శాస్త్రవేత్తలు, త్రివిధ దళాలకు చెందిన ఉన్నతాధికారుల సమక్షంలో ఈ పరీక్షను నిర్వహించారు. ప్రపంచంలో ఇప్పటిదాకా ఒక్క రష్యా వద్ద మాత్రమే ఆపరేషనల్ హైపర్‌సానిక్ క్షిపణులున్నాయి. ఉక్రెయిన్‌తో యుద్ధంలో వాటిని

మిగతా 2వ పేజీలో...


బాలుడి తల, చేతులు నరికి..

1 మణిపూర్‌లో రెండేళ్ల చిన్నారి దారుణ హత్య 2
1 కుటుంబంలోని మరో ఐదుగురినీ.. నదిలో మృతదేహాలు
1 వెలుగులోకి కుకీ మిలిటెంట్ల దుశ్చర్య
1 రాష్ట్రంలో తీవ్ర నిరసనలు, ఉద్రిక్తత.. కేంద్ర హోంశాఖ సమీక్ష
1 విద్వేషమే బీజేపీ రాజకీయం: కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే
1 బీరేన్ సర్కారుకు ఎన్‌పీపీ మద్దతు ఉపసంహరణ



మణిపూర్ హింసకు నిరసనగా ఢిల్లీలో ఆందోళనలు

ఈవీ.. ట్యాక్స్ ఫ్రీ



గతంలో రోడ్‌ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజుకు పరిమితులు.. తొలి 2లక్షల బైక్‌లు, 8వేల కార్లు, 2వేల ఆటోలకే

మినహాయింపులపై ఇప్పుడు ఎలాంటి పరిమితీ లేదు.. కాలుష్య నియంత్రణకే ప్రోత్సాహకాలు: పొన్నం

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంధన ధరలకు తాళలేక ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) వైపు చూస్తున్నారా? ఇదే సదవకాశం!! ఎలక్ట్రిక్ కారో.. లేదా బైకో కొన్నవారికి బంపర్ ఆఫర్! ఈవీలపై రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. వాహన కాలుష్యాన్ని నియంత్రించే ప్రధాన లక్ష్యంతో 2026 చివరి దాకా అన్ని రకాల ఎలక్ట్రిక్ మోటారు వాహనాలకు రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజును మినహాయించినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఢిల్లీలో వాహన కాలుష్యంతో ఏర్పడిన పరిణామాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రంలోనూ వాహన కాలుష్యాన్ని తగ్గించే లక్ష్యంతో ఈవీల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు గతంలో ఉన్న పరిమితులను రద్దు చేసి మరో రెండేళ్ల వరకు ట్యాక్స్‌లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆదివారం సచివాలయంలో రవాణా శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్‌తో కలిసి మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. శబ్ద, వాయు కాలుష్యాన్ని నిరోధించే ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలు, కార్లు, ట్యాక్సీలు, క్యాబ్‌లు, ఆటోరిక్షాలు, తేలికపాటి రవాణా వాహనాలు, బస్సులకు రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో కొన్న ఎలక్ట్రిక్ ట్రాక్టర్లకూ ఇది వర్తిస్తుందని వెల్లడించారు. ఈ మేరకు జీవో జారీ చేసినట్లు తెలిపారు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టిల నేతృత్వంలో రాజధాని హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దడానికి ఎలక్ట్రిక్

మిగతా 12వ పేజీలో...

రోడ్ ట్యాక్స్ మిగులు ఇలా..

17% 10లక్షలపై చిలుకు కారు కొంటే..

12% ద్విచక్రవాహనాలు కొంటే..

₹ 1000-1500 ఆదా అయ్యే రిజిస్ట్రేషన్ ఫీజు..



మహారాష్ట్రలో రేవంత్ కాన్వాయ్‌లోని వాహనాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

కిషన్‌రెడ్డి.. గుజరాత్ గులామ్

- సబర్మతి మాదిరిగా మూసీ ఆయనకు ఎందుకు కనిపించదు?
- గుజరాత్ మోడల్ విఫలమవుతుందనే చెడగొట్టే యత్నం
- బీజేపీ నేతలు ఏదైనా చేసుకోనివ్వండి.. ప్రక్షాళన చేసి తీరుతాం
- వీరుల గడ్డలో విద్రోహులు శిందే, అజిత్, అశోక్ చవాన్
- అబద్ధాల పోటీలో ప్రధాని మోదీ నంబర్ వన్: సీఎం రేవంత్
- మహారాష్ట్ర ఎన్నికల ప్రచార సభల్లో మళ్లీ వాహనం తనిఖీ

హైదరాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్ తరహాలో బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కూడా గుజరాత్‌కు గులాముగా వ్యవహరిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గుజరాత్‌లో మోదీ.. సబర్మతీ రివర్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసి 50 వేల మంది పైగా ప్రజలను ఇతర ప్రాంతాలకు తరలిస్తే చప్పట్లు కొట్టిన కిషన్‌రెడ్డి గుజరాత్ మోడల్ చాలా బాగుందంటూ ప్రపంచం మొత్తం చాటి చెప్పేందుకు ప్రయత్నిస్తున్నారని.. తెలంగాణ రైజింగ్ మోడల్‌లో భాగంగా మూసీ పునరుద్ధరణ కార్యక్రమం చేపడితే దాన్ని చెడగొట్టే ప్రయత్నం చేస్తున్నారని

మిగతా 11వ పేజీలో...

రైతుల శ్రమతోనే వరి సిరి 11
కాళేశ్వరంతో సంబంధం లేకుండా రికార్డు స్థాయి పంట
బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం పటాపంచలు: రేవంత్
మిడ్ మానేర్ నిర్వాసితులకు 4,696 ఇందిరమ్మ ఇళ్లు
కిషన్‌రెడ్డి మూసీ నిద్ర.. ఫొటో షూట్: మహేశ్ గౌడ్

రేవంత్.. ప్రజల్ని ఒప్పించి
ప్రక్షాళన చెయ్

- అలాగైతే మూసీ ప్రాజెక్టుకు మేం శ్రమదానం చేస్తాం
- పేదల ఇళ్లను కూల్చివేయడమే ఇందిరమ్మ రాజ్యమా?
- తీవ్ర మనోవేదనతో ఇప్పటికే 9 మంది మృతిచెందారు
- బుల్డోజర్లు వచ్చినా ప్రజల వెంటే ఉంటాం: కిషన్‌రెడ్డి
- రేవంత్‌రెడ్డి, కేటీఆర్.. ఇద్దరూ ముఖ్యమంత్రులే..
- వారి కుటుంబాల మధ్య వ్యాపార సంబంధాలు
- రుజువు చేయలేకపోతే పదవి నుంచి తప్పుకొంటా: బండి



అంబర్‌పేట తులసీరాం నగర్‌లో స్థానికులతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, గోల్నాక, దిల్‌సుఖ్‌నగర్, చాదర్‌ఘాట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మూసీ పరీవాహక ప్రాంతాన్ని ప్రక్షాళన చేసే ముందు అక్కడ ఏళ్లుగా నివసిస్తున్న పేదలను ఒప్పించాలని, వారి అనుమతితో మూసీ సుందరీకరణ ప్రాజెక్టు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. పేద ప్రజలకు ఇబ్బంది లేకుండా మూసీ ప్రాజెక్టు చేపడితే బీజేపీ శ్రేణులమందరమూ శ్రమదానం చేస్తామన్నారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లోని బస్తీల్లో సీఎం

మిగతా 11వ పేజీలో...

రేవంత్‌కు రక్షణ కవచంగా కమలదళం
రాష్ట్ర ప్రభుత్వంపై ఏఐసీసీకి ఎందుకంత సంతృప్తి 11
భూసేకరణను రాహుల్ గాంధీ అడ్డుకోలేదే
'లగచర్ల'ను మళ్లించేందుకే మూసీ నిద్ర: కేటీఆర్
మహారాష్ట్రలో ఓట్ల కోసమే బీజేపీ మూసీ నిద్ర: శ్రీధర్‌బాబు



ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడలో ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులకు అనుమతి నిరాకరణ

గ్రూప్-3 పరీక్షకు 50% హాజరు 11

హైదరాబాద్‌లో 41 శాతం మంది

సంగారెడ్డి కలెక్టర్ సంతకం ఫోర్జరీ 3

- 40 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిపై కన్ను
- అమ్మేందుకు ఎన్‌వోసీ కూడా తయారీ
- స్వాతంత్ర్య సమరయోధుల వారసుల కుట్ర
- ఐదుగురి అరెస్టు, పరారీలో నలుగురు

వైద్య శాఖలో నియామకాల జోరు

- 11 నెలల్లో 7 వేలకు పైగా పోస్టుల భర్తీ
- సివిల్ అసిస్టెంట్ సర్జన్ల జాబితా విడుదల
- రేపు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన
- త్వరలో 640 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ 3

'లాభదాయక' అనర్హతపై
కొత్త చట్టం!

- ఫ్లాగ్‌షిప్ పథకాల్లో సభ్యులుగా ఉన్నవారిపై వేటు పడదు
- బిల్లుపై ప్రజాభిప్రాయం కోరిన కేంద్ర న్యాయ శాఖ
- 1959 నాటి చట్టం రద్దుకు యోచన
- వర్తమాన కాల పరిస్థితులకు అనుగుణంగా నిర్వచనం

న్యూఢిల్లీ, నవంబరు 17: ఎంపీలపై అనర్హత వేటుకు సంబంధించి కొత్త చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. సర్కారులో లాభదాయక పదవులు నిర్వహిస్తూ ఎంపీగా గెలిచినవారిపై అనర్హతకు అవకాశం కల్పిస్తున్న 1959నాటి చట్టాన్ని రద్దుచేయాలని భావిస్తోంది. వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా 'లాభదాయక పదవి'కి నిర్వచనం ఇవ్వాలని నిశ్చయించింది. 16వ లోక్‌సభ (2014-19) కాలంలో బీజేపీ సీనియర్ నేత కల్‌రాజ్ మిశ్రా సారథ్యంలోని పార్లమెంటరీ కమిటీ (జాయింట్ కమిటీ ఆన్ ఆఫీసెస్ ఆఫ్ ప్రాఫిట్-జేసీవోపీ) సిఫారసులకు అనుగుణంగా కొత్త బిల్లు ముసాయిదాకు రూపకల్పన చేసింది. దీనిపై కేంద్ర న్యాయ శాఖ తాజాగా ప్రజాభిప్రాయం కోరింది. నూతన 'పార్లమెంటు (అనర్హత నిరోధక) బిల్లు-2024'లో అనర్హత పరిధిలోకి వచ్చే పదవులు, అనర్హతకు వీల్లేని పోస్టుల జాబితాను ప్రతిపాదించింది. కొన్ని నిర్దిష్ట కేసుల్లో అనర్హత వేటును తాత్కాలికంగా సస్పెండ్ చేయడానికి ప్రస్తుత చట్టంలోని సెక్షన్ 4 అవకాశం కల్పిస్తోంది. దీన్ని తొలగించాలని తాజా బిల్లులో ప్రతిపాదించారు. కేంద్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథకాలు, కార్యక్రమాలైన స్వచ్ఛభారత్, స్మార్ట్ సిటీ మిషన్, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్-గ్రామీణ కౌశల్య యోజన మొదలైనవాటిలో సభ్యులుగా ఉండేవారిని లాభదాయక పదవులు నిర్వహించేవారి జాబితాలోకి తేకూడదని జేసీవోపీ న్యాయ శాఖకు సూచించింది. అలాగే 'లాభదాయక పదవి'కి సమగ్ర నిర్వచనం రూపొందించాలని.. చట్టంలోని భాష, ఫార్మాట్ సరళంగా ఉండాలని ప్రతిపాదించింది. ప్రస్తుత చట్టంలోని కాలం చెల్లిన, నిరర్థక అంశాలను పరిగణనలోకి తీసుకోకూడదని పేర్కొంది.



ఓరుగల్లుకు..
ఎయిర్‌బస్ 320!

- పెద్ద విమానాలు తిరిగేలా విమానాశ్రయ నిర్మాణం!
- 949 ఎకరాలు అవసరం.. ఏఏఐ పరిధిలో 696 ఎకరాలు
- మరో 280 ఎకరాల సేకరణకు రూ.205 కోట్లు మంజూరు
- ఎయిర్‌పోర్టుకు లైన్‌క్లియర్ అని ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

హైదరాబాద్/వరంగల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలోని మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి అడుగులు వడివడిగా పడుతున్నాయి. దీనికి అదనంగా కావాల్సిన 280.30 ఎకరాల భూ సేకరణ చేపట్టాలని వరంగల్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించిన ప్రభుత్వం.. అందుకోసం రూ.205 కోట్లు మంజూరు చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. సేకరించిన భూమిలో 253 ఎకరాలను రన్‌వే, ఇతర అవసరాల కోసం అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. మిగతా భూమిని కూడా విమానాశ్రయ పరిధిలోనే ఉంచి, వివిధ అవసరాలకు వినియోగించనున్నారు. '150 కిలోమీటర్ల నిబంధన'పై శంషాబాద్ విమానాశ్రయ నిర్వహణ సంస్థ అయిన 'జీఎంఆర్' పక్కకు తప్పుకుని ప్రభుత్వానికి నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) సమర్పించడంతో మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఉన్న ప్రధాన ఆటంకం తొలగిపోయింది. ఇప్పుడు భూసేకరణ సమస్యకు ప్రభుత్వం తెరదించింది. జీఎంఆర్ ఎన్‌వోసీ

మిగతా 12వ పేజీలో...

వణుకు మొదలైంది

- రాష్ట్రవ్యాప్తంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఆసిఫాబాద్ జిల్లా గిన్నెధరిలో 11.8 డిగ్రీలు
- రాబోయే 3 రోజుల్లో మరింత తగ్గే అవకాశం
- చలి తీవ్రతపై అన్ని జిల్లాలకు యెల్లో అలెర్ట్



ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, నవంబరు 17: రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోవటంతో చలి తీవ్రత మొదలైంది. శీతాకాలం ప్రారంభమైనా ఇన్నాళ్లు చలి ప్రభావం అంతంతమాత్రంగానే ఉంది. కానీ గత రెండు రోజులుగా రాత్రివేళల్లో చలిగాలుల ప్రభావం పెరగడంతో బయటకు వచ్చేందుకు ప్రజలు వణుకుతున్నారు. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2.5 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. అటవీ ప్రాంతాలు ఉన్న

మిగతా 12వ పేజీలో...

మోదీకి నైజీరియా రెండో అత్యున్నత అవార్డు

- రాణి ఎలిజబెత్ తర్వాత తొలిసారి ఓ విదేశీ వ్యక్తికి
- కల్పితం కొంత కాలమే.. నిజం వెలుగుచూస్తోంది
- సామాన్యులకు కూడా అర్థమయ్యేలా చూపించారు
- సబర్మతి రిపోర్టు సినిమాపై ప్రధాని ప్రశంస 2



మోదీకి అవార్డు అందిస్తున్న నైజీరియా అధ్యక్షుడు

అమెరికాలో భారీగా ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు

- వృథా ఖర్చుల తగ్గింపే రాబోయే ట్రంప్ సర్కార్ లక్ష్యం
- ఇది అణుబాంబు తయారీలాంటి 'మన్‌హట్టన్ ప్రాజెక్టు'
- అధికార యంత్రాంగానికి 'షేవింగ్' తప్పదు 2
- 'కరెంటు రంపాన్ని' ఉపయోగిస్తాం: వివేక్ రామస్వామి



జాబిలిపై ఆక్సిజన్ పైప్‌లైన్!

దక్షిణ ధ్రువం వద్ద ఏర్పాటు చేసేందుకు నాసా కసరత్తు




న్యూయార్క్: చందమామపై మానవ శాశ్వత ఆవాసాలే లక్ష్యంగా 'ఆర్టెమిస్' ప్రాజెక్టును చేపట్టిన అమెరికా అంతరిక్ష పరిశోధనల సంస్థ నాసా.. చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద ఓ భారీ ఆక్సిజన్ పైప్‌లైన్ ఏర్పాటుకు సిద్ధమవుతోంది! ఎందుకంటే.. భవిష్యత్తులో చేపట్టబోయే ఇతర అంతరిక్ష యాత్రలకు చందమామను ఒక బేస్‌గా వాడుకోవాలంటే అక్కడ ఉన్న వనరులతోనే వ్యోమగాములు మనుగడ సాగించగలగాలి. అలా సాగించడానికి వారికి అన్నింటికన్నా అత్యంత అవసరమైనది, కీలకమైనది ప్రాణవాయువే. కానీ, అది చంద్రుడి మీద అస్సలు ఉండదు. కాబట్టి.. జాబిలి దక్షిణ ధ్రువం వద్ద ఉన్న మంచు పొరల నుంచి వ్యోమగాములకు అవసరమైన ఆక్సిజన్‌ను సంగ్రహించి, దాన్ని వ్యోమగాములు ఉండే బేస్‌లకు తరలించేలా రోబోల సాయంతో దాదాపు 5 కిలోమీటర్ల నిడివిగల పైప్‌లైన్ వ్యవస్థను నిర్మించేందుకు నాసా కసరత్తు చేస్తోంది. ఈ వినూత్న ప్రాజెక్టుకు నాసా.. 'లూనార్ సౌత్‌పోల్ ఆక్సిజన్ పైప్‌లైన్ (ఎల్-ఎస్‌పాప్)' అని పేరు పెట్టింది. అన్నట్టు.. 'ఆర్టెమిస్' అంటే.. గ్రీకు, రోమన్ పురాణాల్లో 'చంద్ర దేవత' పేరు. గతంలో నాసా చేపట్టిన చంద్రయాత్రలన్నింటికీ 'అపోలో' పేరు పెట్టిన సంగతి తెలిసిందే. అపోలో అంటే.. గ్రీకు దేవుడి పేరు. ఆయన సోదరి 'ఆర్టెమిస్'. 1972లో చేపట్టిన 'అపోలో 17'.. అప్పట్లో నాసా ఆఖరి మూన్ మిషన్. మళ్లీ ఇప్పుడు 'ఆర్టెమిస్' పేరుతో తన సత్తా చాటేందుకు సిద్ధమైంది.

ఆవు పేడలో భారీగా నోట్ల కట్టలు

- ఒడిసాలో స్వాధీనం చేసుకున్న హైదరాబాద్ పోలీసులు

బాలాసోర్ (ఒడిసా), నవంబరు 17: ఆవు పేడలో భారీగా నోట్ల కట్టలు బయటపడిన ఉదంతం ఒడిసా రాష్ట్రంలో వెలుగుచూసింది. శనివారం అక్కడి బాలాసోర్ జిల్లా కమర్దా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బడమందరుని అనే ప్రాంతంలో హైదరాబాద్, ఒడిసాలకు చెందిన పోలీసు బృందాలు వాటిని స్వాధీనం చేసుకున్నాయి. హైదరాబాద్‌లోని ఓ ఆగ్రో కంపెనీలో పనిచేస్తున్న గోపాల్ బెహ్రా అనే వ్యక్తి.. కంపెనీ లాకర్ నుంచి దాదాపు రూ.20 లక్షలు దొంగిలించి పారిపోయాడు. పరారీలో ఉన్న నిందితుడు ఆ డబ్బును తన బావమరిది అయిన రవీంద్ర బెహ్రాతో సొంతూరు పంపించాడు. ఆగ్రో కంపెనీ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్ పోలీసులు రంగంలోకి దిగారు. కమర్దా పోలీసులతో కలిసి రవీంద్ర ఇంట్లో సోదాలు చేయగా.. అక్కడ పేడకుప్పలో ఈ నోట్ల కట్టలు బయటపడ్డాయి.

లోకం తీరు



అమెరికాలో భారీగా ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు

- వృథా ఖర్చుల తగ్గింపే ట్రంప్ సర్కార్ లక్ష్యం
- ఇది అణుబాంబు తయారీలాంటి 'మాన్‌హట్టన్ ప్రాజెక్టు'
- అధికార యంత్రాంగానికి 'షేవింగ్' తప్పదు
- 'కరెంటు రంపాన్ని' ఉపయోగిస్తాం : వివేక్ రామస్వామి

వాషింగ్టన్, నవంబరు 17: అనవసర ఖర్చులు తగ్గించేందుకు బడ్జెట్‌లో కోతలు విధించడమే ప్రథమ లక్ష్యమని ప్రకటించిన అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆలోచనలను కార్యరూపంలోకి తెచ్చేందుకు కసరత్తు మొదలైంది. అధికారం చేపట్టిన వెంటనే అమలు చేసేలా కసరత్తు జరుగుతోంది. ఇందుకోసం ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్; భారత సంతతికి చెందిన బయోటెక్ కంపెనీ సీఈవో, రిపబ్లికన్ పార్టీ నాయకుడు వివేక్ రామస్వామి ఆధ్వర్యంలో ప్రభుత్వ సామర్థ్య విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ-డోగ్) ప్రత్యేకంగా ఏర్పాటైంది. ప్రభుత్వ విభాగాల్లో సామర్థ్యం పెంచడమంటే భారీగా ఉద్యోగాల్లో కోత విధించడమేనని ఈ ఇరువురు సీఈవోలు భావిస్తున్నారు. ఇటీవల ట్రంప్ సొంత ఎస్టేట్ అయిన మార్ ఎ లాగోలో జరిగిన సన్మాన సభలో వివేక్ ప్రసంగిస్తూ "మస్క్, నేను కలిసి వాషింగ్టన్‌లోని అధికార యంత్రాంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది 'ఎన్నిక ద్వారా నియమితులుకాని ఉద్యోగుల'ను బయటకు పంపి వేస్తాం. మేం ఆ పొజిషన్‌లో ఉన్నాం"అని చెప్పారు. "మస్క్ గురించి మీకు పూర్తిగాతెలియదు. ప్రభుత్వ ఉద్యోగులను తగ్గించడానికి ఆయన పెద్ద కరెంటు రంపమే తెస్తున్నారు. చాలా సరదాగా ఉంటుందిలే" అని వ్యాఖ్యానించారు. ఈ 'కరెంటు రంపం' ఆలోచనను అర్జెంటీనా అధ్యక్షుడు జావియర్ మిలేయి నుంచి తీసుకున్నట్టు కనిపిస్తోంది. అధికారం చేపట్టిన వెంటనే సాహసోపేత పొదుపు చర్యలు తీసుకుంటానని మిలేయి ప్రకటించారు. 'ఆర్థిక పోకిరీ', 'అరాచక పెట్టుబడిదారుడు'నని స్వయంగా చెప్పుకొన్నారు. అధికార యంత్రాంగం, ఆర్థిక లోటును తగ్గించేందుకు 'కరెంటు రంపాన్ని' ఉపయోగిస్తానని ప్రకటించారు. ఆ భావననే వివేక్ తీసుకున్నట్టు కనిపిస్తోంది. ప్రభుత్వ యంత్రాంగాన్ని 'క్షవరం' చేయాల్సి ఉందని ఆయన అన్నారు. "ప్రభుత్వ యంత్రాంగం సైజును "షేవింగ్" చేయడం మా లక్ష్యం. ఇది మాత్రం సాధ్యమైనంత వరకు పారదర్శంగా జరగాలి"అని పేర్కొన్నారు. ఈ కసరత్తును ఆయన 'ఆధునిక మాన్‌హట్టన్ ప్రాజెక్టు' అని అభివర్ణించారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో అణుబాంబులు తయారు చేసేందుకు అమెరికా ప్రభుత్వం 'మన్‌హట్టన్ ప్రాజెక్టు'ను నిర్వహించింది. ప్రస్తుతం భారీగా ప్రభుత్వ ఉద్యోగులను తగ్గించేందుకు చేపట్టే ప్రాజెక్టు కూడా అంత తీవ్రమైనదేనని తెలిపారు. ఇందుకోసం దేశంలోని మేధావులను ఒక్క దగ్గర చేర్చుతున్నామని చెప్పారు. జీతం తీసుకోకుండా వారానికి 80 గంటలపాటు అంకితభావంతో పనిచేసేవారు కావాలంటూ ఉద్యోగ ప్రకటన ఇచ్చారు కూడా. ఉద్యోగుల తొలగింపు కారణంగా కీలకమైన ప్రభుత్వ విధులు కుంటుపడుతాయన్న హెచ్చరికలకు వివేక్ సమాధానమిస్తూ 'నూతన ఆవిష్కరణలు, వ్యయం అదుపునకు కోతలు తప్పనిసరి' అన్నారు. "మనం క్షీణదశలో ఉన్న దేశం అంటూ నిరాశ భావనను ఇంతవరకు మనకు కలిగించారు. అది తప్పని ఎన్నికల్లో రుజువైంది. దేశ నిర్మాతలు గర్వపడేలా తగిన సైజ్, లక్ష్యం ఉండే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే 'డోగ్' పని అని అన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతివారం ఎక్స్‌లో 'డోగ్‌కాస్ట్' ప్రసారం చేసి మస్క్, వివేక్‌లు తమ అభిప్రాయాలను తెలుపుతారు.

ఉక్రెయిన్‌పై రష్యా భారీ దాడి

- 120 క్షిపణులు, 90 డ్రోన్లతో విధ్వంసం

కీవ్, నవంబరు 17: ఉక్రెయిన్‌పై రష్యా భారీ స్థాయిలో విరుచుకుపడింది. ఆదివారం తెల్లవారుజామున పలు నగరాల్లోని ఇంధన మౌలిక వనరులను లక్ష్యంగా పెద్దఎత్తున క్షిపణులు, డ్రోన్లతో దాడికి తెగబడింది. ఫలితంగా ఇంధన వనరులకు తీవ్ర నష్టం సంభవించింది. ఆగస్టు తర్వాత ఉక్రెయిన్‌పై రష్యా భారీ క్షిపణి దాడి ఇదే. ప్రధానంగా ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా పలు నగరాలు పేలుళ్లతో అట్టుడికాయి. రష్యా మొత్తంగా 120క్షిపణులు, 90డ్రోన్లతో 'తీవ్రమైన దాడికి' పాల్పడటం ద్వారా ఇంధన మౌలిక వనరులను విచ్ఛిన్నం చేసిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌వ్యాప్తంగా విద్యుదుత్పాదన, సరఫరా వ్యవస్థపై శత్రుదేశం దాడికి తెగబడిందని ఫేస్‌బుక్‌లో ఉక్రెయిన్ విద్యుత్తు శాఖ మంత్రి జర్మన్ గాలుస్కో పేర్కొన్నారు. రష్యా దాడులతో కీవ్ సహా పలు నగరాల్లో అధికారులు విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. డ్రోన్ దాడి కారణంగా ఉక్రెయిన్‌లోని వోలిన్ ప్రాంతంలో ఇద్దరు సాధారణ పౌరులు మృతి చెందారు. జర్మన్ చాన్స్‌లర్ ఒలఫ్ స్కోల్జ్ 2022 తర్వాత రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో శుక్రవారం మాట్లాడారు. దీన్ని ఉక్రెయిన్ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఆండ్రిజ్ సైబిహా పరోక్షంగా ఉటంకిస్తూ రష్యా తెగబడిన దాడికి పుతిన్‌తో చర్చించిన నేతలే "నిజమైన బాధ్యులు"అని అన్నారు. రష్యా దాడితో ఉక్రెయిన్‌కు పశ్చిమాన ఉన్న నాటో సభ్యదేశం పోలెండ్ అలెర్ట్ అయింది. తమ గగనతలంలో ఎయిర్‌ఫోర్స్‌ను అప్రమత్తం చేసింది.

ఇజ్రాయెల్ దాడుల్లో హిజ్బుల్లా అధికార ప్రతినిధి మృతి

- నెతన్యాహు నివాసంపై ఫ్లాష్ బాంబులతో దాడి

బీరుట్, టెల్ అవీవ్, నవంబరు17: లెబనాన్ రాజధాని బీరుట్‌లోని రస్ అల్ నబాలో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో హిజ్బుల్లా అధికార ప్రతినిధి, మీడియా వ్యవహారాల చీఫ్ మొహమ్మద్ అఫీఫ్ మృతి చెందాడు. ఇజ్రాయెల్ దాడుల్లో ఇటీవల మృతిచెందిన హిజ్బుల్లా చీఫ్ నస్రల్లాకు కూడా అఫీఫ్ మీడియా సలహాదారుగా, అల్ మనార్ టీవీ డైరెక్టర్ జనరల్‌గా కూడా వ్యవహరించాడు. అఫీఫ్ మృతితో హిజ్బుల్లాకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లైంది. హిజ్బుల్లాపై మీడియాలో ప్రచురితమయ్యే కథనాలన్నీ అఫీఫ్ సమకూర్చేవే. మీడియా ద్వారా అంతర్జాతీయంగా హిజ్బుల్లాకు అనుకూలంగా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా అభిప్రాయాలను కూడగట్టడంలో అఫీఫ్ కీలకంగా వ్యవహరించాడు. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నివాసంపై ఫ్లాష్ బాంబులతో దాడి జరిగింది. సిజేరియాలోని ఆయన నివాసంపై దాడి జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి నష్టం జరగలేదు.

ముంబై ఓటు ఎటువైపు?

2019 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-శివసేన స్వీప్.. 36 స్థానాలకు గాను 30 చోట్ల ఎన్డీఏ గెలుపు

- లోక్‌సభ ఎన్నికల్లో భిన్నంగా ఫలితాలు
- 6 ఎంపీ సీట్లలో బీజేపీకి రెండే..
- ప్రస్తుతం 2 కూటములుగా ఆరు పార్టీలు
- ఓట్లు చీల్చనున్న ఒవైసీ, రాజ్‌ఠాకరే పార్టీలు



ముంబై, నవంబరు17: ఈ నెల 20న జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో దేశ వాణిజ్య రాజధాని ముంబై అన్ని పార్టీలకూ కీలకం కానుంది. ముంబైలోని 36 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ, శివసేన, ఎన్సీపీతో కూడిన మహాయుతి కూటమి అభ్యర్థులతో కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే వర్గం శివసేన, శరద్ పవార్ వర్గం ఎన్సీపీతో కూడిన మహావికాస్ అఘాడీ(ఎంవీఏ) కూటమి అభ్యర్థులు తలపడుతున్నారు. వీరికి తోడు రాజ్‌ఠాకరే నేతృత్వంలోని మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన(ఎంఎన్‌ఎస్), ప్రకాశ్ అంబేడ్కర్ సారథ్యంలోని వంచిత్ బహుజన్ అఘాడీ, అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని మజ్లిస్ అభ్యర్థులు కూడా ముంబైలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

2019లో బీజేపీ-శివసేన హవా

2019 అసెంబ్లీ ఎన్నికల్లో 36 సీట్లకు గాను బీజేపీ, ఉమ్మడి శివసేన ఎన్డీయే కూటమిగా 30 స్థానాలు కైవసం చేసుకున్నాయి. ఇందులో బీజేపీ 16, శివసేన 14 స్థానాలు గెలుచుకున్నాయి. ప్రస్తుత ఎన్నికల్లో మహాయుతి కూటమిలోని బీజేపీ 18, శిండే శివసేన 16, అజిత్ పవార్ ఎన్సీపీ 2 నియోజకవర్గాల్లో అభ్యర్థులను బరిలోకి దించాయి. ఎంవీఏ కూటమిలోని యూబీటీ 22, కాంగ్రెస్ 11, శరద్ పవార్ వర్గం ఎన్సీపీ 2 చోట్ల అభ్యర్థులను పోటీకి దించాయి. శివసేన రెండు ముక్కలై పరస్పరం పోటీపడుతుండటంతో తాజా ఎన్నికల్లో ముంబై ఓటర్లు ఏ వర్గాన్ని ఆదరిస్తారనేది ఉత్కంఠగా మారింది.

2024 లోక్‌సభ ఎన్నికల్లో మారిన సీన్

ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ముంబైలోని ఆరు ఎంపీ సీట్లకు గాను బీజేపీ రెండింటినే గెలుచుకోగలిగింది. మిగతా నాలుగింటిలో మూడింటిని ఉద్ధవ్ శివసేన గెలుచుకోగా ఎంవీఏ కూటమిలో భాగంగా కాంగ్రెస్ మరో స్థానాన్ని గెలుచుకుంది. మెజార్టీ నియోజకవర్గాలను గెలుచుకున్న ఎంవీఏ అదే ఊపుతో అసెంబ్లీ ఎన్నికల్లోనూ బరిలోకి దిగుతోంది.

రాజ్‌ఠాకరే పార్టీ ఓట్లను చీలుస్తుందా?

మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన అధ్యక్షుడు రాజ్‌ఠాకరే ముంబైలో 25 నియోజకవర్గాల నుంచి తన అభ్యర్థులను బరిలోకి దించారు. దీంతో సంప్రదాయ ఓట్లు చీలే అవకాశం ఉంది. ముఖ్యంగా ముంబైలో సంప్రదాయ ఓట్లను నమ్ముకున్న బీజేపీ, శివసేనలకు ఎంఎన్‌ఎస్ సవాలుగా మారనుంది. వర్లీలో ఉద్ధవ్ ఠాకరే తనయుడు, సిటింగ్ ఎమ్మెల్యే ఆదిత్య ఠాకరే పోటీ చేస్తున్నారు. శివసేన తరఫున మిలింద్ దేవరా బరిలో ఉండగా, ఎంఎన్‌ఎస్ సందీప్ దేశ్‌పాండేను పోటీకి దించింది. దీంతో ముక్కోణపు పోటీ ఏర్పడింది. 2024 లోక్‌సభ ఎన్నికల నాటి మూడ్‌లోనే ఓటర్లు కొనసాగితే ముంబైలో 4 సీట్లు గెలుచుకున్న ఎంవీఏ కూటమి మరోసారి స్వీప్ చేసే అవకాశం ఉంది. అయితే తాము అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల కారణంగా ముంబై నగర వాసులు అసెంబ్లీ ఎన్నికల్లో తమకు పట్టం కడతారని మహాయుతి కూటమి ఆశాభావంగా ఉంది.

ముస్లిం ఓట్లలో చీలిక తప్పదా?

మజ్లిస్ అభ్యర్థులు బరిలో నిలుస్తోన్న వెర్సోవా, శివాజీనగర్ తదితర నియోజకవర్గాల్లో ఎంవీఏ కూటమికి దక్కే ముస్లిం ఓట్లలో చీలిక తప్పదని విశ్లేషకులు చెబుతున్నారు. ఇది ఎంవీఏ కూటమికి మింగుడు పడని విషయంగా మారనుంది. గత ఎన్నికల్లో 44 చోట్ల పోటీ చేసిన మజ్లిస్ డజనుకు పైగా నియోజకవర్గాల్లో కాంగ్రెస్-ఎన్సీపీ కూటమి అభ్యర్థులను ఓడించడంలో కీలకంగా మారింది.

బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ విషనాగులు: ఖర్గే

పుణె/ముంబై, నవంబరు17: దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయంగా ప్రమాదకరమైనవని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లను విషనాగులతో పోల్చారు. అందుకే వాటిని చంపేయాలంటూ మహారాష్ట్ర ఓటర్లకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సంగ్లీలో జరిగిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. మహారాష్ట్రలో జరుగుతున్నవి అసెంబ్లీ ఎన్నికలని, ప్రధానమంత్రిని ఎన్నుకునేవి కావని వ్యంగ్యంగా మాట్లాడుతూ ఆయన మోదీ ఎన్నికల ప్రచారాన్ని తప్పుబట్టారు. కాగా, మహారాష్ట్రలో నెలకొల్పాల్సిన పరిశ్రమలు, పెద్ద ప్రాజెక్టులను స్వార్థబుద్ధితో గుజరాత్‌కు తరలిస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఆరోపించారు. ఆదివారం మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆమె ప్రసంగించారు.

హైపర్‌సానిక్ క్లబ్‌లో భారత్

(మొదటి పేజీ తరువాయి)

ప్రయోగిస్తోంది కూడా. అలాగే.. అమెరికా, చైనా హైపర్‌సానిక్ క్షిపణి పరీక్షలను విజయవంతంగా నిర్వహించాయి. తాజా ప్రయోగంతో.. హైపర్‌సానిక్ సత్తా ఉన్న ఆ దేశాల సరసన భారత్ చేరిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. దీన్నో చరిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ క్షిపణి ప్రాంగణం సహా దేశంలోని వివిధ డీఆర్‌డీవో పరిశోధనశాలలు, ఇతర పారిశ్రామిక భాగస్వాములతో కలిసి డీఆర్‌డీవో దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ క్షిపణి.. 1500 కిలోమీటర్లకు మించిన దూరంలోని లక్ష్యాలను హైపర్‌సానిక్ వేగంతో దూసుకెళ్లి ఛేదించగలదు. హైపర్‌సానిక్ క్షిపణులు రెండు రకాలు. ఒకటి.. హైపర్‌సానిక్ గ్లైడ్ వెహికల్స్ (హెచ్‌జీవీ). రెండు.. హైపర్‌సానిక్ క్రూయిజ్ మిసైల్ (హెచ్‌సీఎం). హెచ్‌జీవీలను రాకెట్ బూస్టర్‌తో లాంచ్ చేస్తారు. నిర్దిష్ట ఎత్తుకు చేరిన తర్వాత.. క్షిపణి బూస్టర్ నుంచి విడివడి నిర్దేశిత మార్గంలో లక్ష్యం దిశగా దూసుకుపోతాయవి. హైపర్‌సానిక్ క్రూయిజ్ క్షిపణులు అలా కాదు. స్క్రామ్ జెట్ ఇంజన్ల సాయంతో మొత్తం ప్రయాణంలో హైపర్‌సానిక్ వేగాన్ని అలాగే కొనసాగిస్తాయి(ఈ స్క్రామ్ జెట్ ఇంజన్లలోకి గాలి సూపర్‌సానిక్ వేగంతో లోపలికి వెళ్లి హైపర్‌సానిక్ వేగంతో బయటకు వస్తుంది). బాలిస్టిక్ క్షిపణుల కన్నా తక్కువ ఎత్తులో, ఎగువ వాతావరణంలో ప్రయాణిస్తాయి. ఇంకా.. అమిత వేగం, మెన్యూవరబిలిటీ (ప్రయాణంలో ఉండగానే తన దిశ ను మార్చుకోగలగడం) వంటి లక్షణాలు ఉండడం తో.. సంప్రదాయ క్షిపణి రక్షణ వ్యవస్థలు గుర్తించి, అడ్డుకునేలోపే ఇవి లక్ష్యంపై విరుచుకుపడిపోతాయి. కాగా.. ఫ్రాన్స్, జర్మనీ, ఇరాన్, ఇజ్రాయెల్, ఆస్ట్రేలియా, జపాన్ కూడా హైపర్‌సానిక్ క్షిపణుల అభివృద్ధికి కృషి చేస్తున్నాయి.

విశ్వ సుందరి.. విక్టోరియా కెజార్

డెన్మార్క్ భామను వరించిన కిరీటం

న్యూఢిల్లీ, నవంబరు 17: డెన్మార్క్‌కు చెందిన విక్టోరియా కెజార్ హెల్విగ్ 2024 సంవత్సరానికి మిస్ యూనివర్స్‌గా ఎంపికయ్యారు. మెక్సికోలోని ఎరెనా నగరంలో శనివారం జరిగిన ఈ పోటీలకు 120 మంది యువతులు హాజరయ్యారు. నైజీరియాకు చెందిన చిడిమా ఎడెషినా ద్వితీయ స్థానంలో, మెక్సికోకు చెందిన మరియా ఫెర్నాండ బెల్ట్రాన్ తృతీయ స్థానంలో నిలిచారు. భారత్‌కు చెందిన రియా సింఘా తుది 30 మందిలో చోటు దక్కించుకున్నారు.

ఆప్‌ను వీడిన రవాణా మంత్రి కైలాష్ గెహ్లోత్

- ఎన్నికల వేళ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ, నవంబరు17: ఆమ్ ఆద్మీ పార్టీకి ఢిల్లీలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రవాణా శాఖ మంత్రి కైలాష్ గెహ్లోత్ తన మంత్రి పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. అతి త్వరలో ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో గెహ్లోత్ రాజీనామా చేయడం సంచలనంగా మా రింది. రాజీనామాకు ఆయన చెప్పిన కారణాలు కలకలం రేపాయి. ఓ పక్క ఆమ్ ఆద్మీ(సామాన్యుడు) సంక్షేమమే లక్ష్యమంటూ మరోపక్క 45 కోట్ల రూపాయల ఖర్చుతో సీఎం అధికారిక నివాసాన్ని శీశ్‌మహల్ తరహాలో పునర్నిర్మించారని ఆయన విమర్శించారు. యమునా నది శుద్ధిని గాలికి వదిలేశారని గెహ్లోత్ ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యులకు సేవ చేసేందుకు ఏర్పాటు చేసిన ఆప్ తన లక్ష్యానికి దూరంగా జరిగిపోయిందని, తానిక పార్టీతలో కొనసాగలేక రాజీనామా చేస్తున్నట్లు లేఖలో రాశారు. కైలాష్ గెహ్లోత్ రాజీనామా బీజేపీ కుట్ర ఫలితమేనని ఆప్ ఆరోపించింది. గెహ్లోత్‌పై ఐటీ, ఈడీ వంటి సంస్థలను ఉసిగొల్పి దాడులు చేయించిందని, మరో మార్గంలేక ఆయన బీజేపీలో చేరబోతున్నారని ఆరోపణలు చేసింది. కైలాష్ గెహ్లోత్ బీజేపీలో చేరతారని జోరుగా ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఢిల్లీ బీజే పీ మాజీ ఎమ్మెల్యే అనిల్ ఝా ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. కేజ్రీవాల్ విధానాలు నచ్చి ఆప్‌లో చేరుతున్నట్లు ఝా చెప్పారు.

మణిపూర్‌లో ఉన్మాదం

రెండేళ్ల పసి బాలుడి తల, చేతులు నరికి హత్య

- కుటుంబంలోని ఆరుగురినీ చంపేశారు
- వెలుగులోకి కుకీ మిలిటెంట్ల దుశ్చర్య



కుకీ మిలిటెంట్ల హింసాకాండను నిరసిస్తూ మణిపూర్‌లోని జిరిబమ్ జిల్లాలో టైర్లకు నిప్పు పెట్టి ఆందోళనకు దిగిన ప్రజలు

ఇంఫాల్, గౌహతి, న్యూఢిల్లీ, నవంబరు 17: ఉన్మాదం రాజ్యమేలుతున్నప్పుడు మనుషులు మనుషులుగా ఉండరు. రాక్షసులుగా తయారై కనీస మానవ విలువలకు కూడా దూరమవుతారు. మణిపూర్ హింసాకాండ దీనినే కళ్లకు కడుతోంది. తాము అపహరించుకెళ్లిన ఆరుగురినీ హత్య చేసిన కుకీ మిలిటెంట్లు.. వారిలో ఓ రెండేళ్ల బాలుడిని తల, చేతులు నరికి అత్యంత దారుణంగా చంపిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. తల, రెండు చేతులూ లేని ఆ చిన్నారి మృతదేహం జిరిబమ్ ప్రాంతంలోని బరాక్ నదిలో దొరికింది. అదే నదిలో ఆ బాలుడి అమ్మమ్మ మృతదేహం కూడా అర్ధనగ్న స్థితిలో బయటపడింది. సోమవారం కుకీ మిలిటెంట్లు.. మెయితీ తెగకు చెందిన వీరి కుటుంబాన్ని ఓ శరణార్థి శిబిరం నుంచి అపహరించుకెళ్లిన విషయం తెలిసిందే. కిడ్నాప్‌నకు గురైన వారిలో రెండేళ్ల బాలుడు, ఎనిమిది నెలల వయసున్న అతడి తమ్ముడు, తల్లి, అమ్మమ్మ, చిన్నమ్మ, ఆమె కూతురు.. మొత్తం ఆరుగురు ఉన్నారు. అందరి మృతదేహాలు బరాక్ నదిలోనే శుక్ర, శనివారాల్లో లభ్యమయ్యాయి. ఈ దారుణ హత్యలతో ఎప్పుడేం జరుగుతుందోనని ప్రజలు వణుకుతున్నారు. శనివారం రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లో ఏకం గా ముఖ్యమంత్రి నివాసంపైనే మెయితీ నిరసనకారులు దాడికి దిగారు. పలువురు మంత్రులు, బీజేపీ ఎమ్మెల్యేల ఇళ్లను దగ్ధం చేశారు. బాధిత కుటుంబాన్ని రక్షించటానికి ప్రభుత్వం తగిన ప్రయత్నాలు చేయలేదని నిరసనకారులు ఆరోపిస్తున్నారు.

ఎన్‌కౌంటర్‌తో మళ్లీ హింస మొదలు..

గత ఏడాది మే నుంచి జాతుల సంఘర్షణతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో.. ఇటీవల సీఆర్‌పీఎఫ్ జవాన్లతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 10 మంది కుకీ మిలిటెంట్లు మరణించటంతో హింసాకాండ మరోసారి ప్రజ్వరిల్లింది. మరణించిన వారందరూ మెయితీ మిలిటెంట్ల దాడుల నుంచి రక్షణ కోసం గ్రామ వలంటీర్లుగా పని చేస్తున్నారని, వారిని సీఆర్‌పీఎఫ్ వాళ్లు కావాలనే పట్టుకొని చంపారని కుకీ సంఘాలు ఆరోపించాయి. ఇదిలా ఉండగానే, గురువారం కుకీల్లోనే ఓ తెగకు చెందిన మహిళను మెయితీ మిలిటెంట్లు అత్యంత దారుణంగా చంపారు. ముగ్గురు పిల్లల తల్లి అయిన ఆ మహిళ కాలిపై మేకులు కొట్టి చిత్రహింసలు పెట్టారు. సామూహిక అత్యాచారం జరిపి, ఆ తర్వాత ఆమెను సజీవ దహనం చేశారు. ఈ ఘటనల నేపథ్యంలోనే, కుకీ మిలిటెంట్లు.. మెయితీ కుటుంబాన్ని కిడ్నాప్ చేసి చంపారు.

బీజేపీ విద్వేష రాజకీయాల కోసమే: ఖర్గే

తన విద్వేషపూరిత రాజకీయాల కోసమే అందమైన సరిహద్దు రాష్ట్రం మణిపూర్ తగలబడాలని బీజేపీ కోరుకుంటున్నట్లు అర్థమవుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. తాజా హింసాకాండపై ఆదివారం ఆయన ఎక్స్‌లో స్పందించారు. 'మే 2023 నుంచీ ఊహించనలవి కానంతటి బాధలో, హింసాకాండలో మణిపూర్ ఉంది. ఇది ఆ రాష్ట్ర ప్రజల భవిష్యత్తును సర్వనాశనం చేసింది. మణిపూర్‌ను ప్రధాని మోదీ విఫలం చేశారు' అని ఖర్గే పేర్కొన్నారు. మణిపూర్‌ను సందర్శించి, అక్కడ శాంతిభద్రతల స్థాపనకు ప్రయత్నించాలని మోదీని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కోరారు. కాగా, రాష్ట్రంలోని అన్ని మిలిటెంట్ సంస్థలపైనా ఉక్కుపాదం మోపాలని మెయితీ పౌరహక్కుల సంఘం 'కొకొమీ'.. ఆదివారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. 24 గంటల్లో గట్టి చర్యలు చేపట్టాలంటూ అల్టిమేటం జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రతినిధులు, ఎమ్మెల్యేలు కలిసి కూర్చొని సంక్షోభ నివారణకు కృషి చేయాలని పిలుపునిచ్చింది.

సర్కారుకు ఎన్‌పీపీ మద్దతు ఉపసంహరణ


మణిపూర్‌లో హింసాకాండను అదుపులోకి తీసుకురావటంలో విఫలమైనందుకు బీజేపీ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నట్టు నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) ప్రకటించింది. ఈ మేరకు బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాకు ఎన్‌పీపీ అధ్యక్షుడు, మేఘాలయ ముఖ్యమంత్రి కన్రాడ్ సంగ్మా ఆదివారం లేఖ రాశారు. రాష్ట్రంలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించటంలో, శాంతిభద్రతలను పునరుద్ధరించటంలో బీరేన్‌సింగ్ సారథ్యంలోని ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆ లేఖలో సంగ్మా పేర్కొన్నారు. కాగా, మణిపూర్‌లో ఆందోళన పరిస్థితుల నేపథ్యంలో.. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మహారాష్ట్రలో ఆదివారం పాల్గొనాల్సిన ఎన్నికల ప్రచార కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. హోంశాఖ సీనియర్ అధికార్లతో ఢిల్లీలో సమీక్ష జరిపారు. మణిపూర్‌లో శాంతిభద్రతల పునరుద్ధరణకు అన్ని చర్యలూ తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు.

మోదీకి నైజీరియా రెండో అత్యున్నత పురస్కారం

- నైజీరియాలో ప్రధానికి ఘన స్వాగతం

న్యూఢిల్లీ, నవంబరు 17: తొలిసారి నైజీరియా పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీకి ఆ దేశంలో అరుదైన గౌరవం దక్కింది. నైజీరియా రెండో అత్యున్నత పురస్కారం అయిన 'గ్రాండ్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది నైగర్' అవార్డుతో ఆ దేశం మోదీని సత్కరించింది. ఈ అవార్డును ఆదివారం మోదీకి అందజేసింది. నైజీరియన్లు కాకుండా.. 1969లో క్వీన్ ఎలిజబెత్ తర్వాత ఈ అవార్డును అందుకున్న రెండో విదేశీ వ్యక్తి మోదీనే కావడం విశేషం. ఈ అవార్డును తనకు అందజేసిన నైజీరియా ప్రభుత్వానికి, ఆ దేశ ప్రజలకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డును 140 కోట్ల భారతదేశ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. విదేశాల్లో మోదీ అందుకున్న అత్యున్నత అంతర్జాతీయ అవార్డుల్లో ఇది 17వ పురస్కారం. ఆ దేశాధ్యక్షుడు బోలా అహ్మద్ తినూబూ ఆహ్వానం మేరకు ఆదివారం నైజీరియా చేరుకున్న మోదీకి అక్కడ ఘన స్వాగతం లభించింది. నైజీరియా ప్రధానమంత్రి నెసోమ్ ఎజెన్వో ఎయిర్‌పోర్టుకు చేరుకుని మోదీని అబుజా నగరంలోకి ఆహ్వానిస్తున్నట్లు సంకేతంగా ఓ తాళాన్ని అందజేశారు. ఓ వ్యక్తిపై నమ్మకం, గౌరవానికి సూచికగా నైజీరియన్లు ఆ తాళాన్ని అందజేస్తారని భారత విదేశీ వ్యవహారాలశాఖ ఎక్స్‌లో పేర్కొంది. అనంతరం ఆ దేశాధ్యక్ష భవనానికి చేరుకున్న మోదీ నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ తినుబూతో సమావేశమై ఇరు దేశాల మధ్య బంధం మరింత బలోపేతమయ్యేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. నైజీరియా పర్యటన అనంతరం జీ- 20 సదస్సులో పాల్గొనేందుకు మోదీ బ్రెజిల్ వెళ్లనున్నారు. అటు నుంచి గయానా వెళ్లి భారత్‌కు తిరిగి రానున్నారు.

నైజీరియాలో తెలంగాణ ప్రవాసికి ప్రధాని ప్రశంసలు



ప్రదీప్ ఫొటోపై సంతకం చేస్తున్న మోదీ

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి): నైజీరియాలో ఉంటూ ఆఫ్రికా దేశాల్లో భారతీయ సంస్కృతి పరిరక్షణకు పాటు పడుతున్న తెలంగాణ ప్రవాసిని ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. యాదాద్రి జిల్లా ఆలేరు మండలం క్రాంతినగర్ గ్రామానికి చెందిన బిర్కూరి ప్రదీప్ నైజీరియాలో పని చేస్తున్నారు. ఆయన నైజీరియాతో పాటు ఆఫ్రికా దేశాల్లో భారతీయ సంస్కృతి, ఆచార వ్యవహారాలు, విలువల పరిరక్షణకు తన వంతుగా కృషి చేస్తున్నారు. అలాగే ఆఫ్రికాలోని ఎత్తయిన కిలిమంజారో పర్వత శిఖరాన్ని కూడా అధిరోహించారు. ప్రదీప్ కృషిని గుర్తించిన భారత రాయబార కార్యాలయం.. ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా అబుజాలో ఆయన చేతుల మీదుగానే సత్కరించింది. ఈ సందర్భంగా కిలిమంజారో పర్వత శిఖరాన్ని అధిరోహించిన క్రమంలో ప్రదీప్ ప్రధాని చిత్రపటంతో దిగిన ఫొటోను చూపారు. దీంతో ఆయన్ను అభినందిస్తూ మోదీ దానిపై తన సంతకం చేశారు. బీజేపీ అభిమాని అయిన ప్రదీప్.. నైజీరియాలోని తెలుగు ప్రవాసి ప్రముఖుల్లో ఒకరు.

నిజం వెలుగులోకి వస్తోంది..

- 'ది సబర్మతీ రిపోర్టు'పై ప్రధాని మోదీ ప్రశంసలు

న్యూఢిల్లీ, నవంబరు 17: గోద్రా రైలు దహనకాండ, గుజరాత్ అల్లర్లపై తెరకెక్కిన 'ది సబర్మతీ రిపోర్టు' సినిమాపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. సినిమా ద్వారా అసలు నిజం వెలుగులోకి వస్తోందంటూ వ్యాఖ్యానించారు. అది కూడా సామాన్యులకు అర్థమయ్యేలా చూపించారని చిత్ర బృందాన్ని కొనియాడారు. ఈ చిత్రం తప్పక చూడాల్సిన సినిమా అంటూ 'ఎక్స్'లో ఓ నెటిజన్ పెట్టిన సుదీర్ఘ పోస్టును షేర్ చేసి మోదీ స్పందించారు. 'నిజం బయటికొస్తోంది. కల్పిత కథలు కొంతకాలమే కొనసాగుతాయి. వాస్తవాలు ఎప్పటికైనా బయటికి రాక తప్పదు' అంటూ పేర్కొన్నారు. మోదీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు (2002లో) గోద్రాలో కొందరు దుండగులు సబర్మతీ ఎక్స్‌ప్రె‌స్‌కు నిప్పంటించి.. దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో 58 మంది ప్రాణాలు కోల్పోయారు. అనంతరం గుజరాత్ అంతటా అల్లర్లు వ్యాపించి దాడుల్లో వందలాది మంది మరణించారు.

రాబందులు కనుమరుగు



పాలరాపుగుట్ట, గుట్టపై వాలుతున్న రాబందు(ఫైల్)



జాడ లేకుండా పోతున్న పక్షులు

» ఆహారం దొరక్క ఆవాసాన్ని మార్చాయని అంచనా

ఆసిఫాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో సహజసిద్ధంగా పారిశుధ్య కార్మికుల్లా పరోక్ష సేవలందించే జీవులైన రాబందులు జాడ లేకుండా పోతున్నాయి. మరణించిన జంతువుల కళేబరాలను తింటూ వ్యాధుల వ్యాప్తిని అడ్డుకుంటూ పరోక్షంగా మనుషులకు మేలు చేసే ఈ పక్షుల సంఖ్య అత్యంత వేగంగా తగ్గిపోతుంది. గత 20 ఏళ్లలో దేశ వ్యాప్తంగా సుమారు 4 కోట్ల రాబందులు మరణించినట్టు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. తెలంగాణలోనూ ఇవి అరకొరగానే కనిపిస్తున్నాయి. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని పెంచికలపేట మండలం అటవీ ప్రాంతంలోని పాలరాపుగుట్టపై రెండు నెలలుగా రాబందుల జాడ కనిపించడం లేదు. ప్రాణహిత, పెద్దవాగు సంగమ తీరాన 200మీటర్ల ఎత్తులో ఉన్న పాలరాపు గుట్ట ఒకప్పుడు రాబందులకు స్థావరంగా ఉండేది. 2013లో అప్పటి అటవీ రేంజ్ అధికారి రామ్మోహన్ ఈ గుట్టపై రాబందుల ఉనికిని గుర్తించి సంరక్షణ చర్యలు చేపట్టారు. రెండ్రోజులకు ఒకసారి పాలరాపు గుట్ట వద్ద ఓ పశు కళేబరాన్ని రాబందులకు ఆహారంగా ఉంచేవారు. రాబందుల కదలికలను గుర్తించేందుకు పరిశోధకుడితోపాటు ప్రత్యేక బేస్ క్యాంపు కూడా ఏర్పాటు చేశారు. దీంతో రాబందుల సంఖ్య 30 వరకు చేరింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పాలరాపుగుట్టను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని అప్పటి అటవీ మంత్రి జోగు రామన్న ప్రకటించారు. ఆ తర్వాత రాబందుల సంరక్షణను అధికారులు గాలికొదిలేశారు. దీంతో ఆహారం దొరక్క, సంరక్షణ లేక రాబందులు తమ ఆవాసాన్ని మార్చుకున్నాయి. ఈ ప్రాంతంలోని రాబందులు మహారాష్ట్రలోని కమలాపూర్ వల్చర్ పాయింట్‌కు వలస వెళ్లాయని అంటున్నారు. పైగా, రెండు నెలల క్రితం కురిసిన వర్షాలకు పాలరాపుగుట్టపైన రాబందుల గూళ్లు కూడా ఛిద్రమయ్యాయి. ఇక, ప్రతిఏటా శీతాకాలంలో హిమాలయాల నుంచి పాలరాపుగుట్టకు వచ్చే హిమాలయన్ గ్రిఫిన్ సంతతి రాబందులైతే మూడేళ్లుగా ఈ పక్కకే రావడం లేదు. ప్రభుత్వం, అటవీ అధికారులు స్పందించి రాబందుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని జీవ వైవిధ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

అబూజ్‌మడ్ అడవుల్లో ఆగని కాల్పులు

» 32 గంటలుగా భీకర పోరు

» మృతదేహాల తరలింపులో ఆలస్యం

చర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్, కాంకేర్ జిల్లాల సరిహద్దు అబూజ్‌మడ్ అడవుల్లో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో ఇంకా మావోయిస్టులు కాల్పులు జరుపుతున్నారని పోలీసులు చెబుతున్నారు. సుమారు 32 గంటల నుంచి కాల్పులు జరుగుతున్నాయని వెల్లడిస్తున్నారు. దీంతో మృతదేహాల తరలింపు ఆలస్యమవుతుందంటున్నారు. ఇదిలా ఉండగా అబూజ్‌మడ్ అడవుల్లోని తకమెట, ముస్పరాసి గ్రామాల నుంచి గూడ్సు కోర్సా, దినేష్ కోర్సా, సుకు మడివి, సోమా కోర్సా రాము కోర్సా, ముస్పర్సీ హేమూ కోర్సా, లూలావాడే అనే ఎనిమిది మంది గ్రామస్థులను బలగాలు అదుపులోకి తీసుకున్నాయని, వారిని వెంటనే విడిచి పెట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

గిరిజనుడిపై అటవీ శాఖ అధికారుల దాడి


» పోలీసులకు ఫిర్యాదు

వేమనపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చీపురు పుల్లల సేకరణకు అడవిలోకి వెళ్లిన గిరిజనుడిపై అటవీశాఖ అధికారులు దాడి చేసిన ఘటన మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కల్లెంపల్లి గ్రామానికి చెందిన బాధితుడు కుస్రం రవీందర్ ఆదివారం మాట్లాడుతూ.. తాను, ఆత్రం బక్కయ్య కలిసి ఈ నెల 15న చీపురు పుల్లల సేకరణకు అడవిలోకి వెళ్లామని తెలిపారు. అనంతరం లక్క కోసం ఓ మోదుగ చెట్టును నరుకుతుండగా అధికారులు బేగ్, పాషా తమపై దాడి చేయబోగా బక్కయ్య తప్పించుకుని పారిపోయాడన్నారు. తనపై వారు కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారని తెలిపారు. కుష్నపల్లి రేంజ్ కార్యాలయానికి తీసుకెళ్లి తర్వాత వదిలేయడంతో ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నానన్నాడు. ఆదివారం నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో అధికారులపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి ఎర్మ పున్నం మాట్లాడుతూ.. అటవీశాఖ అధికారులు గిరిజనుడిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఇల్లు తాకట్టు పెట్టి స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు

రూ.35 లక్షల నష్టం.. మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

రాజన్న సిరిసిల్ల జిల్లా సింగారంలో ఘటన



బండి స్వామిగౌడ్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్టాక్ మార్కెట్‌లో లాభాలొస్తాయనే నమ్మకంతో ఓ యువకుడు తను దాచుకున్న డబ్బుతో పాటు ఇల్లు తాకట్టు పెట్టి మరీ పెట్టుబడులు పెట్టాడు. చివరకు పెట్టిన డబ్బంతా నష్టపోయి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చెందిన బండి స్వామి గౌడ్ (35) కొన్ని రోజులుగా స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతున్నాడు. వ్యాపారం చేస్తూ తను దాచుకున్న డబ్బుతో పాటు, స్వగ్రామంలోని తన ఇంటిని తాకట్టు పెట్టి మొత్తం రూ.35 లక్షలు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాడు. ఆ మొత్తం నష్టపోయాడు. దీంతో మనస్తాపం చెందిన స్వామి గౌడ్ ఈ నెల 9న పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించగా వారం రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

ర్యాగింగ్‌ను ఉపేక్షించొద్దు

» ఖమ్మంలో మెడికోకు గుండు కొట్టించడంపై మంత్రి దామోదర ఆగ్రహం

» బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశం

» కళాశాలలో ఏసీపీ విచారణ.. కేసు నమోదు

హైదరాబాద్, ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థిని ర్యాగింగ్ చేసి గుండు కొట్టించిన ఘటనపై ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఉన్నతాధికారులతో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. విచారణ జరిపి, తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ర్యాగింగ్ వల్ల జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, అన్ని కళాశాలల్లో ఈ మేరకు కార్యక్రమాలు నిర్వహించాలని, పోలీస్ శాఖ సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు. ర్యాగింగ్ ప్రభావం విద్యార్థులపై పడకుండా చూడాలన్నారు. జూనియర్లతో సీనియర్ విద్యార్థులు స్నేహంగా ఉండాలని, ర్యాగింగ్ పేరిట భయాందోళనలకు గురి చేయొద్దని హితవు పలికారు. కాగా, ఖమ్మం మెడికల్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థికి ఈ నెల 12న యాంటీ ర్యాగింగ్ మెడికల్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రెహ్మాన్ గుండు గీయించాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ అంశాన్ని 'ఆంధ్రజ్యోతి' ఆదివారం ప్రచురించింది. దీంతో మంత్రి దామోదర స్పందించారు. కాగా, బాధిత విద్యార్థి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ర్యాగింగ్ నిరోధానికి సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావును సీపీ వివరాలు అడిగినట్లు, తక్షణమే ఫిర్యాదు చేయాలని కోరారని తెలిసింది. మరోవైపు ఏసీపీ రమణ మూర్తి, ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు ప్రాథమిక విచారణ నిర్వహించారు. రాష్ట్ర వైద్య విద్య ఉన్నతాధికారులు కూడా తీవ్ర ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు పూర్తి నివేదిక అందించాలని ఆదేశించారు. మరోవైపు వైద్య కళాశాల పురుషుల వసతిగృహం ఎదుట ఆదివారం ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

వైద్యానికి జవసత్వాలు!

మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు దూకుడు.. వైద్య ఆరోగ్య శాఖలో నియామకాల జోరు

» 11 నెలల్లో 7 వేల పైచిలుకు పోస్టుల భర్తీ

» తుది దశకు 435 సివిల్ అసిస్టెంట్ సర్జన్ల నియామకం, 19న ధ్రువపత్రాల పరిశీలన



హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు దూకుడుగా పని చేస్తోంది. ఒక దాని తర్వాత మరొకటి.. వరుసగా నోటిఫికేషన్లు జారీ చేస్తూ రాత పరీక్షలు నిర్వహిస్తూ నియామకాలు పూర్తి చేస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత గత 11 నెలల్లో ఏడు వేల పైచిలుకు పోస్టులను భర్తీ చేసింది. సెప్టెంబరులో మూడు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేసి నియామక ప్రక్రియ నిర్వహిస్తున్న మెడికల్ బోర్డు త్వరలో మరిన్ని నోటిఫికేషన్ల జారీకి సిద్ధంగా ఉందని అంటే దూకుడును అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే 435 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ (సీఏఎస్)ల నియామక ప్రక్రియ తుది దశకు చేరింది. ప్రొవిజనల్ మెరిట్ జాబితా ఆదివారం విడుదలైంది. జాబితాలో చోటు దక్కించుకున్న వారి ధ్రువ పత్రాల పరిశీలన వెంగళరావునగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో మంగళవారం(19న) జరగనుంది. ధ్రువ పత్రాల పరిశీలన అనంతరం ఎంపికైన వైద్యులకు ముఖ్యమంత్రి చేతులమీదుగా నియామక పత్రాలు అందించేందుకు బోర్డు కసరత్తు చేస్తోంది.

640 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు త్వరలో నోటిఫికేషన్

సీఏఎస్ వైద్యుల నియామక ప్రక్రియ పూర్తి కాగానే వైద్య విద్య సంచాలకుల పరిధిలోని 640కి పైగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి మెడికల్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఈ పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీతో కొత్తగా ఏర్పాటైన వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత కొంతమేరకు తగ్గనుంది. ఈ నోటిఫికేషన్ తర్వాత తెలంగాణ వైద్యవిధాన పరిషత్ పరిధిలో స్పెషలిస్టు వైద్యుల నియామకం ఉండనుంది. వైద్య విధాన పరిషత్ పరిధిలో ప్రస్తుతం 1600 పైచిలుకు స్పెషలిస్టు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే, ఈ ఖాళీ పోస్టుల్లో ఇప్పటికే 800 మంది స్పెషాలిటీ వైద్యులు ప్రస్తుతం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీళ్లలో కొందరిని రెగ్యులరైజ్ చెయ్యాల్సి ఉంది. రెగ్యులరైజేషన్ ముగిసిన తర్వాత మిగిలిన, ఖాళీగా ఉన్న పోస్టులకు కలిపి ఒకే నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది.

ఒకే నెలలో మూడు నోటిఫికేషన్లు

మెడికల్ బోర్డు గత నాలుగు నెలల్లో 4 నోటిఫికేషన్లు జారీ చేసింది. ఇందులో మూడు సెప్టెంబరులోనే విడుదల కావడం గమనార్హం. సెప్టెంబరు 11న 1284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు, 18న 2322 స్టాఫ్ నర్స్ పోస్టులకు, 24న 633 ఫార్మసిస్టు పోస్టులకు నోటిఫికేషన్లు జారీ చేసింది. ఇందులో ల్యాబ్ టెక్నీషియన్ల రాతపరీక్ష ఇప్పటికే పూర్తవగా, నర్సు పోస్టుల రాత పరీక్ష ఈ నెల 23న జరగనుంది. ఈ పోస్టులతో పాటు 156 ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు, 45 అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఎంఎన్‌జే) పోస్టులు, 24 ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీ ప్రక్రియ కూడా కొనసాగుతోంది. ఇక, గతేడాది నోటిఫికేషన్ విడుదల చేసిన ఎంపిహెచ్ఏ ఫీమేల్ పోస్టులకు డిసెంబరు 29న రాత పరీక్ష నిర్వహించనున్నారు.

దళారులను నమ్మకండి: మంత్రి రాజనర్సింహ

వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని, అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోవద్దని వైద్య, ఆరోగ్య శాఖ దామోదర రాజ నర్సింహ ఆదివారం సూచన చేశారు. మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా భవిష్యత్తులో మరిన్ని పోస్టులకు నోటిఫికేషన్లు వస్తాయన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా దళారులు తారసపడితే అభ్యర్థులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని మంత్రి ఈ సందర్భంగా హెచ్చరించారు.

క్రమబద్ధీకరణ కోసం 20 ఏళ్లుగా ఎదురుచూపు

» గిరిజన గురుకులాల బోధనేతర సిబ్బంది ఆవేదన

హనుమకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గిరిజన గురుకులాల్లోని కాంట్రాక్టు బోధనేతర సిబ్బంది 20 ఏళ్లుగా సర్వీసు క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో అనేక మంది రెగ్యులర్ కాకుండానే రిటైర్ అవుతున్నారు. తర్వాత ఎలాంటి ప్రయోజనాలు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తున్న ప్రభుత్వాలు.. వెట్టిచాకిరి చేస్తున్న తమను మాత్రం పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ క్రమబద్ధీకరణకు ఆర్థిక శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలోని గిరిజన గురుకులాల్లో మొత్తం 441మంది బోధనేతర సిబ్బంది 20 ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఇందులో కొత్తజిల్లాల వారీగా క్రమబద్ధీకరణకు అర్హత కలిగినవారు 316మంది ఉన్నారు. వీరిలో ఎస్టీ, బీసీలే ఎక్కువ మంది ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమను రెగ్యులరైజ్ చేయాలని వారు కోరుతున్నారు.

రూ.50 కోట్ల సర్కారు స్థలానికి ఎసరు!

గుండ్లపోచంపల్లి మునిసిపాలిటీలో మరో భూ బాగోతం.. 4 ఎకరాల 23 గుంటల భూమి కబ్జా

» ఇళ్లు, షెడ్లు, పశువుల కొట్టాల నిర్మాణం

» ప్రభుత్వ హద్దురాళ్లున్నా బేఖాతరు

» దోబీఘాట్‌కు కేటాయించిన ఎకరా కూడా ఆక్రమణ



ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు, పశువులపాక

మేడ్చల్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రూ.50 కోట్ల విలువ చేసే సర్కారు స్థలానికి కొందరు ఎసరు పెట్టారు. అడిగే వారు లేరన్న ధీమాతో ప్రభుత్వ భూమిలో దర్జాగా ఇళ్లు, షెడ్లు, పశువుల కొట్టాలు ఏర్పాటు చేసుకున్నారు. హైదరాబాద్ నగరానికి ఆనుకొని ఉన్న గుండ్లపోచంపల్లి మునిసిపాలిటీ పరిధిలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయంటూ ఇప్పటికే పలు ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు మరో భూ భాగోతం వెలుగు చూసింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గుండ్లపోచంపల్లి మునిసిపాలిటీ ఖాజీగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 30లో ఉన్న 4 ఎకరాల 23 గుంటల ప్రభుత్వ భూమి కబ్జాల పాలవుతోంది. కొంపల్లి మునిసిపాలిటీ పరిధిలోని దూలపల్లి గ్రామానికి చెందిన కొందరు ఈ భూమిని ఆక్రమించుకొని తొలుత తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారు. పశువుల కొట్టాలు, షెడ్లు వేశారు. ఈ కబ్జాలపై స్థానిక మునిసిపల్ అధికారులు 2022 మార్చి 21వ తేదీన రెవెన్యూ అధికారులకు వివరాలు తెలియజేస్తూ ఒక లేఖ (నెంబరు.ఏఆర్‌జీ 1/89/2022) పంపారు. కానీ, ఆ లేఖపై రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలున్నాయి. దీంతో అదే ఏడాది డిసెంబరు 27వ తేదీన మునిసిపల్ కౌన్సిల్ సభ్యులు నేరుగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్.. ప్రభుత్వ భూమిని సర్వే చేయించి హద్దు రాళ్లు పాతించారు. అక్కడ ఉన్న తాత్కాలిక నిర్మాణాలను తొలగించారు. ఇదే క్రమంలో గత ఏడాది అక్టోబరు 16న జిల్లా ఉన్నతాధికారులు ఒక ఎకరం స్థలాన్ని ధోబీ ఘాట్ నిర్మాణం కోసం రజకులకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, కబ్జాదారులు మరోసారి పడగ విప్పారు. 4 ఎకరాల 23 గుంటల ప్రభుత్వ భూమిలో ఈసారి ఏకంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వాటితో పాటు పశువుల పాకలు, షెడ్లను నిర్మించుకున్నారు. దోబీ ఘాట్ కోసం కేటాయించిన ఎకరం స్థలాన్ని సైతం కబ్జా చేశారు. ఈ కబ్జాలు రెవెన్యూ అధికారుల అండదండలతో కొనసాగుతున్నాయంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఇదే మునిసిపాలిటీ పరిధిలోని సర్వే నెంబరు 509లో ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన 315 చదరపు గజాల స్థలం కబ్జా విషయంలో కూడా రెవెన్యూ అధికారులు మెతక వైఖరి అవలంబించారన్న విమర్శలు వచ్చాయి.

విచారణ జరుపుతాం: తహసీల్దార్

ఖాజీగూడ సర్వే నంబర్ 30లోని ప్రభుత్వ స్థలం వివాదంపై విచారణ జరుపుతామని మేడ్చల్ తహసీల్దార్ శైలజ తెలిపారు. ఈ స్థలంలో ఐఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు ప్రతిపాదన ఉందన్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని, సదరు నిర్మాణాలను కూల్చివేయటమే గాక ఆయా వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సంగారెడ్డి కలెక్టర్ సంతకం ఫోర్జరీ

రూ.40 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి విక్రయానికి ఎన్‌వోసీ తయారీ

» స్వాతంత్ర్య సమరయోధుల వారసుల కుట్ర

» ఐదుగురి అరెస్టు, పరారీలో మరో నలుగురు

రామచంద్రాపురం, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుల వారసులు కొందరు అక్రమానికి పాల్పడ్డారు. తమది కాని ఆ భూమిని విక్రయించి సొమ్ము చేసుకునేందుకు అడ్డదారి తొక్కారు. ఏకంగా కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నిరంభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) సృష్టించి దొరికిపోయి కటకటాలపాలయ్యారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం కొల్లూరులోని సర్వే నం191లోని భూమిని ఒక్కొక్కరికి రెండెకరాల చొప్పున 74 మంది స్వాతంత్ర్య సమరయోధులకు 1984లో ప్రభుత్వం కేటాయించింది. ఇందులో అల్లాదుర్గం, టేక్మాల్‌కు చెందిన ఐదుగురు స్వాతంత్ర్య సమరయోధులున్నారు. అయితే, వీళ్ల వారసులు వీరేశం, రాములు, సుధాకర్, సంతోష్, నాగరాజు బృందంగా ఏర్పడి సర్వే నం.191లోని ఓ రెండు ఎకరాలను విక్రయానికి పెట్టారు. రూ.40 కోట్లు పలికే ఆ భూమిని కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చిన ఓ వ్యక్తి రూ.2.5 లక్షలు వారికి బయానాగా ఇచ్చాడు. అయితే, సదరు భూమి క్రయవిక్రయాలకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ఎన్‌వోసీ తనకు కావాలని షరతు పెట్టాడు. దీంతో కలెక్టర్ కార్యాలయం దగ్గర దళారీగా పని చేసే శ్రీనివాసచారి అనే వ్యక్తిని వారసుల బృందం కలిసింది. శ్రీనివాసచారి మరికొందరితో కలిసి సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఎన్‌వోసీ సృష్టించాడు. ఈ విషయం నెమ్మదిగా బయటపడగా స్థానిక తహసీల్దార్ సంగ్రారెడ్డి ఈ నెల 14న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో చర్యలు తీసుకున్న పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేసి శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో నలుగురి కోసం గాలిస్తున్నారు. కాగా, నిందితులు విక్రయించడానికి యత్నించింది ప్రభుత్వ భూమి అని తహసీల్దార్ సంగ్రారెడ్డి స్పష్టం చేశారు. సదరు భూమి స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయించినప్పటికీ ప్రభుత్వం ఇదివరకే వెనక్కి తీసుకుందని తెలిపారు. తాను ఇటీవలే విధుల్లో చేరానని, భూమిని ఎందుకు వెనక్కి తీసుకున్నారనే అంశం తెలుసుకునేందుకు రికార్డులు పరిశీలించాల్సి ఉందని చెప్పారు.

విశాఖలో ఉద్యోగం.. ముంబైలో లంచం!

» సీబీఐ వలలో విశాఖ రైల్వే అధికారి

» రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆయనో ఐఆర్ఎస్ అధికారి.. తన పరిధిలో జరుగుతున్న కోట్లాది రూపాయల పనులకు సంబంధించి ఓ కాంట్రాక్టరుతో భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేశారు. విశాఖ కేంద్రంగా పనిచేసే ఆయన.. ఎవ్వరికీ అనుమానం రాకుండా లంచం సొమ్ము తీసుకునేందుకు ముంబై నగరాన్ని ఎంచుకున్నారు. సదరు కాంట్రాక్టరును అక్కడి ఓ హోటల్‌లో కలుసుకుని పాతిక లక్షల తీసుకుంటూ సీబీఐకి అడ్డంగా దొరికిపోయారు. ఆయనే.. తూర్పు కోస్తా రైల్వే జోన్ పరిధిలోని వాల్తేరు రైల్వే డివిజనల్ మేనేజర్ సౌరభ్ ప్రసాద్. రైల్వేలో డివిజన్ స్థాయి అధికారి ఇంత పెద్ద మొత్తంలో లంచం తీసుకుంటూ పట్టుబడడం ఆయా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాలివీ.. సౌరభ్ ప్రసాద్ ఇండియన్ రైల్వే సర్వీసు (ఐఆర్ఎస్)కు చెందిన 1991వ బ్యాచ్ అధికారి. మెకానికల్ ఇంజనీరింగ్ చదివి రైల్వేలో అడుగుపెట్టారు. అనేక కీలక పదవులు నిర్వహించారు. కొంకణ్ రైల్వే కార్పొరేషన్‌లో డిప్యుటేషన్‌పై పనిచేసి, ఆ తరువాత ముంబైలోని సెంట్రల్ రైల్వేలో చీఫ్ రోలింగ్ స్టాక్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తూ గత ఏడాది జూలై 21న వాల్తేరు డీఆర్ఎంగా విశాఖపట్నంలో బాధ్యతలు చేపట్టారు. మెకానికల్ బ్రాంచ్‌కు సంబంధించి కాంట్రాక్టు ఇవ్వడానికి ఓ కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపి భారీ మొత్తం డిమాండ్ చేశారని తెలిసింది. ఇందులో తొలుత రూ.25 లక్షలు పుచ్చుకోవడానికి ఎవరికీ అనుమానం రాకుండా ముంబై నగరాన్ని ఎంచుకున్నారు. ఈ వ్యవహారం చక్కబెట్టడానికి ఆయన సెలవు పెట్టి.. ఓ వివాహ కార్యక్రమానికి వెళ్తున్నట్లు ఇక్కడ అందరినీ నమ్మించారు. అయితే సదరు కాంట్రాక్టర్ అంతకుముందే సీబీఐని ఆశ్రయించారు. అధికారుల ప్రణాళిక ప్రకారం శనివారం ముంబైలోని ఒక హోటల్‌లో కాంట్రాక్టర్ నుంచి డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ రూ.25 లక్షలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

పొలంలో కరెంట్‌షాక్‌తో రైతు మృతి

ములుగు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పొలంలో మోటార్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి చెందాడు. ములుగు జిల్లా ములుగు మండలం జగ్గన్నగూడేనికి చెందిన కొట్టెం పెద్దసమ్మయ్య (73) శనివారం ఉదయం పొలంలో మోటార్‌ను ఆన్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

శ్రీగిరి కిటకిట



శ్రీశైలంలో దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

శ్రీశైలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం సెలవు రోజు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ క్యూలైన్లు, ప్రధాన వీధుల్లో రద్దీ నెలకొంది. వేకువజాము నుంచే భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, గంగమ్మకు దీపహారతులు, నైవేద్యాలు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో బారులుదీరారు. కార్తీకమాసం శని, ఆది, సోమవారం రోజుల్లో భక్తుల రద్దీ దృష్ట్యా స్వామి వారి అలంకరణ దర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. ఉదయం నుంచే భక్తులు ఆలయ ఉత్తర మాఢవీధి ప్రాంగణం వద్ద, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద విశేష పూజలు నిర్వహించి దీపారాధనలు చేశారు. సాయంత్రం ప్రధాన ధ్వజస్థంభం వద్ద శాస్త్రోక్తంగా ఆకాశ దీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల దర్శనం తదితర ఆర్జిత సేవా టికెట్లను దేవస్థానం ఆన్‌లైన్ ద్వారా పొంది శ్రీశైలానికి రావాలని అధికారులు సూచించారు.

నారా రామ్మూర్తి అంత్యక్రియలు పూర్తి

తిరుపతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కన్నుమూసిన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, సీఎం చంద్రబాబు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడి పార్థివ దేహానికి ఆదివారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా నారావారిపల్లిలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దంపతులు, నారా, నందమూరి కుటుంబాలకు చెందిన వారు అంత్యక్రియల్లో పాల్గొని రామ్మూర్తికి తుది వీడ్కోలు పలికారు. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ సహా పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. శనివారం హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో మృతి చెందిన రామ్మూర్తినాయుడి భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం మంత్రి నారా లోకేశ్, రామ్మూర్తి నాయుడు తనయులు నారా రోహిత్, నారా గిరీష్ విమానంలో తిరుపతికి తీసుకువచ్చారు. తర్వాత సీఎం చంద్రబాబు, భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్ మరో విమానంలో వచ్చారు. వీరితో పాటు చంద్రబాబు సోదరి హైమావతి తదితరులు రామ్మూర్తి నాయుడి పార్థివదేహంపై పుష్ప గుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. స్వగ్రామం నారావారి పల్లిలోని ఇంటి నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు అంతిమయాత్ర మొదలు కాగా చంద్రబాబు, లోకేశ్‌లు పాడె మోశారు. చంద్రబాబు తల్లిదండ్రుల సమాధుల సమీపంలోనే అధికార లాంఛనాల నడుమ అంత్యక్రియలు జరిగాయి. గౌరవసూచకంగా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు 3 రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, హీరోలు నాగశౌర్య, రాజేంద్రప్రసాద్, మోహన్‌బాబు, మంచు మనోజ్, నిర్మాత ఎన్వీ ప్రసాద్, మాజీ మంత్రులు అమరనాథ్‌రెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కొత్తపల్లి సుబ్బారాయుడు తదితరులు రామ్మూర్తి నాయుడి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చంద్రబాబు కన్నీటి పర్యంతం

సోదరుడి అంత్యక్రియలకు హాజరైన చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు లోకేశ్ విషణ్ణ వదనాలతో కనిపించారు. తమ్ముడి పార్థివదేహాన్ని అంతిమ యాత్రకు కదలించినప్పుడు, అంత్యక్రియల సందర్భంలోనూ చంద్రబాబు కన్నీటి పర్యంతమయ్యారు.

కులగణన సర్వే స్పీడ్ 58.3%

ఆదివారం నాటికి 67.72 లక్షల గృహాల్లో పూర్తి

సర్వేలో ములుగు, నల్గొండ జిల్లాలు టాప్

హైదరాబాద్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన సర్వే వేగంగా జరుగుతోంది. నవంబర్ 9న ప్రారంభమైన సర్వే ఆదివారం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 67,72,246 గృహాల్లో పూర్తయింది. ఈ మేరకు 58.3% స్పీడ్‌తో సర్వే సాగుతోంది. సర్వేలో 87.1శాతంతో ములుగు, 81.4శాతంతో నల్గొండ జిల్లాలు ముందంజలో ఉన్నాయి. ఇక జీహెచ్ఎంసీ పరిధిలో సర్వే నెమ్మదిగా సాగుతోంది. ఆదివారం వరకు 38.3% గృహాల్లో సర్వే పూర్తయింది. కాగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా మొత్తం కోటి 16లక్షల 14,349 ఇళ్లను గుర్తించారు. సర్వే కోసం 87,807 ఎన్యూమరేటర్లను, 8,788 మంది సూపర్‌వైజర్‌లను ప్రభుత్వం నియమించింది.

పోలవరపు సాహిత్య సర్వస్వం

పోలవరపు కోటేశ్వరరావు సాహిత్య సర్వస్వం మూడవ భాగం ఆవిష్కరణ సభ నవంబర్ 18 సాయంత్రం 5గంటలకు 'దేవరాయ' సమావేశ మందిరం, 2వ అంతస్తు, హోటల్ దసపల్లా, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, గౌరవ అతిథి పరుచూరి గోపాలకృష్ణ, ఆత్మీయ అతిథి దూపాటి విజయ కుమార్, అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్.


లోక్‌నాయక్ ఫౌండేషన్

'కథా కచ్చీరు' విమర్శ పుస్తకం

వెల్దండి శ్రీధర్ సాహిత్య విమర్శ పుస్తకం 'కథా కచ్చీరు' ఆవిష్కరణ సభ దక్కన్ సాహిత్య సభ – మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 23 సాయంత్రం 5గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి వెల్దండ నిత్యానందరావు, ఆవిష్కర్త కె. శ్రీనివాస్, అధ్యక్షత సి. కాశీం.

టి.వి. నారాయణ

నచ్చకపోతే చింపేసేంత కోపం ఉండేది!





చదువు ముచ్చట

■ రిషి శ్రీనివాస్

ఆఖరుగా ఏ పుస్తకాన్ని చదివి బాగా ఇష్టపడ్డారు?

అరవింద్ అడిగ రాసిన 'ది వైట్ టైగర్'. భరించనలవికాని శోకాన్ని వ్యంగ్యంగా ఒకింత నవ్విస్తూ చెప్పడానికి చాలా నేర్పరితనం ఉండాలి రచయితకి. ఒక అణచివేయబడ్డ కులంలో పుట్టిన నిరుపేద వ్యక్తి అసమానతలను, అవినీతిని దాటి ఎలా ఎదిగాడన్నదే కథ. పీడితుల స్వరాన్ని దీనంగా వినిపించే సంప్రదాయానికి స్వస్తి పలికి చాలా కొత్త రకమైన టెక్నిక్‌తో పాఠకుడ్ని ఆకట్టుకుంటుంది ఈ నవల. నెట్‌ఫ్లిక్స్‌లో సినిమాగా తీసారు కానీ నాకు పుస్తకమే ఎక్కువ నచ్చింది.

మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదివారు?

నా చిన్నతనంలో అకడెమిక్ బుక్స్ కాకుండా న్యూస్‌పేపర్లు తప్ప వేరే పుస్తకాలు చదివిన జ్ఞాపకం లేదు. కానీ నేను ఏడవ తరగతిలో ఒక పాఠంగా చదువుకున్న శ్రీశ్రీ 'శైశవగీతి' కవిత బాగా నచ్చి 'మహాప్రస్థానం' కొనుక్కున్నాను. ఆ పుస్తకం, నాకు గుర్తున్నంత వరకు, నేను చదివిన మొట్టమొదటి సీరియస్ సాహిత్యం. "మీదే మీదే అనంత విశ్వం మీరే రేపటి భాగ్యవిధాతలు" అని గుంటల్ని పొగిడిన మొట్టమొదటి మహాకవి శ్రీశ్రీ!

మీరు ఎక్కువసార్లు చదివిన పుస్తకాలు?

పీవీ నరసింహారావు 'ద ఇన్‌సైడర్', తిలక్ 'అమృతం కురిసిన రాత్రి', సి. నారాయణరెడ్డి 'విశ్వంభర'.

ఒకప్పటికీ ఇప్పటికీ మీరు చదివే పద్ధతి ఎలా మారింది?

ఒకప్పుడు నేను చదివింది నచ్చకపోతే పుస్తకాన్ని చింపేసే (నిజ్జంగా) కోపం ఉండేది. ఇప్పుడు రచన కన్నా ముందు ఆ రచయిత సామాజిక/ ఆర్థిక/ రాజకీయ పరిస్థితుల్ని ముందు గ్రహించి, ఆ రచన సృజించబడ్డ కాలమాన పరిస్థితుల్ని గమనింపులో పెట్టుకుని పూర్తిగా అతని/ ఆమె షూస్ లోనికి నన్ను నేను ట్రాన్స్‌పోస్ చేసుకున్నాకే చదవడం మొదలు పెడుతున్నాను.

ఒకప్పుడు బాగా నచ్చి ఇప్పుడు అంతగా నచ్చని రచన/ రచయిత?

మీరు అడిగినదానికి పూర్తి వ్యతిరేకంగా జరిగింది. ఒకప్పుడు అస్సలు నచ్చని 'అసమర్థుని జీవయాత్ర' తరువాత కాలంలో నచ్చింది.

మీ ఆలోచనల్ని బాగా ప్రభావితం చేసిన పుస్తకం?

రావణాసురుడి దృష్టికోణంలో ఆనంద్ నీలకంఠన్ రాసిన 'అసుర'. అప్పటివరకు రావణుడ్ని విలన్‌గా ఏళ్ళ తరబడి బలపరచిన దృక్పథానికి ఒక కొత్త కన్విన్సింగ్ భాష్యం ఆ పుస్తకం.

> "ఒకప్పుడు అస్సలు నచ్చని 'అసమర్థుని జీవయాత్ర' తరువాత కాలంలో నచ్చింది."



ఏ గత కాలం రచయితనైనా కలిసి మాట్లాడగలిగితే ఎవరితో, ఏం మాట్లాడతారు?

ఏ గతకాలపు రచయిత తోనూ కలిసి మాట్లాడాలన్న ఫ్యాంటసీ నాకు లేదు. కానీ తమిళ రచయిత సుజాత రంగరాజన్ ఈవీయంలు తయారుచేసే ఇంజినీరింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉంటూ, ఓ చేత్తో సినిమాలకు స్క్రీన్ ప్లేలు రాసి ఇంకో చేత్తో నవలలు/ కథలు/ నాటికలు రాయగలిగేంత నిబద్ధతతో ఒకే జీవిత కాలంలో రెండు జన్మలు బ్రతికారు. ఆయనతో మాట్లాడకుండా ఒక రోజంతా అతని దినచర్యని గమనించాలని ఒకప్పుడు ఉండేది.

(రిషి శ్రీనివాస్ కథా రచయిత)

కన్యాదానం

ఇపుడీమె సర్వస్వతంత్ర

తన రూపసౌష్టవాలను తానే ఎంచుకొని
తన రెక్కలకు తానే పరిమళం అద్దుకొని
తెల్లని వెన్నెలలో వికసించిన రంగుల కలువ.

గూటిలో ఒదిగినప్పటి గువ్వతనం వదిలి
తన రెక్కలలో తానే బలం నింపుకొని
తన స్వరాన్ని తానే శృతి చేసుకొని
అపుడపుడు అందంగా పలకరించే వసంత కోకిల.

కనక సంపన్న కాకపోయినా
తన ఆశలు, ఆశయాలే
ఆభరణాలుగా ధరించిన
అపరంజి బొమ్మ.

ఇవ్వటం పుచ్చుకోవటం
ఒక వేడుక మాత్రమే!
తన సర్వస్వమూ తనకే సొంతం.

ఇపుడీమె
తన దారిని తానే నిర్మించుకొని
తన జీవితాన్ని తానే నిర్వచించుకొని
ఏనాడో బయటి ప్రపంచంలోకి అడుగుపెట్టిన
పరిపూర్ణ మహిళ!

తను కోరుకున్న సంసార నౌక లోనికి అడుగుపెట్టడానికి
నా చేతిని ఊతగా అందించి
ధన్యమౌతాను.

అప్రయత్నంగా, అతిసహజంగా తలెత్తే
అన్ని భయసందేహాలను
కనురెప్పల క్రిందే అదిమిపెట్టి
తన కలల తీరానికి తప్పక చేరాలని
మనసులోనే మరీమరీ కోరుకొని
నెమ్మదిగా చెయ్యి ఊపుతూ
ఈవలి ఒడ్డునే నిలిచిపోతాను.

■ **విన్నకోట రవిశంకర్**
rvinnako@yahoo.com

సోమవారం 18 నవంబరు 2024

వివిధ

vividha@andhrajyothy.com **సాహిత్య వేదిక**

బొమ్మలు: అక్బర్

ప్రతిభా పురస్కారం

దళిత సాహిత్య సాంస్కృతిక రంగంలో కృషి చేసిన మహిళకు ఇచ్చేందుకు కొత్తగా మొదలైన 'డా. శ్రీకాకుళపు జాయ్ అడిల్ మేరీరాయ్ స్మారక ప్రతిభా పురస్కారం' ఈ ఏడాదికి జూపాక సుభద్ర స్వీకరిస్తారు. పురస్కార ప్రదానం నవంబర్ 22న విజయవాడ ఎగ్జిక్యూటివ్ క్లబ్‌లో జరుగుతుంది.

జాన్సన్ చోరగుడి

'విజయ గాథ' స్వీయచరిత్ర

బోయి విజయ భారతి స్వీయ చరిత్ర 'విజయ గాథ' & విజయ భారతి స్మారక సంచిక ఆవిష్కరణ సభ నవంబర్ 23 సాయంత్రం 5.30 గంటలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లిలో జరుగుతుంది.

బొజ్జా తారకం ట్రస్ట్

'వేకువ' కథాసంపుటి

మజ్జి భారతి కథా సంపుటి 'వేకువ' ఆవిష్కరణ సభ నవంబర్ 24 ఉదయం 10గంటలకు విజయనగరం జిల్లా రాజాంలోగల శ్రీవిద్యా నికేతన్ పాఠశాలలో జరుగుతుంది. అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, పొట్నూరు కోటిబాబు అతిథులుగా పాల్గొంటారు.

గార రంగనాథం

రానున్నది కథల ఋతువు!

తెలుగులో ఇప్పుడు కథా సంకలనాల సీజన్ నడుస్తుంది. ఏటా వచ్చే వార్షిక కథా సంకలనాలతో పాటు ప్రత్యేక ఇతివృత్తాన్నో, సందర్భాన్నో ఎంపిక చేసుకొని త్వరలో కొన్ని కథా సంకలనాలు రాబోతున్నాయి. వాటిలో కొన్నింటికి సంపాదకత్వం వహిస్తున్నవారు ఆ సంకలనాల వివరాలు, ప్రత్యేకతల గురించి 'వివిధ'తో మాట్లాడారు.

దళిత ప్రేమ కథలు


సంపాదకత్వం: **మానస ఎండ్లూరి, అరుణ గోగులమండ**





ప్రేమ గొప్పదని చిన్నప్పటి నుంచీ చదువుతూ వింటూ పెరిగి, తీరా ఇదే సమాజంలో కులాంతర వివాహాలు చెల్లకపోవడం, పరువుహత్యల పేరుతో వేలమంది దళిత యువకులు హేయమైన రీతుల్లో చంపబడుతున్నా పెద్దగా మార్పు రాకపోవడం... ఇలా ఎన్నో నిర్ఘాంతపరిచే సంఘటనలను, మారని వ్యవస్థలను చూస్తూ– మేము ఈ దళిత ప్రేమకథల సంకలనానికి నడుం బిగించాం.

ఎక్కువగా ఆధిపత్య కులాల నుంచి, శరీరపు రంగులు చూసి, కలుపుకునే సంబంధాలకు ప్రేమ అనే పేరు పెట్టి అందంగా రాసిన రచనలనే విరివిగా అందరం చదివాం. ప్రేమల పేరిట వధించబడ్డ, అణచివేయబడ్డ అంటరాని కులాల యువత గురించీ, సమాజాన్ని ఎదిరించి కులాంతర వివాహాలు చేసుకొని ఇంటా బైటా నెగ్గుకు రాగలిగిన జంటల గురించీ, దళితులు ఇతర కులాలవారిని ప్రేమించి చేసుకున్న తర్వాత ఆ పెళ్ళిలో ఏ మాత్రం ప్రేమ మిగిలింది అన్న ప్రశ్నల గురించీ, క్యాస్ట్ అండ్ జెండర్ కోణాల గురించీ... పరిష్కారం దిశగా కాకపోయినా ఓ ముఖ్యమైన చర్చ జరగాలని ఈ దళిత ప్రేమకథల అంశాన్ని ఎంపిక చేశాం. ఎక్కువగా వర్ధమాన రచయితలు ఈ సంకలనానికి కథలు ఇవ్వడం సంతోషంగా ఉంది. ఈ ప్రేమ కథలలో ఇతివృత్తం, నేపథ్యం ఏదైనా కావచ్చు కానీ ప్రేమజంటల పాత్రల్లో కనీసం ఒకరు దళితులు అయ్యుండాలన్న నియమం పెట్టాం. రచయితలు ఏ కులమత వర్గ ప్రాంతీయ జెండర్ వారైనా కావచ్చు.



అస్తిత్వ సాహిత్య పుస్తకాలు పెద్దగా ఆస్తులు కూడపెట్టకపోవచ్చు కానీ అస్తిత్వమే ఆస్తిగా బతుకుతున్న రచయితలుగా మేము సంపాదకులుగా కొత్త పాత్రలోకి వెళ్ళినప్పుడు మా రచయితలకు రూ.1000 గౌరవార్థం ఇస్తూ, ఐదు ప్రతులను బహూకరించాం. సంకలనాలు వేసిన సంపాదకులు రచయితల కథలతో సొమ్ము చేసుకుంటారనీ, కథా రచయితలకు ఒక పుస్తక ప్రతిని ఇవ్వడానికి కూడా పెద్ద మనసు ఉండదని నిందలు మోస్తూనే ఉంటారు. ఇవన్నీ చూస్తున్న వారిగా మా రచయితలకు మేము ఇచ్చిన చిరుసత్కారం ఇది.

ఆంధ్రలో అస్తిత్వవాద రచయిత్రులు పలుచబడిన ఈ కాలంలో ఆంధ్రా దళిత స్త్రీవాద రచయిత్రులుగా మేం దళిత ప్రేమకథలను సంకలనంగా తీసుకురావడం ఒక ప్రత్యేకమైన సందర్భం అని గట్టిగా చెప్పగలం. సమాజంలో ఇంతవరకూ పెద్దగా మాట్లాడని, మాట్లాడటానికి జంకిన, ప్రచురణ వరకూ రావడానికి అవకాశం లేకపోయిన ఎన్నో ప్రేమకథలకు జీవం పోస్తుందన్న ఆశతో ఈ ఈ సంకలనాన్ని మీ ముందుకు తెస్తున్నాం.


అపురూప – చింతన కథలు

సంపాదకత్వం: **బి. అజయ్ ప్రసాద్**



ఉదయిని అంతర్జాల పత్రిక కోసం నేను 'అపురూప కథ' పేరుతో శీర్షిక నడుపుతున్నాను. దాని కోసం గతంలో వచ్చిన ఆణిముత్యాల వంటి కథలను ఎంపిక చేసి వేస్తున్నాను. ఆ పనిలో భాగంగా గత పాతికేళ్ల కాలంలో నాకు బాగా గుర్తుండిపోయిన కథల జాబితా తయారు చేసుకున్నాను. అప్పుడే ఇలాంటి కథలతో ఒక సంకలనం తెస్తే బాగుంటుంది అన్న ఆలోచన కలిగింది. మధురాంతకం నరేంద్ర సంపాదకత్వంలో 2002లో 'తాత్త్విక కథలు' పేరిట ఒక కథా సంకలనం వచ్చింది. ఆ తరవాత గత ఇరవై ఏళ్ళ కాలంలో అటువంటి సంకలనం మరలా తెలుగులో రాలేదు. వచ్చిన సంకలనాలన్నీ చాలా వరకు నిర్దిష్ట భావజాల పరంపరలో వచ్చినవే. వార్షిక కథల సంకలనాలలో కూడా అటువంటి భావజాలానిదే పైచేయి. ఈ కారణంగా గత పాతికేళ్ల కాలంలో చెప్పుకోదగ్గ ఎన్నో కథలు వెలుగు లోకి రాకుండా పోయాయి. ఈ నేపథ్యంలో ఇటువంటి కథల సంకలనం వస్తే బాగుంటుంది అన్న ఆలోచన కలిగింది.

కథల ఎంపికలో నేను ఎటువంటి భావజాలాన్నీ పరిగణన లోకి తీసుకోలేదు. తెలుగునాట వచ్చిన అన్నిరకాల సామాజిక ఉద్యమాల మీద నాకు గౌరవం ఉంది. కానీ సాహిత్యం, కళలు విషయాలకి వస్తే నా ఆసక్తి వేరు. ఈ కథలన్నీ ఒక దగ్గర పెట్టి చూసుకున్నప్పుడు దాదాపు అన్ని కథలు అంతరంగ విశ్లేషణ, ఆత్మాన్వేషణ, జీవిత వాస్తవం, చిత్త భ్రాంతి, వర్తమానానికి ఉండే విలువ మొదలైన అంశాల మీద నడిచాయి. ఇతరత్రా అస్తిత్వ ఉద్యమ కథలు రాసే రచయితల కథలు కూడా ఇందులో చోటు చేసుకున్నాయి. కాబట్టి ఇందులో ముందుగా ఎంచుకున్న ప్రాతిపదిక అంటూ ఏదీ లేదు. ఈ సారాంశం కూడా ఎంపిక జరిగిన తరవాత గ్రహించినదే. ఇలాంటి కథల కోసం ఎదురు చూసే కొత్త తరం పాఠకులకు, అలాగే ఒక రకమైన కొత్త తరం రచయితలు పుట్టడానికి ఈ సంకలనం ఉపకరిస్తుందని నా నమ్మిక. ఏ పాతికేళ్ళకో ఇలాంటి అరుదైన కథల సంకలనం ఒకటి వస్తుంది. అది నా చేతులతో తేగలగడం గౌరవంగా భావిస్తున్నాను.





AKBAR



శీతాకాలం

మంచుతెల్లగా మేల్కొంటున్న ఉదయం
పల్లెలో పసికందు చేతివేళ్ళ స్పర్శలా ఉంటుంది
ఆ సుపరిచితమైన స్పర్శ కావాలి
ఆ శ్వాస పీల్చాలి
ఆ ఆకాశం చూడాలి
ఓ చలిమంట వేసుకోవాలి

ఇంకా ఎండుగడ్డిపైన తల్లికుక్క
తల్లికుక్కపైన కుప్పగా పడుకున్న దాని పిల్లలు
అదొక జీవన సంతులనం
రెక్కలకష్టం వినిపిస్తుంది శ్రామికుడిదీ, గువ్వలదీ
ఆ మంచుపూట ఎక్కడికెళుతుందీ గువ్వల గుంపు
గువ్వెగిరిపోగా ఊగుతున్న జొన్నకంకినవుతాను
నేను మంచుతెల్లగానూ, మంచులో పనిచేస్తున్న శ్రామికుడిలానూ,
శ్రామికుడి చేతిలోని పనిముట్టులానూ ఉండాలనుకుంటాను

ఒకవైపు మంచు
ఒకవైపు నిమ్మపువ్వులా వెలుతురు వికసం
జీవనసంధ్యా కరుణను పంచుతూ సూర్యుడు
గడ్డకట్టిన కొబ్బరినూనె కరుగుతూ ఉంటుంది
దుప్పటి వెచ్చటి వాసన వేస్తుంటుంది
రెండు నందివర్ధనం పువ్వులు త్రుంచి
చల్లగా కళ్ళకు తాకించి
ఒక శీతాకాలపు ఆనందంతో నడుస్తూ
అప్పటికి ఏ పాదం మోపని
మంచుతో నిండిన గడ్డిపైన నా పాదముద్రలు
నా జీవితం వైపుకు వెళ్ళేదారిలా వుంటుంది.


■ **శాంతయోగి యోగానంద**
✆ 91107 70545

ఈ కాలపు తెలుగు కథ

సంపాదకత్వం: **కుమార్ కూనపరాజు**



రెండు ప్రత్యేక సందర్భాలు నన్ను ఈ సంకలనం తేవడానికి పురికొల్పాయి. ఒకటేమింటే– అమెరికాలో నివసించే ఒకాయన అక్కడ ఇటీవల జరిగిన తెలుగు సభల్లో తెలుగు కథ అధోగతి వైపు ప్రయాణం చేస్తోందని ఓ తీవ్ర విమర్శ చేసాడు. ఇది తప్పని తెలియచెప్పడానికి, ఈ కాలపు తెలుగు కథలను సేకరించాను. అన్ని వర్గాలు, ప్రాంతాలు, వాదాల నుండి ప్రాతినిధ్యం వుండేలా చూసుకున్నాను. రెండో సందర్భం– ఒక ప్రఖ్యాత తమిళ రచయిత, తెలుగు నుంచి తమిళ బాషకు అనువదింపబడిన కథా సంపుటి గురించి వ్యాఖ్యానిస్తూ, తమిళంలో తెలుగు కథలు అందుబాటులో పెద్దగా లేవని అన్నారు. ఇది నిజమే అనిపించింది. సాహిత్య అకాడమీ ద్వారా మాత్రమే కొన్ని అనువాదమై ఇతర భాషల్లోకి వెళ్ళాయి. మంచి తెలుగు సమకాలీన కథను వీలైనన్ని భారతీయ భాషలలో తీసుకు వెళ్లాలన్న కోరిక కలిగింది. ఇందు కోసం కూడా ఈ సంకలనం చేసాం. ఈ సంకలనంలోని కథల ఎంపికకి ప్రాతిపదికగా– కథకులు వారి ప్రాంత, వర్గ, వర్ణ, జెండర్ అణచివేతలను ప్రభావవంతంగా చూపించిన కథా అంశాలనూ, కొన్ని తెలుగు జనరల్ అంశాలనూ పరిశీలించాము. ఆధునిక కాలం లోనూ కొనసాగుతున్న వివక్షనూ, అమానవీయ విషయాలనూ, మానవ హృదయ వేదననూ ఈ కథలు ఎత్తి చూపుతాయి.



ఉత్తమ రష్యన్ కథలు

సంపాదకత్వం: **అనిల్ బత్తుల**



మొదటగా నేను 'రాదుగ' పుస్తకాల అభిమానిని. గత ఇరవై యేళ్లుగా 'రాదుగ', 'ప్రగతి' ప్రచురణ సంస్థలు ప్రచురించిన ఎన్నో రష్యన్ తెలుగు అనువాద పుస్తకాలను సేకరిస్తూ వచ్చాను. వాటిలో అజరామరమైన నవలలు, నవలికలు, కథలు ఎన్నో ఉన్నాయి. వాటన్నిటినీ వీలున్నప్పుడల్లా మళ్ళీ మళ్ళీ చదువుతుంటాను. రష్యన్ అనువాద కథల్లో నాకు నచ్చిన కథలు ఎన్నో ఉన్నాయి. వాటన్నిటినీ ఒకచోట పెట్టి సంకలనంగా తెస్తే తెలుగు పాఠకులకు వెసులుబాటుగా ఉందనిపించింది. ఈ ఆలోచనే ఈ పుస్తకానికి నాంది. ఈ కథలన్నీ ఇప్పటికే కాలానికి నిలబడిన కథలు. అదే నేను ఎంచుకున్న ప్రామాణికత. ఇందులో పెద్ద కథలు, నవలికలంత నిడివి వున్న కథలు కూడా ఉన్నాయి. ఈ కథలన్నీ సుమారు నూట యాభైఏళ్ళ క్రితం రష్యాలో ప్రచురించబడినవే. రచయితలంతా టాల్‌స్టాయ్, చెహోవ్, గోర్కీ వంటి ప్రపంచ ప్రఖ్యాతిగాంచినవారు. ఈ రచయితలకు ఎంత పేరుందో వాళ్ళ రచనలకూ అంతే పేరుంది. ఈ పుస్తకం ప్రత్యేకత– ప్రఖ్యాతిగాంచిన రష్యన్ కథలు ఒకేచోట ఉండటం. రాచమల్లు రామచంద్రారెడ్డి, ఆర్వీయార్, నిడమర్తి ఉమా రాజేశ్వరరావు, గిడుతూరి సూర్యం వంటి లబ్ధప్రతిష్ఠులైన అనువాదకులు అనువదించిన కథలన్నీ ఒకే సంకలనంలో చేర్చడం. అరుణా ప్రసాద్ వంటి వర్తమాన అనువాదకుల కథలు కూడా ఇందులో వున్నాయి. శాశ్వతంగా మనసు పొరలపై ముద్ర వేసే కథల సంకలనం ఇది.



ఆధునిక తెలుగు కథ: 2000–2024

సంపాదకత్వం: **అరిపిరాల సత్యప్రసాద్, వెంకట్ శిద్ధారెడ్డి, మహి బెజవాడ**



తెలుగులో ఉత్తమ కథల కోసం వెతికే సాహితీ ప్రియులకు అందే మొదటి పది సజెషన్స్‌లో ఏడెనిమిది కథలు యాభై అరవై ఏళ్లకు ముందు రాసినవి అయ్యుంటాయి. అలాగే పుస్తకాల షాపుల్లోనూ, పుస్తక ప్రదర్శనలోనూ అడుగుపెట్టగానే మొదట కనపడే పది తెలుగు పుస్తకాల్లో ఏడెనిమిది పుస్తకాల రచయితలు గతించిపోయి దశాబ్దాలు దాటి ఉంటుంది. పూర్వపు రచయితల గొప్పదనాన్ని తక్కువ చెయ్యటం కాదు కానీ, వర్తమానంలో వస్తున్న కథలలో ఆ పాత కథలకు ఏ మాత్రం తీసిపోని కథలు ఉన్నాయి అన్నది మా గమనింపు. ఈ ఆలోచనే ఈ 'ఆధునిక తెలుగు కథ' పుస్తకానికి బీజం వేసింది. ఇతర భాషలలో వచ్చే ఉత్తమ సాహిత్యాన్ని కళ్లకద్దుకునే మనం, తెలుగులో వస్తున్న రచనలను కనీసం గుర్తించడానికి కూడా వెనుకాడటం మరో కారణం. అందువల్ల 2000 సంవత్సరం తరువాత రాయడం మొదలు పెట్టిన రచయితల కథలను సేకరించి, వాటిలో నుంచి ఎంచుకున్న ఉత్తమ కథలతో ఈ పుస్తకాన్ని రూపొందించాం. ఈ కథలను ఇతర భాషల పాఠకులకి అందించే ఉద్దేశం కూడా ఉంది కాబట్టి అనువాదానికి అనువైన కథలను ఎంచుకునేందుకు ప్రయత్నించాం. తూకం వేసి కథలను ఎంపిక చేయక పోయినప్పటికీ, ఇందులో అన్ని రకాల కథలకూ ప్రాతినిధ్యం కలిగిందనే నమ్మకం ఉంది. ఈ కథలన్నీ ఒక పుస్తకంగా చూసినప్పుడు వర్తమాన తెలుగు రచయితలలో ఆధునిక శైలీ శిల్పాలతోపాటు ప్రగతిశీల దృష్టి, సామాజిక చైతన్యం కూడా ఉన్నాయని నిరూపణ అయ్యింది. అదే ఈ పుస్తకం విలువని పెంచిందని అనుకుంటున్నాం. తెలుగు పాఠకులకి ఆధునిక తెలుగు కథ సుసంపన్నంగా ఉంది అని చెప్పడంతోపాటు, ఈ వైభవాన్ని తెలుగేతర పాఠకులకి చూపించేందుకు ఈ పుస్తకం అద్దంలా పనిచేస్తుందని మా విశ్వాసం.





హనుమకొండ బాలసముద్రంలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

సజావుగా గ్రూప్-3 పరీక్ష

కేంద్రాలను పరిశీలించిన హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ, వరంగల్ జిల్లాల వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన గ్రూపు-3 పరీక్ష మొదటిరోజు సజావుగా ముగిసింది. మొదటిరోజు సెషన్‌ల వారిగా ఉదయం, మధ్యాహ్నం రెండు పేపర్లు పరీక్ష నిర్వహించారు. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 83 పరీక్షా కేంద్రాల్లో గ్రూపు-3 పరీక్ష నిర్వహించారు. ఉదయం జరిగిన మొదటి సెషన్ పేపర్‌కు 32,864మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 17,572 మంది పరీక్ష రాశారు. 15,292మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మొదటి పేపర్‌కు 53.47శాతం పర్సంటేజీ నమోదైంది. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 32,864 మంది అభ్యర్థులకు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 17437మంది పరీక్ష రాశారు. 15,427మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. రెండో పేపర్‌కు 53.06శాతం నమోదైంది. హనుమకొండ బాలసముద్రంలోని శ్రీనివాస్ గురుకుల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్ష సెంటర్‌ను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న 83పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు అన్ని వసతులు కల్పించామన్నారు. పరీక్షలు ఎలాంటి పొరపాట్లు లేకుండా అధికారులందరూ సమన్వయంతో పని చేస్తున్నామన్నారు.

వరంల్ జిల్లాలో..

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్‌సీ) నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్ష ఆదివారం వరంగల్ జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. వరంగల్‌లోని వాగ్దేవి కళాశాల, తాళ్ల పద్మావతి కళాశాల, సిల్వర్ క్రౌన్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సత్యశారద పరిశీలించారు. పరీక్ష నిర్వహణ, తరగతి గదులను, ఇతర సౌకర్యాలను తనిఖీ చేశారు. పరీక్షా సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని సూచించారు. అదేవిధంగా హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని అదనపు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. జిల్లాలో మొత్తం 10,913మంది అభ్యర్థులకు గాను ఆదివారం ఉదయం జరిగిన పరీక్షకు 5,513 మంది హాజరు కాగా, 5400 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 5,489 మంది హాజరు కాగా, 5,424 మంది గైర్హాజరయ్యారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, పరీక్షల రీజినల్ కోఆర్డినేటర్ బత్తిని చంద్రమోహన్, సహాయ కో ఆర్డినేటర్ సురేశ్‌బాబు, జిల్లా బయోమెట్రిక్ ఆఫీసర్ శ్యాం పాల్గొన్నారు.



- మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య గ్యాప్‌కు తాత్కాలిక తెర
- మంత్రి కొండా సురేఖతో కలిసిపోతున్న ఎమ్మెల్యేలు
- సురేఖపై ఇటీవలే అధిష్ఠానానికి ఫిర్యాదు చేసిన శాసనసభ్యులు
- రేపటి సీఎం సభ ఏర్పాట్లలో అందరూ బిజీబిజీ
- విభేదాలను పక్కన పెట్టడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్

కలిసుందాం.. రా..!

ఓరుగల్లు కాంగ్రెస్‌లో ఐక్యతారాగం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఓరుగల్లు కాంగ్రెస్‌లో ఐక్యతరాగం వినిపిస్తోంది. నిన్నటి వరకు మంత్రి సురేఖపై ఎమ్మెల్యేలు ఫిర్యాదులు చేసిన సంఘటనలున్నాయి. అలాగే ఎమ్మెల్యేల తీరుపై మంత్రి గుర్రుగా ఉన్న విషయాన్ని చూశాం. ఇలా వీళ్ల మధ్య కొన్నాళ్లుగా ఉప్పు, నిప్పులా చిటపటలే వినిపించాయి. అయితే సీఎం విజయోత్సవ సభ నేపథ్యంలో వీరంతా కలిసినట్టే కనిపిస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడి పర్యటనలో కనిపించిన ఐక్యత.. సీఎం సభ ఏర్పాట్లలోనూ కలిసి పని చేస్తుండటంతో కాంగ్రెస్‌లో వర్గవిభేదాలకు ఇక ఫుల్ స్టాప్ పడ్డట్టే అనే చర్చ క్యాడర్‌లో జోరుగా సాగుతోంది. అంతేకాదు.. సీఎంకు దూరంగా ఉంటూ టీపీసీసీ అధ్యక్షుడి పర్యటనలో కనిపించని నర్సంపేట ఎమ్మెల్యే సైతం సీఎం సభకు పదివేల మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించటం హస్తంలో అసమ్మతి దారికి వస్తుందనే చర్చ జరుగుతోంది.

కొన్నాళ్లుగా విభేదాలు

ఓరుగల్లు కాంగ్రెస్‌లో తొలి నుంచి విభేదాలు, వర్గపోరుతో కేడర్ సతమతమైంది. కొత్త ప్రభుత్వం ఏర్పాటులో ఇద్దరు మహిళలకు ఉమ్మడి వరంగల్ నుంచి మంత్రులకు అవకాశం దక్కింది. అయితే ఇద్దరు మంత్రుల మధ్య సయోధ్య లేదనే ప్రచారం జరిగింది. 2024 ఫిబ్రవరిలో జరిగిన మేడారం మహాజాతర నుంచే వీరి మధ్య విభేదాలు పొడచూపాయనే ప్రచారం ఉంది. మేడారం జాతర పనుల్లో అటవీ, దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న సురేఖ పూర్తిస్థాయిలో పాల్గొనకపోడటంతో ఇద్దరు మంత్రులు మధ్య విభేదాలే అనే చర్చ జరిగింది. ఆ తరువాత వరంగల్ లోక్‌సభ ఇన్‌చార్జిగా ఉన్న సురేఖను మెదక్ లోక్‌సభ ఇన్‌చార్జిగా అధిష్ఠానం పంపించటంపై కూడా కొండా వర్గీయుల్లో అసంతృప్తి వ్యక్తమైంది. ఆ తరువాత పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డితో విభేదాల ఆడియో లీక్ కావటం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. జూన్ 29న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లలోనూ మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం లేదనే చర్చ వినబడింది. దసరా మరుసటి రోజు గీసుకొండలో ఫ్లెక్సీల లొల్లి కాంగ్రెస్‌లో వర్గవిభేదాలను తారస్థాయికి చేర్చాయి. గీసుకొండ పోలీస్‌స్టేషన్‌లో సురేఖ హంగామాతో కొండా, రేవూరి మధ్య మరింతా గ్యాప్ పెరిగింది. వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలోని ఐనవోలు, భద్రాకాళి ఆలయ కమిటీల్లో తమకు సమాచారం లేకుండానే మంత్రి కమిటీ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యేలు అసంతృప్తికి లోనయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఐదారుగురు ఎమ్మెల్యేలు, ఓ ఎమ్మెల్సీ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్‌మున్షీకి కూడా సురేఖ తీరుపై ఫిర్యాదు చేశారు. ఇంతలా విభేదాలతో అట్టుడికిన ఓరుగల్లు కాంగ్రెస్‌లో నేతల మధ్య ఐక్యతారాగం శ్రేణులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

కాంగ్రెస్ నేతల్లో ఇటీవలకాలంలో కనిపిస్తున్న ఐక్యత శ్రేణుల్లో జోష్ నింపుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య కొన్నాళ్లుగా ఉన్న విభేదాలను పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి సారిస్తుండడం కేడర్‌ను ఉత్సాహపరుస్తోంది. ఢిల్లీకి వెళ్లి మంత్రి సురేఖపై ఫిర్యాదు చేయాలని ప్రయత్నించిన ఎమ్మెల్యేలు కూడా మంత్రితో కలిసి పనిచేస్తుండటం హస్తం పార్టీలో హట్‌టాపిక్‌గా మారింది. తొలి నుంచి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డితో ఉన్న విభేదాలను పక్కన పెట్టి మంత్రి సురేఖ మామునూరు ఎయిర్‌పోర్టు పరిశీలనతో పాటు సంగెం మండలం పరిధిలోని రైతులతో భూసేకరణపై చర్చించి, ఒప్పించటం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖ తనకు ఆదర్శం అంటూ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ఎక్స్ వేదికగా ప్రకటించటం.. సురేఖతో కలిసి దిగిన ఫోటోలు షేర్ చేయటం హస్తం నేతల్లో ఐక్యత చిగురించిందటనే టాక్ వినబడింది. ఆదివారం మంత్రులు సురేఖ, సీతక్కలు కలిసి సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించటం, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పర్యటనలో మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రేవూరి పరస్పరం ఎదురెళ్లి నమస్కారం చేయటం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ, భూపాలపల్లి ఎమ్మెల్యేలు కూడా అందరితో కలిసి వెళుతుండటం కాంగ్రెస్ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపుతోంది. ఇక మొదటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డికి దూరంగా ఉన్నారనే ఆరోపణలున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి.. శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ వరంగల్ పర్యటనకు కూడా దూరంగా ఉండటం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. గత జూన్ 29న జరిగిన సీఎం పర్యటనకు కూడా స్థానికంగా ఉండి మాధవరెడ్డి హాజరుకాలేదు. అయితే ఆదివారం సీఎం సభకు నర్సంపేట నియోజకవర్గం నుంచి 10వేల మందిని తరలిస్తామని, అందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించటం కాంగ్రెస్‌లో విభేదాలకు తాత్కాలికంగా ఫుల్‌స్టాప్ పడిందనే చర్చ జరుగుతోంది.

కాంగ్రెస్ క్యాడర్‌లో జోష్

అభివృద్ధికి ఆటంకంగా అసమ్మతి

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తి చేయలేని అభివృద్ధి పనులన్నింటినీ పూర్తిచేసేలా కార్యాచరణ చేశారు. ఇందులో ప్రధానంగా కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుపై దృష్టి పెట్టారు. దక్షిణ కొరియాకు వెళ్లి పెట్టుబడులు తీసుకువస్తున్నారు. టెక్స్ టైల్ పార్కులో భూములు కోల్పోయిన రైతులకు అక్కడే 836 మందికి ఇందిరమ్మ ఇళ్లు కట్టించేలా మంగళవారం ప్రభుత్వం జీవో జారీ చేసింది. వీటితో పాటు కాళోజీ కళాక్షేత్రానికి రూ.45కోట్లు

మిగతా 6వ పేజీలో

నేటి కలెక్టరేట్ ప్రజావాణి రద్దు

సమాచారం

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ, వరంల్ జిల్లాల కలెక్టరేట్‌లో సోమవారం జరగనున్న ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ నెల 19న సీఎం రేవంత్ రెడ్డి హనుమకొండ జిల్లా పర్యటన ఉన్నందున ఆ ఏర్పాట్లలో అధికారులందరూ నిమగ్నమైఉన్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి ప్రజలు ఎవరూ కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు. వచ్చే సోమవారం 25వ తేదీన యథావిధిగాప్రజావాణి ఉంటుందని వారు తెలిపారు.

బల్దియాలో సైతం..

వరంగల్ కార్పొరేషన్: నగర ప్రజల సమస్యలు తెలుసుకుని సత్వర పరిష్కారం కోసం ప్రతీ వారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వల్ల సోమవారం రద్దు చేస్తున్నట్లు వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పరిపాలనా పరమైన కారణాల దృష్ట్యా ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

విజయోత్సవ సభను జయప్రదం చేయండి

- కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారు..
- అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి లక్ష్యం
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- మూటలు మోసే అలవాటు బీఆర్‌ఎస్‌కే ఉంది : మంత్రి సీతక్క

హనుమకొండ సిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న జరిగే కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవ సభను జయప్రదం చేయాలని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ప్రజలను కోరారు. కాంగ్రెస్ ప్రజాపాలనకు రాష్ట్ర ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానాన్ని ఆదివారం మంత్రి సీతక్క, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి మంత్రి పరిశీలించారు. సభ ఏర్పాట్లను చర్చించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ నియంత పాలన ముగియడంతో ఏడాదిగా రాష్ట్రంలోని అన్నివర్గాలు ఆనందంగా ఉన్నాయన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటున్నారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సాగుతోందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుకు శరవేగంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 19న జరిగే విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. సభ నిర్వహణ ద్వారా మరింత అంకితభావంతో తాము ప్రజలు సేవ చేయాలనే సంకల్పంతో ఉన్నట్లు చెప్పారు. స్వయం సంఘాలకు వడ్డీ లేని రుణాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తోందన్నారు. పేదల బతుకుల్లో వెలుగులు నింపుతూ ఆనాటి ఇందిరమ్మ సంక్షేమ పాలనను మళ్లీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి జోడెద్దులుగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ వివరాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభలో వెల్లడిస్తారన్నారు.




హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

మూటలు మోసే అలవాటు బీఆర్‌ఎస్‌కే ఉంది..

మూటలు మోసే అలవాటు బీఆర్‌ఎస్‌కే ఉందని, ఈ విషయాన్ని మాజీ మంత్రి కేటీఆర్ మరిచినా ప్రజలు మరువలేదని మంత్రి సీతక్క విమర్శించారు. ఇతర రాష్ట్రాలో బీఆర్‌ఎస్ లేనప్పటికీ అక్రమంగా దోచిన సొమ్ముతో రాజకీయం చేసిన చరిత్ర ఆ పార్టీకే ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పాటుపడుతుంటే బీఆర్‌ఎస్ అడ్డుకుంటోందన్నారు. తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను నమ్మించే కుట్రలు చేస్తోందన్నారు. కులాలు, మతాలు, వర్గాలను రెచ్చగొట్టడమే పనిగా బీఆర్‌ఎస్ పెట్టుకుందని దుయ్యబట్టారు. దేశంలో బీజేపీ దుర్మార్గ పాలన సాగిస్తోందని సీతక్క విమర్శించారు. కాంగ్రెస్ దేశాన్ని ఐక్యం చేసేందుకు పోరాడుతోందన్నారు. దేశం కోసం కాంగ్రెస్ పాటుపడుతుంటే బీఆర్‌ఎస్ అవాస్తవాలు మాట్లాడడం శోచనీయమన్నారు. ఎలాగైనా అధికారం పొందాలనే ధ్యాస తప్ప బీఆర్‌ఎస్‌కు మరొకటి లేదని విమర్శించారు. జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు, సంక్షేమం, నిధుల కల్పన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన సర్వే చేపట్టిందన్నారు. అనాడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం లిమ్కా బుక్ రికార్డుల కోసం ఒక రోజులోనే సర్వే ముగించిందని విమర్శించారు. కనీసం సర్వే వివరాలను కూడా బయటపెట్ట లేదని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మేయర్ గుండు సుధారాణి, టీపీసీసీ నాయకులు కూచన రవళి, ఈవీ శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలతో అధికారంలోకి కాంగ్రెస్

- సీఎం రేవంత్‌రెడ్డిపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమావేశం



ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్‌ఎస్ నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

బాలసముద్రం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం హనుమకొండలోని వారి నివాసంలో ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్‌ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల హామీలను నేరవేర్చక సతమతమవుతోందన్నారు. ముఖ్యంగా రైతన్నలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్టీలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, సన్నకారు రైతుల భూములు గుంజుకోవాలని చూస్తోందన్నారు. దీంతో తెలంగాణ సమాజం మొత్తం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తోందన్నారు. సీఎం సొంత జిల్లాలోని తన నియోజకవర్గంలోని రైతులు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తిరగబడ్డారని, కొద్దిరోజుల్లోనే తెలంగాణ మొత్తం రేవంత్ సర్కార్‌పై తిరగబడుతారన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. లగచర్ల ఘటనపై కేసీఆర్, కేటీఆర్ ఆదేశాల మేరకు భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని దయాకర్‌రావు తెలిపారు. ఈ సమావేశంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, హనుమకొండ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, నన్నపునేని నరేందర్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ ఇక చకచకా..
భూసేకరణకు రూ.205 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
డీపీఆర్ సిద్ధం చేయాలని ఏఏఐకి ఆర్‌అండ్‌బీ లేఖ
6

మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయాలి..

- కాళోజీ కళాక్షేత్రాన్ని సందర్శించిన కలెక్టర్ పి.ప్రావీణ్య



కాళోజీ కళాక్షేత్రంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

బాలసముద్రం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాళోజీ కళాక్షేత్రంలో మిగిలిన నిర్మాణ పనులను సోమవారం పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులకు, అధికారులకు కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. ఈ నెల 19న సీఎం రేవంత్‌రెడ్డి కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆదివారం బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడెలతో కలిసి పనులు పరిశీలించారు. ప్రారంభోత్సవం రోజు ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం హయగ్రీవచారి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సీఎం హెలిపాడ్‌ను కలెక్టర్ సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కాళోజీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీలో సందర్శకుల కోసం అందుబాటులో ఉంచి కాళోజీకి వచ్చిన అవార్డులు, ప్రశంసాపత్రాలు

కలికితురాయి.. కళాక్షేత్రం!
- ఎన్నో ప్రత్యేకతలు.. మరెన్నో విశేషాలు..
- ఆకట్టుకునే రీతిలో ఆడిటోరియం, ఆర్ట్ గ్యాలరీ
- ప్రాంగణంలో కాళోజీ విగ్రహం ఏర్పాటు
- ఈనెల 19న సీఎం చేతుల మీదుగా ప్రారంభం
8



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రంగస్థల కళాకారులు

రంగస్థల కళాకారులకు సహకరించాలి

ఉమ్మడి వరంగల్ జిల్లా నాటక సమాజాల సమాఖ్య విజ్ఞప్తి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 17: ఉమ్మడి వరంగల్ జిల్లా రంగస్థల కళాకారులకు సహకరించాలని జిల్లా నాటక సమాజ సమాఖ్య నాయకులు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును కలిసి విజ్ఞప్తి చేశారు. కళాకారులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించారు. ఆదివారం హనుమకొండలో జరిగిన ప్రత్యేక సమావేశంలో నాగరాజును కలిసి కళాకారుల సమస్యలు వివరించారు. అంతేకాకుండా కాకతీయ నాటక కళాపరిషత్తు బీమారం సంస్థకు గౌరవ అధ్యక్షుడిగా నాగరాజును ఉండాలని కోరడంతో అంగీకరించారు. జిల్లాలో ప్రతిభగత కళాకారులు పుష్కలంగా ఉన్నారని, కళాకారులను వెలికితీసి గుర్తింపునివ్వాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. ఇకపై నాటకోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రభుత్వం తరుపున జరిపించేందుకు తనవంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే నాగరాజును కలిసిన వారిలో నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం, కాకతీయ నాటక కళాపరిషత్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాధారపు సంజీవరెడ్డి, కార్యవర్గ సభ్యులు గూడూరు బాలాజీ, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఓడపెల్లి చక్రపాణి, కోశాధికారి సీత వెంకటేశ్వర్లుతో పాటు కళాకారులు ఉన్నారు.

సందడిగా ఉమ్మడి జిల్లా స్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న స్వామి చరణ్

వరంగల్ స్పోర్ట్స్ నవంబరు17:(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభమైయ్యాయి. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని డీఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్ - 12, 13, 14, 15, 16, 17 బాల బాలికల స్విమ్మింగ్ ఎంపిక పోటీలను తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లాప్రధాన కార్యదర్శి స్వామి చరణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఫ్రీస్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్టు స్ట్రోక్, బటర్‌ఫ్లై, ఇండివిజల్ మిడ్‌లే విభాగాల్లో ఎంపికలు నిర్వహించామన్నారు. ఇక్కడ జిల్లాస్థాయిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 40మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన స్విమ్మర్లు డిసెంబరు 7, 8తేదీల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్ రాయబారపు నవీన్, కోచ్‌లు, టెక్నికల్ అఫిషియల్స్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిరూపిస్తే రాజీనామా చేస్తా..

- రాజయ్య 'దళితబంధు' మోసాలను నిరూపిస్తా..
- ఆయన రాజీనామా చేస్తాడా..
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్ ఘన్‌పూర్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తాను అవినీతి, భూ కబ్జాలకు పాల్పడినట్టు మాజీ ఎమ్మెల్యే రాజయ్య నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఆదివారం ఘన్‌పూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాజయ్య నిరూపించని పక్షంలో ఆయన దళితబంధు పేరుతో వందలాదిమంది పేద, దళిత బిడ్డలను ఏవిధంగా మోసం చేశావో సాక్ష్యాలతో ప్రజలు, మీడియా ముందు నిరూపిస్తానని తెలిపారు. నిరూపించిన వెంటనే రాజయ్య రాజకీయాల నుంచి తప్పుకుంటావా, ఏమాత్రం ధైర్యం ఉన్న తన సవాల్‌ను స్వీకరించాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నానని తెలిపారు. రెట్టింపు అభివృద్ధి చేసి తన మార్కు చూపిస్తానన్నారు.

ఆరు పనులకు సీఎం ఆమోదం..

నియోజకవర్గ అభివృద్ధికి పది ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా ఆరు ప్రతిపాదనలకు సీఎం మంజూరు ఇచ్చారని కడియం వెల్లడించారు. వాటిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ గురుకులం, వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి, ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజన్ ఆఫీసెస్ కాంప్లెక్స్ నిర్మాణానికి మంజూరి ఇచ్చిందని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు, ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయడం జరుగుతుందన్నారు. మల్లన్న ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను జూన్‌లో పూర్తి చేసి గోదావరి జలాలు అందిస్తామని తెలిపారు. రఘునాథపల్లి, వేలేరు మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు, చిలుపూర్ మండలకేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలను నెలకొల్పనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో రూ.300 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు.

సీఎం పర్యటనను జయప్రదం చేయండి...

ఈనెల 19న సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలనకి కడియం కోరారు. హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించనున్న మహిళ బహిరంగ సభకు ఘన్‌పూర్ నుంచి భారీగా మహిళలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రారంభించడం జరిగిందన్నారు. రైతు భరోసాను ప్రభుత్వం త్వరలోనే అందించనుందన్నారు. కార్యక్రమంలో రైసు మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, జిల్లా నాయకులు సీహెచ్ నరేందర్ రెడ్డి, మంచాల ఎల్లయ్య, నూకల ఐలయ్య, అంబటి కిషన్‌రాజ్, గడ్డమీది సురేష్, గుర్రపు ప్రసాద్, తీగల కరుణాకర్, బూర్ల శంకర్, కోతి రాములు, ఇనుగాల రాజిరెడ్డి, సింగపురం వెంకటయ్య పాల్గొన్నారు.

కలిసుందాం.. రా..!

(5వ పేజీ తరువాయి)

మంజూరు చేసి పనులన్నీ పూర్తి చేయించారు. తాజాగా మామునూరు ఎయిర్ పోర్టు నిర్మాణానికి కావాల్సిన 253 ఎకరాల భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.205కోట్ల నిధులను ఆదివారం మంజూరు చేసింది. 2050 వరకు వరంగల్ నగరానికి కొత్త మాస్టర్ ప్లాన్‌కు ప్రభుత్వం ఆమోదం, ఇన్నర్, ఔటర్ రింగు రోడ్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇలా వరంగల్ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా ఫోకస్ చేస్తుంటే.. ఓరుగల్లు నేతల మధ్య విభేధాలు అధిష్ఠానానికి తలనొప్పిగా మారాయి. ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేయటం చికాకుగా మారటంతో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా జోక్యం చేసుకున్నారనే చర్చ జరుగుతోంది. మంత్రి సురేఖతో పాటు ఓరుగల్లు ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగతం మాట్లాడినట్లు తెలుస్తోంది. ఏ సమస్య ఉన్నా.. తన వద్దకు రావాలని, రచ్చకెక్కవద్దని సూచించినట్లుగా తెలిసింది. మీ నియోజకవర్గాల అభివృద్ధి, పార్టీ కోసం, మీ గెలుపు కోసం పని చేసిన కేడర్‌ను కాపాడుకునేందుకు కావాల్సిన వాటిపై దృష్టి పెట్టాలని టీసీపీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సైతం సూచించినట్లుగా తెలిసింది. దీంతో పాటు కాంగ్రెస్ పాలనకు ఏడాది కావస్తుండటంతో అసమ్మతి రాగాలు వినిపించటం మంచిది కాదనే చర్చ పార్టీలో జరిగినట్లుగా సమాచారం. దీంతో తాత్కాలికంగానైనా విభేదాలు పక్కన పెట్టి నేతలు, ఎమ్మెల్యేలు కలిసి అభివృద్ధిలో భాగస్వాములు కావటంతో పాటు విజయోత్సవాలను విజయవంతం చేసేందుకు ఐక్యతగా ముందుకు సాగుతున్నారనే చర్చ జరుగుతోంది. ఈ ఐక్యత తాత్కాలికమా.. శాశ్వతమా.. అనేది పక్కన పెడితే.. చాలా రోజులకు ఓరుగల్లు కాంగ్రెస్‌లో ఐక్యత కనిపించటం మాత్రం కేడర్‌లో జోష్‌లో ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

సీఎం హెలిప్యాడ్ వద్ద బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు



కాళోజీ కళాక్షేత్రం సీఎం హెలిప్యాడ్ వద్ద తనిఖీలు చేస్తున్న బాంబుస్క్వాడ్ సిబ్బంది

బాలసముద్రం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనలో భాగంగా నగరంలో పోలీసులు విరివిగా తనిఖీలు చేస్తున్నారు. హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం పక్కన హయగ్రీవచారి గ్రౌండ్‌లో సీఎం కోసం ప్రత్యేకంగా అధికారులు హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. హెలిప్యాడ్ సమీపంలో బాంబుస్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తనిఖీలు చేపట్టారు.

నార్కోటిక్ పోలీస్‌స్టేషన్ రెడీ

- 19న సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు
- ఈ పీఎస్ పరిధిలోకి ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలు



ములుగురోడ్డులో ఉన్న నార్కోటిక్ పోలీసు స్టేషన్

హనుమకొండ టౌన్, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీసు కమిషనరేట్ కేంద్రంగా నూతనంగా నిర్మించిన వరంగల్ నార్కోటిక్ పోలీస్ స్టేషన్ (డబ్ల్యూఎన్‌పీఎస్)ను ఈ నెల 19న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు వరంగల్ నార్కోటిక్ పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు. గత ప్రభుత్వంలో డ్రగ్స్‌ను నివారించేందుకు తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీన్యాబ్)ను తీసుకురాగా, టీజీన్యాబ్ మార్గదర్శకత్వంలో 11 నెలలుగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంగా ఏర్పాటైన నార్కోటిక్ టీం ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్న నేరస్థులను పట్టుకోవడం, చట్టాన్ని అమలుచేయడం, బాధితులకు పునరావాసం కల్పించడం, పట్టుబడ్డ మాదక ద్రవ్యాలను స్థానిక పోలీసులకు అప్పగించడం, ధ్వంసం చేయడం వంటి చర్యలపై దృష్టిసారించింది. 11 నెలలుగా ఉమ్మడి వరంగల్, ఖమ్మంలో డ్రగ్స్ నివారణకు పనిచేస్తున్న నార్కోటిక్ పోలీసులకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్ లేకపోవడంతో ములుగురోడ్డులోని ఇండస్ట్రియల్ ఏరియాలో జిల్లా కలెక్టర్ సెట్వార్ భవనం కేటాయించడంతో మరమ్మతులు చేయించారు. ఈ నెల 19న వరంగల్ పర్యటనకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డితో వర్చువల్ లేదా ప్రత్యక్షంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ నార్కోటిక్ డీఎస్పీ సైదులు తెలిపారు.

కాగా, వరంగల్ పోలీస్ కమిషనరేట్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని డ్రగ్స్‌ను నిలువరించేందుకు వరంగల్ నార్కోటిక్ పోలీస్‌స్టేషన్ కేంద్రంగా ఈ పోలీసు స్టేషన్ పనిచేస్తుంది. ఇందులో ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్సైలు, నలుగురు హెడ్‌కానిస్టేబుల్స్, ఏడుగురు కానిస్టేబుల్స్ విధులు నిర్వహిస్తున్నారు.

ఎయిర్ పోర్ట్ ఇక చకచకా..

- భూసేకరణకు రూ.205 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- డీపీఆర్ సిద్ధం చేయాలని ఏఏఐకి ఆర్‌అండ్‌బీ లేఖ



శంభునిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మామునూరులో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. రాష్ట్రానికి రెండో రాజధానిగా వరంగల్‌ను తీర్చిదిద్దుతామని ఇప్పటికే ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఎయిర్‌పోర్ట్‌కు 696 ఎకరాల భూమి ఉంది. అయితే ఏఏఐ నిబంధనల మేరకు మరో 253 ఎకరాలు అవసరం ఉంది. రన్‌వే విస్తరణకు, కార్యకలాపాలకు నక్కలపల్లి, గాడెపల్లి గుంటూరుపల్లి గ్రామాల్లో స్థలాన్ని ఎంపిక చేశారు. కానీ భూసేకరణకు అడుగులు పడలేదు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ఇటీవలే వరంగల్ ప్రజాప్రతినిధులు, అధికారులు భూసేకరణ కోసం విమానాశ్రయాన్ని సందర్శించి అవసరమైన భూముల యజమానులతో చర్చలు జరిపారు. భూనిర్వాసితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇవ్వడంతో వారు అంగీకరించారు.

రూ.205 కోట్లు మంజూరు

భూనిర్వాసితులకు పరిహారం చెల్లించటానికి రూ.205 కోట్లను విడుదల చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. భూసేకరణ త్వరగా ముగించాలని నోడల్ అధికారులు, జిల్లా కలెక్టర్, ఆర్డీవోలకు ఆదేశాలు జారీ చేసింది. భూసేకరణ చేసే 253 ఎకరాల్లో రన్‌వే విస్తరణతో పాటు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ) టెర్మినల్ భవనం, నేవిగేషన్ ఇన్‌స్ట్రుమెంట్ ఇన్‌స్టాలేషన్ విభాగాల కోసం వినియోగించనున్నారు. ఇదిలా ఉండగా ఆర్‌అండ్‌బీ ఏఏఐకి లేఖ రాసింది. ఎయిర్‌పోర్ట్ నిర్మాణ నమూనా (డీపీఆర్) పంపించాలని లేఖలో కోరింది.

పనులు ప్రారంభించాలని కేంద్రాన్ని కోరుతా... : కడియం కావ్య, వరంగల్ ఎంపీ

ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని కేంద్రాన్ని కోరుతా. ఇప్పటికే కేంద్ర పౌర విమానయాన శాఖతో పాటు ఏఏఐకి పలుమార్లు విన్నవించాను. విమానాశ్రయ నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ, సాంకేతిక అడ్డంకులను సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో తొలగించుకున్నాం. రానున్న శీతాకాల సమావేశాల్లో పార్లమెంట్‌లో వరంగల్ ఎయిర్‌పోర్ట్‌పై చర్చించి నిర్మాణ పనులకు ముందుకు రావాలని సంబంధిత శాఖను కోరుతా. త్వరలోనే వరంగల్ ప్రజల చిరకాల వాంఛ అయిన మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పూర్తవుతుంది. అందుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డితో పాటు, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు, రైతులకు కృతజ్ఞతలు.

నకిలీ వైద్యులపై వైద్య మండలి దాడులు



నకిలీ ఆస్పత్రులపై దాడులు నిర్వహిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నకిలీ వైద్యులపై వైద్య మండలి సభ్యులు దాడులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కాజీపేట ప్రాంతంలో ఆదివారం నకిలీ వైద్యులపై తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి అధికారులు తనిఖీలు చేపట్టారు. హనుమకొండ దీన్‌దయాల్‌నగర్‌లోని నకిలీ వైద్యుడు బండి సదానందం ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో డాక్టర్ అని పేర్కొంటూ జనరల్ మెడికల్ ప్రాక్టీషనర్‌గా మందులు రాయడంతోపాటు గల నెలలో మంగమ్మ అనే 60 ఏళ్ల వృద్ధురాలిని తాను డాక్టర్‌ను నమ్మించి వైద్యం చేయడంతో షుగర్ ఎక్కువగా ఉండటం, కామెర్లు ఉన్నప్పటికీ అవి గుర్తించకుండా స్టెరాయిడ్స్ ఇతర యాంటీబయోటిక్ మందులు ఇవ్వడంతో ప్రాణాపాయ స్థితికి చేరిందని పేర్కొన్నారు. తనిఖీల్లో భాగంగా టీజీఎంసీ అధికారులు సదరు వైద్యుడు వైద్యుడే కాదని గుర్తించారు. ఫస్ట్ ఎయిడ్‌కు అనుబంధంగా ఉన్న వీణ మెడికల్స్ యజమాన్యం కూడా క్వాలిఫైడ్ డాక్టర్ మందుల చిట్టీ లేకుండా నకిలీ వైద్యుడి సలహా మేరకు షెడ్యూల్ హెచ్ డ్రగ్స్ అమ్ముతున్నట్లు గుర్తించారు. వీణ మెడికల్స్‌తోపాటు నకిలీ వైద్యుడిని, మందుల ఫ్యాడ్స్ అందించిన సాగరిక మెడికల్ స్టోర్‌పై డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు టీజీఎంసీ అధికారులు తెలిపారు. ఈ తనిఖీలలో వరంగల్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ మియా, టీజీఎంసీ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ వి.నరేశ్ కుమార్, కరీంనగర్ జిల్లా హెచ్‌ఆర్‌డీఏ సెక్రటరీ డాక్టర్ రితేష్‌లు పాల్గొన్నారు.

ప్రతీ పౌరుడు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

న్యూశాయంపేట, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ప్రతీ పౌరుడు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఐఎంఏ జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని ఆకృతి అవెన్యూ అపార్ట్‌మెంట్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో అపార్ట్‌మెంట్ వాసులకు వైద్యులు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆకృతి అవెన్యూ అపార్ట్‌మెంట్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తిరువంగం ప్రభాకర్, శ్రీధర్, యాకయ్య, విష్ణువర్ధన్, సంపత్‌రావు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముంపు నివారణకు నిధుల విడుదల



కాకతీయ మెగా టెక్స్‌టైల్‌పార్కు పైలాన్

వరంగల్ సిటీ, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): గీసుగొండ మండలం శాయంపేటలో ఏర్పాటు చేసిన మెగా టెక్స్‌టైల్ పార్కులో ముంపు నివారణకు రూ.160.92 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ సందర్భంగా అటవీ, దేవాదాయ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాకాలంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు పొంచి ఉన్న ముంపును నివారించేందుకు గాను రిటైనింగ్ వాల్ నిర్మించి వరదనీరు సాఫీగా వెళ్లేందుకు గాను నిధులు విడుదల చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ఏర్పాటు కోసం భూములు కోల్పోయిన నిర్వాసితులకు శనివారం 863 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి 24 గంటలు గడువక ముందే వరద ముంపు నివారణ కోసం రూ.160.92 కోట్లను విడుదల చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శమని తెలిపారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపట్టిన పనులకు ఇది ఆరంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో సంక్షేమంలో స్వర్ణయుగాన్ని ఆవిష్కరించేదిశగా కార్యాచరణ అమలు చేయబోతోందని మంత్రి తెలిపారు.

సీఎంకు ధన్యవాదాలు..

వరంగల్ నగరాన్ని రాష్ట్రానికి రెండో రాజధానిగా అభివృద్ధి చేయాలని సంకల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వరంగల్ ఎంపీ కడియం కావ్య ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణ కోసం ఆదివారం రూ.205 కోట్లను విడుదల చేస్తూ ఒక జీవో జారీ చేశారని తెలిపారు. అదేవిధంగా గీసుగొండలో ఏర్పాటు చేసిన కాకతీయ టెక్స్‌టైల్ పార్క్ కోసం భూములిచ్చిన వారికి 863 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ శనివారం జీవో విడుదల చేశారని, దాంతో పాటు టెక్స్‌టైల్ పార్క్‌లో వరదముంపు నివారణకు రూ.160.92కోట్లను విడుదల చేస్తూ ఆదివారం జీవో జారీ చేశారని పేర్కొన్నారు. అదీ కాక 2050 మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని, నగరం చుట్టూ రీజనల్ రింగ్‌రోడ్డు, ఓటర్, ఇన్నర్ రోడ్ల నిర్మాణం జరుగనుందని తెలిపారు. అండర్‌డ్రైనేజీ వ్యవస్థతోపాటు నాలాల పునరుద్ధరణ జరుగుతుందని పేర్కొన్నారు. నగరం చుట్టూ ఉన్న 19 మండలాలు, 181 గ్రామాలకు మహర్దశ పట్టనుందని, ఒకటి తరువాత ఒకటి వేగవంతంగా పనులు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఎంపీ కావ్య పేర్కొన్నారు.

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు మరో రూ.160.92కోట్లు

హర్షం వ్యక్తం చేసిన మంత్రి కొండా సురేఖ

విజయవంతంగా ముగిసిన సీపీ స్టార్ టెస్ట్



సీపీ సెట్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

న్యూశాయంపేట, నవంబరు17(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ వారి జాతీయ స్థాయి నీట్, ఐఐటీ కోచింగ్ సెంటర్ హనుమకొండ హంటర్‌రోడ్‌లోని న్యూశాయంపేట జంక్షన్‌లో ఉన్న కెరీర్ పాయింట్ వరంగల్ బ్రాంచ్‌లో ఆదివారం నిర్వహించిన సీపీ స్టార్ టాలెంట్ టెస్ట్-2025కు విజయవంతంగా ముగిసినట్లు వరంగల్ బ్రాంచ్ చైర్మన్ జూలపెల్లి కరుణాకర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రావు మాట్లాడుతూ.. సీపీస్టార్ టెస్ట్‌కు 892 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఈ టెస్ట్ ఫలితాలను త్వరలోనే వెల్లడి స్తామన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా గత సంవత్సరం మాదిరిగానే ఈ యేడు కూడా అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి చక్కటి ప్రణాళికతో ముందుకెళుతున్నామన్నారు. ఈ టెస్ట్‌కు విశేష ఆదరణ లభినందుకు యాజమాన్యం తరఫున సంతోషం వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

లారీ సప్లయర్స్ అసోసియేషన్ ఎన్నిక



ఎన్నికైన కమిటీని సత్కరిస్తున్న సభ్యులు

శంభునిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా లారీ సప్లయర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. రంగశాయిపేటలోని జిల్లా కార్యాలయంలో ఆదివారం ఈ ఎన్నికలు నిర్వహించారు. వంగాల సమ్మిరెడ్డి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కొండా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ హిదయతుల్లా బాబర్, కోశాధికారిగా దాసరి నాగరాజు, జాయింట్ సెక్రెటరీగా మందాటి రవీందర్, ఈసీ మెంబర్‌లుగా తాళ్ళ కుమార్, బాసాని రామకృష్ణ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో నామినేషన్‌లు రాకపోవటంతో ఎన్నికల పర్యవేక్షణ అధికారి అయిన అడ్వకేట్ చకిలం ఉపేందర్ అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ధ్రువీకరించి నియామక పత్రాలు అందించారు. అనంతరం నూతన కమిటీలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కమిటీ రెండేళ్ళ పాటు పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్‌హక్ కమిటీ బాధ్యులు మెంగని సదానందం, తోట దేవేందర్, కందిమల్ల భాస్కర్‌రావు, వెలిశాల శ్రీనివాస్, ఇంజమూరి సూర్యనారాయణ తదితరులు పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపి సత్కరించారు.

ఫార్మసీ చట్టాలను అమలు చేయాలి

వరంగల్ మెడికల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫార్మసీ చట్టాలను కఠినంగా అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఫార్మసిస్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ డిమాండ్ చేశారు. జాతీయ ఫార్మసీ వారోత్సవాల సందర్భంగా బత్తిని సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఫార్మసిస్టు యాక్ట్ 1948 సెక్షన్ 42ను కఠినంగా అమలు చేసేందుకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఫార్మసిస్టు అంటే ప్రాణ రక్షకుడు అని ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు అన్ని కూడా ఫార్మసిస్టులకు ఎంతో గుర్తింపునిస్తూ గౌరవప్రదమైన వేతనాలు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు సరైన రీతిలో వైద్య సేవలు అందించడానికి ఫార్మసిస్టుల సేవలు గుర్తించాలన్నారు. విద్యార్హతల ప్రకారంగా ఫార్మసిస్టులకు మంచి వేతనాలు ఇవ్వాలని కోరారు.

వసతి గృహ విద్యార్థులకు ఊరట

- కాస్మొటిక్స్, డైట్ చార్జీల పెంపుపై విద్యార్థుల హర్షం
- 17 సంవత్సరాల అనంతరం పెంచిన కాంగ్రెస్ సర్కారు
- హాస్టళ్లలో అందనున్న నాణ్యమైన ఆహారం

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతి గృహాలు, గురుకులాలలో చదువుకుంటున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం కాస్మోటిక్స్, డైట్‌చార్జీలను పెంచింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. 17 ఏళ్ల అనంతరం కాస్మోటిక్స్, డైట్ చార్జీలు భారీగా పెంచడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెంచిన చార్జీలు ఈ నెల 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని ప్రభుత్వం జీవోలో పేర్కొంది. దీంతో హనుమకొండ జిల్లాలో ఉన్న 24 ఎస్సీ వెల్ఫేర్ (ప్రీ, పోస్ట్‌మెట్రిక్) వసతి గృహాల్లో చదువుకుంటున్న 1,293 మంది విద్యార్థులు, 15 బీసీ వెల్ఫేర్ (ప్రీ, పోస్ట్‌మెట్రిక్) వసతి గృహాల్లో చదువుకుంటున్న 1,325 మంది విద్యార్థులు, 13 ఎస్టీ వెల్ఫేర్ (ప్రీ, పోస్ట్‌మెట్రిక్) వసతి గృహాల్లో చదువుకుంటున్న 1,961 మంది విద్యార్థులకు ఊరట లభించింది.



హనుమకొండలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో భోజనం చేస్తున్న విద్యార్థులు

● భారీగా కాస్మోటిక్ చార్జీల పెంపు

3వ తరగతి నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రస్తుతం రూ.55 ఇస్తుండగా, దీనిని ప్రభుత్వం రూ.175కి పెంచింది. అలాగే 8వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.75 ఉండగా, రూ.275కి పెంచారు. 3వ తరగతి నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు హెయిర్ కటింగ్‌తో కలిపి ప్రస్తుతం రూ.62 ఇస్తుండగా, దీనికి రూ.150కి పెంచారు. అలాగే 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు హెయిర్ కటింగ్‌తో కలిపి ప్రస్తుతం రూ.62 ఇస్తుండగా, దీనిని రూ.200కు పెంచారు.

● డైట్ చార్జీలు 40శాతం పెంపుదల

3వ తరగతి నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రస్తుతం రూ.950 ఇస్తుండగా, దీనిని ప్రభుత్వం రూ.1,330కి పెంచింది. అలాగే 8వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.1,100 ఇస్తుండగా, దీనిని రూ.1,540కి పెంచారు. ఇంటర్మీడియట్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతున్న విద్యార్థులకు ప్రస్తుతం రూ.1500 ఇస్తుండగా, దీనిని రూ.2100కి పెంచారు.

సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటాం..

ఎం.సాయిచరణ్, ప్రభుత్వ బీసీ హాస్టల్, హనుమకొండ



వసతిగృహాల్లో ఉండే విద్యార్థులకు కాస్మోటిక్స్, డైట్ చార్జీలు భారీగా పెంచిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటాం. దాదాపు 40శాతం పెంచిన డైట్ చార్జీల వలన విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందుతుంది. ఇంకా రానున్న రోజుల్లో కూడా విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం మంచి పథకాలు తీసుకురావాలని కోరుకుంటున్నాం.

చాలా ఆనందంగా ఉంది..

పి.సాయిప్రియ, ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్



ప్రభుత్వం వసతి గృహాల విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం ఆనందంగా ఉంది. ఇన్ని రోజులు ఇబ్బంది పడ్డాం. ప్రతీసారి తల్లిదండ్రులను అడగాల్సి వచ్చేది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చార్జీలు పెంచడంతో తల్లిదండ్రులపై ఆధారపడకుండా ఉండే అవకాశం లభించింది. మాకు నాణ్యమైన ఆహారం కూడా అందుతోంది. వసతి గృహాల విద్యార్థుల పక్షాన ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు.

పిల్లలకు పౌష్టికాహారం పెట్టొచ్చు..

జి.రాంరెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల ఉప సంచాలకుడు



రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కాస్మోటిక్, డైట్ చార్జీలతో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం పెట్టొచ్చు. గతంలో విద్యార్థులకు డబ్బులు సరిపోయేవి కావు. ఇప్పుడు పెరిగిన డబ్బులతో విద్యార్థులు తమ తమ తల్లిదండ్రులపై ఆధారపడకుండా వీటి నుంచే పాకెట్ మనీకి ఉపయోగించుకోవచ్చు. విద్యార్థులకు కాస్మోటిక్స్, డైట్ చార్జీలు పెంచడంతో హాస్టళ్లలో పిల్లల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది. 17 ఏళ్ల తర్వాత వసతిగృహాలలో ఉండే పేద, మధ్య తరగతి విద్యార్థులకు చార్జీలు పెంచడాన్ని హర్షిస్తున్నాం.

అజీజ్‌ఖాన్‌కు సన్మానం



సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాజీపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎంపికైన అజీజ్ ఖాన్‌ను ఆయన గృహంలో ఆదివారం కాజీపేట కాంగ్రెస్ నాయకులు అభినందించారు. బొకే ఇచ్చి శాలువా కప్పి, సన్మానం చేశారు. జనగామ జిల్లా గంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబును సైతం సన్మానించారు. కార్యక్రమంలో కాజీపేట 47వ డివిజన్ నాయకులు సిరిల్ లారెన్స్, గోల్కొండ రాంబాబు, సిలువేరు విజయ్ భాస్కర్, బర్లరాజ్‌కుమార్, బి. శ్రీనివాస్, పి. శ్రీనివాస్ ఉన్నారు.

తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఎన్నిక

హనుమకొండ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కంపెనీ సెక్రటరీగా బి.సామ్యానాయక్, ఉపాధ్యక్షుడిగా వై.రాంబాబు, జాయింట్ సెక్రటరీగా టి.కిరణ్ నియామకమయ్యారు. నూతన కార్యవర్గం మూడేళ్లు పనిచేస్తోంది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

24న వన భోజనాలు



బ్రోచర్ విడుదల చేస్తున్న పద్మశాలీలు

హనుమకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా పద్మాశాలి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన కార్తీక మాస వనభోజనాలను నిర్వహిస్తున్నట్లు సంఘం హనుమకొండ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చందా మల్లయ్య తెలిపారు. ధర్మసాగర్ రిజర్వాయర్ కట్టపై కొత్తగా నిర్మిస్తున్న శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం శివపార్వతుల విగ్రహాలకు పూజలు, అభిషేకాలు, కార్తీక దీపాలు పెట్టిన అనంతరం ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్‌తోపాటు పద్మశాలి ప్రముఖులు హాజరవుతారని, జిల్లా, రాష్ట్ర కమిటీకి ఎన్నికైన పద్మశాలి నేతలకు సన్మానం ఉంటుందని తెలిపారు. పద్మశాలి కులస్థులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ లక్ష్యాలకు భిన్నంగా ఉన్న నూతన జాతీయ విధానాన్ని తిరస్కరించి తెలంగాణ రాష్ట్రంలో కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్‌లోని రంగశాయిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వరంగల్ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన భోగేశ్వర్ మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి, ధనికుల పిల్లలు ఎవరైనా ఒకే స్కూల్లో చదువుకునే విధంగా కామన్ స్కూల్ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రప్రభుత్వం తిరస్కరించాలన్నారు. శాస్త్రీయ విద్యా విధానానికి అనుగుణంగా శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిని పాఠ్యాంశాల్లో పొందుపరచాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని గదిని ఒక పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయున్ని ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి దూరంగా ఉంచాలన్నారు. అర్హులైన రెగ్యులర్ డీఈవో, డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలను నియమించాలన్నారు. అకడమిక్ క్యాలెండర్ రాష్ట్రవ్యాప్తం గా అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు కనీసం 20శాతం నిధులు కేటాయించాలన్నారు. పుస్తకాల భారాన్ని తగ్గించాలని, నాణ్యమైన సంతులిత భోజనాన్ని అందించాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతీ నెల గౌరవ వేతనం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు ఎస్.కవిత, జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, పి.మనోజ్, వి.అజయ్‌బాబు, జె.స్వామి, ఇ.వీరస్వామి, బి.ప్రసాద్, ఎం.వెంకట్, తన్వీర్, బి.స్వామి, యు. అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భోగేశ్వర్

సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులే

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

బాలసముద్రం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజల సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో సీపీఐ నిరంతర రాజకీయ పాఠశాలను తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సీపీఐ 1925 డిసెంబరు 26న ఆవిర్భవించి దేశ స్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ కార్యకర్తలు, నాయకులపై అనేక కేసులు పెట్టినా ప్రజలను చైతన్యం చేస్తూ స్వాతంత్ర్యం సిద్ధించే వరకు పోరాటం చేసిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదన్నారు. రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మార్క శంకర్ నారాయణ మాట్లాడుతూ.. కమ్యూనిస్టులు దేశంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తూనే మరోవైపు మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మీ, స్టాలిన్, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, నెదునూరి రాజమౌళి, బత్తిని సదానందం, వేల్పుల సారంగపాణి, మంచాల రమాదేవి పాల్గొన్నారు.

వరంగల్ కోటలో టీడీపీ సభ్యత్వ నమోదు

ఖిలావరంగల్, నవంబర్ 17(ఆంధ్రజ్యోతి): ఖిలావరంగల్ పెట్రోల్ పంపు వద్ద ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ అడ్‌హక్ కమిటీ సభ్యుడు జీఎల్ శ్రీధర్, 38వ డివిజన్ టీడీపీ నాయకుడు నల్లకుంట రవీందర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. టీడీపీ జాతీయ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు తెలంగాణలో సైతం పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగవెళ్లి సురేష్, బరిగెల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఖిలావరంగల్ పెట్రోల్‌పంపు వద్ద టీడీపీ సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు

బల్దియా నూతన భవనానికి నిధులు కేటాయింపు

రూ.32.50కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం



బల్దియా ఇండోర్ స్టేడియం ఎదుట నూతన భవనం కోసం తీసిన గుంత

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన భవనం నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాకు వస్తున్న నేపథ్యంలో వరంగల్ నగరానికి వరాల జల్లును కురిపించారు. బల్దియా ప్రధాన కార్యాలయం వెనకాల నిర్మించాల్సిన నూతన భవనం నిర్మాణం చేయడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. దీంతో ఆదివారం నిర్మాణాలు వెంటనే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంతే కాకుండా బల్దియా నూతన భవనం నిర్మాణం చేపట్టేందుకు కావలసిన నిధులను మంజూరు చేస్తూ మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ ఆదేశాలు జారీ చేశారు. నూతన భవనం నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.32.50 కోట్లు విడుదల చేశారు.

కాగా, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ప్రధాన కార్యాలయం (ఇండోర్ స్టేడియం ముందు) నూతన భవనం నిర్మాణం చేయాలని 2022లో అప్పటి తెలంగాణ ప్రభుత్వం రూ.20కోట్ల నిధులు కేటాయించి పనులను ప్రారంభించింది. కానీ నిధులు విడుదల కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో అక్కడ తీసిన పెద్దగుంత అలాగే ఉంది. ఈ క్రమంలో తాజాగా రాష్ట్ర ప్రభుత్వం రూ.32.50కోట్లు మంజూరు చేస్తూ ఆదివారం జీవో జారీ చేసింది. ఐదు అంతస్థుల వరకు కొత్త భవణాన్ని నిర్మించాలని ప్రతిపాదనలో తెలిపింది. చాలా రోజుల తర్వాత నూతన భవనం పనులు ప్రారంభం కానుండడంతో వరంగల్ నగర ప్రజలు, బల్దియా ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పేదింటి పెళ్లికి ఆర్థిక సహాయం



నగదు అందిస్తున్న ప్రదీప్‌రావు యువసేన బాధ్యులు

శంభునిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కూతురు పెళ్లిచేయలేని కార్యకర్తలకు బీజేపీ నాయకులు అండగా నిలిచారు. కరీమాబాద్ ప్రాంతానికి చెందిన నిరుపేద కార్యకర్త అయిన ఆకుతోట రాజు-నాగభవానీల కూతురు నాగభవాని వివాహానికి వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు లక్ష రూపాయల ఆర్థిక సహాయం చేశారు. దీంతో పాటు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు యువసేన బాధ్యులు రూ.55,000 ఆదివారం వివాహ మహోత్సవంతో రాజుకు అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కర్నె రవీందర్, కందిమల్ల మహేష్, తాబేటి వెంకట్ గౌడ్, బోరిగం నాగరాజు, అర్జున్ గౌడ్, బక్కి రంజిత్, నాగరాజు, కర్నె వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడి కుటుంబానికి చేయూత..



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న టీ రైల్వే జేఏసీ

కాజీపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో సీటీఐగా పనిచేస్తూ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచేసిన సి.నాగరాజు ఈ నెల 9న అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం టీరైల్వే ఎంప్లాయీస్ జేఏసీ ఆర్థిక సహాయాన్ని అందజేసింది. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ కోండ్ర నర్సింగరావు, కో - కన్వీనర్లు అనుమాస శ్రీనివాస్, జి. భాస్కర్, వైస్ చైర్మన్ ఎస్. లక్ష్మీనారాయణ ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి..



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న మిత్రులు

హసన్‌పర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మునిపల్లి గ్రామానికి చెందిన ఉచిత కుమారస్వామి ఇటీవల గుండె పోటుతో మృతి చెందగా టెన్త్ 2005 బ్యాచ్‌కు చెందిన మిత్రులు ఆదివారం రూ.15వేల ఆర్థిక సాయం అందించారు. మృతుడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అబ్బరవేన కరుణాకర్, ఉజ్జేతుల రాకేష్, బండి సురేష్, బండి సతీష్, మాదాసి రాజేష్, గడ్డం పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది వైఫల్యోత్సవ సభ

- డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీమ్ మసూద్

మిల్స్‌కాలనీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్నది విజయోత్సవ సభ కాదని, వైఫల్యోత్సవ సభ అని డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీమ్ మసూద్ ఎద్దేవా చేశారు. ఆదివారం వరంగల్‌లోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పాలనపై మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం అమలు చేయలేని హామీలిచ్చి అధికారం వచ్చాక హామీలు మరిచి విజయోత్సవ సభలు జరుపుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, ఆడబిడ్డలను, నిరుద్యోగులను నిలువునా మోసం చేసిందన్నారు. ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ వరంగల్‌కు వచ్చి చేసిన డిక్లరేషన్‌లోని హామీలు ఎందుకు అమలుచేయడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్‌కు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఏ ముఖం పెట్టుకొని వరంగల్‌కు వస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేతి వృత్తులకు చేయూత నిస్తూ బలహీన వర్గాలకు విద్య, వృత్తి లాంటి అన్ని అవకాశాల్లో ఆసరాగా నిలువగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాలన్నింటినీ పాతరేసిందని మండిపడ్డారు. గడిచిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వరంగల్ నగరానికి ఎన్ని నిధులు మంజూరు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించకుండా నాయకులే దోపిడీలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, ప్రజలు కేసీఆర్‌ను కోరుకుంటున్నారని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీమ్ మసూద్

నేడు విద్యుత్‌కు అంతరాయం

హసన్‌పర్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏడీ అశోక్ తెలిపారు. పెంబర్తి, గంటూర్‌పల్లి, సీతంపేట గ్రామాల్లో విద్యుత్ మరమ్మతు పనుల కారణం గా సోమవారం రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపి వేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

చెరువులపై డ్రోన్ కెమెరాలతో సర్వే

- భూముల పరిరక్షణకు త్వరలో వెబ్‌సైట్
- వరంగల్, హనుమకొండ పరిధిలో ఇప్పటికే 20 చెరువుల సర్వే పూర్తి
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న కబ్జాదారులు

బాలసముద్రం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చెరువులపై అధికారులు నిఘా పెట్టారు. డ్రోన్ కెమెరాలతో సర్వే చేస్తుండడంతో భూములను కబ్జా చేసిన వారు భయంతో వణికిపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కబ్జాదారుల చెర నుంచి చెరువులు, కుంటలను కాపాడేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వరంగల్, హనుమకొండలోని జీడబ్ల్యూఎంసీ పరిధిలో నీటి పారుదల శాఖ అధికారులు చెరువుల రక్షణకు సర్వే చేస్తున్నారు. వరంగల్ జీడబ్ల్యూఎంసీ పరిధిలో మొత్తం 74 చెరువులకు రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా చెరువుల పరిధిలోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల భూములను గుర్తించేందుకు అధికారులు, ఏజెన్సీ సిబ్బంది ప్రత్యేక డ్రోన్ కెమెరాలతో చెరువులపై నెల రోజుల నుంచి సర్వే చేసి మ్యాప్‌లను తయారు చేస్తున్నారు. ఇప్పటి వరకు 24 చెరువులను సర్వే పూర్తి చేశారు. ఈ సర్వే పూర్తి చేసిన తర్వాత రెవెన్యూ, ఇరిగేషన్, కుడా అధికారులు పర్యవేక్షిస్తారు. అనంతరం మ్యాప్ సిద్ధం చేసి చెరువుల సమాచారాన్ని ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.



హనుమకొండలోని వడ్డెపల్లి చెరువు

● ఆందోళనలో కబ్జాదారులు..

జీడబ్ల్యూఎంసీ పరిధిలోని చెరువులపై అధికారుల సర్వేతో కబ్జాదారులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని సంవత్సరాల నుంచి చెరువు భూములను అక్రమంగా పట్టా చేసుకొని యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టినవారు అయోమయంలో పడుతున్నారు. తమ కబ్జాలు బయట పడకుండా చూడాలని వేడుకుం టూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

● చెరువులపై ప్రత్యేక వెబ్‌సైట్..

హైదరాబాద్ తరహాలో హనుమకొండ, వరంగల్ పరిధిలోని ఎఫ్‌టీఎల్ బఫర్‌జోన్‌ల సరిహద్దులు ఏర్పాటు చేసి ప్రజలకు సమాచారం కోసం చెరువులపై ప్రత్యేక వెబ్ సైట్‌ను త్వరలోనే అందుబాటులోకి తెచ్చేందుకు నీటి పారుదల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రజలు భూములను కొనుగోలు చేసేందుకు ఈ వెబ్‌సైట్ ఉపయోగపడుతుందని వారు అభిప్రాయ పడుతున్నారు.


నర్సంపేట శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయం


గర్భగుడిలోని అయ్యప్పస్వామి


నర్సంపేటలోని అయ్యప్ప దేవాలయంలో మాలలు వేసుకున్న భక్తులు

తెలంగాణ శబరిమల.. నర్సంపేట

- శరణు ఘోషతో వెలుగొందుతున్న ఆలయం
- ఏటా వేలాది మంది భక్తుల మాలాధారణ
- శబరిమల తరహాలో సాగే పూజలు

నర్సంపేట / నర్సంపేట టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం వచ్చిందంటే వేలాది మంది భక్తులు అయ్యప్ప మాలలు ధరిస్తుంటారు. ఓ వైపు శైవక్షేత్రాలు.. మరోవైపు అయ్యప్ప ఆలయాలు మాలధారుల శరణుఘోషతో మారుమోగుతుంటాయి. పల్లెలు, పట్టణాలు పడి పూజలతో పరవశిస్తుంటాయి. ఈ క్రమంలోనే నర్సంపేట పట్టణంలోని శ్రీ ధర్మశాస్త్రా అయ్యప్ప స్వామి దేవాలయం తెలంగాణ శబరిమలగా విరాజిల్లుతోంది. నర్సంపేట నియోజకవర్గంలోని నర్సంపేట, నల్లబెల్లి, చెన్నారావుపేట, దుగ్గొండి, ఖానాపురం, నెక్కొండ మండలాలతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ, గూడూరు మండలాలకు చెందిన వేలాది మంది భక్తులు కార్తీక మాసంలో ఈ ఆలయంలో అయ్యప్ప దీక్షను స్వీకరిస్తారు. నవంబరు, డిసెంబరు నెలల్లో అయ్యప్ప దీక్షాపరు లతో.. నిత్యపూజలతో ఆధ్యాతిక సందడి ఉంటుంది. నర్సంపేట పట్టణంలోని వరం గల్ రోడ్‌లో రెండున్నర దశాబ్దాల క్రితం మహేశ్వరం గ్రామానికి చెందిన దివంగత శింగిరికొండ రామాంజనేయులు, దాతల సహకారంతో నిర్మించిన శ్రీధర్మ శాస్త్రా అయ్యప్ప స్వామి దేవాలయం భక్తుల కొంగుబంగారమై విలసిల్లుతోంది.

దీక్షలు స్వీకరిస్తున్న వందలాది భక్తులు

కార్తీక మాసం ప్రారంభం నుంచి నిత్యం వందల సంఖ్యలో భక్తులు అయ్యప్ప దీక్షలను స్వీకరిస్తుండగా గత రెండు రోజుల్లో సుమారు 640 మంది భక్తులు మాలను ధరించారు. వీరికి ఆలయ అర్చకులు దినేశ్‌మిశ్రా, బ్రాంచు మాలధారణ చేస్తారు. కార్తీక పౌర్ణమి శుక్రవారం ఒక్కరోజే 170 మంది భక్తులు దీక్ష స్వీకరించారు. ఇలా మాలాధారణ స్వీకరించిన భక్తులు ఉదయం, సాయంత్రం వేళల్లో అయ్యప్పస్వామి ఆలయంతో పాటు పట్టణంలోని శివాంజనేయస్వామి ఆలయం, మాధన్నపేట రామలింగేశ్వరస్వామి ఆలయం, వేంకటేశ్వర ఆలయం తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు చేస్తుండడంతో పట్టణం అయ్యప్ప శరణు ఘోష తో మార్మోగుతోంది. ఇక ఎక్కువశాతం మంది మాలధారులు మకర సంక్రాంతి రోజున శబరిమలైకి వెళ్లి మకర జ్యోతిని దర్శించుకొని ఇరుముడిని అప్పగించి 41 రోజుల దీక్షను విరమిస్తారు.

అయ్యప్ప దీక్ష.. ఆరోగ్య రక్ష

41 రోజుల పాటు కఠిన నియమాలతో ఆచరించే అయ్యప్ప దీక్ష ఆధ్యాత్మికతను పెంపొందించడమే కాకుండా ఆరోగ్యాన్ని సైతం పెంచుతుంది. దీక్షా కాలంలో నిష్ఠతో క్రమ పద్ధతిలో జీవనం సాగించడం, సాత్వికాహారం భుజించడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచిదని వైద్యులు చెబుతున్నారు. ఉదయం చన్నీటి స్నానంతో ఏకాగ్రత పెరగడంతో పాటు ఉష్ణం నుంచి తలకు ఉపశమనం కలుగుతుంది.

దీక్షాపరులు మితాహారం తీసు కోవడం వల్ల శరీరం తేలికగా ఉండడంతో పాటు వ్యాధులు దూరమవుతాయి. వంటల్లో వెల్లుల్లి, ఉల్లిపాయ, అల్లం వంటి మసాల దినుసులు ఉపయోగించకపోవడం వల్ల తిన్న ఆహారం తేలికగా జీర్ణమవుతుంది. ఇలా మాలాధారణతో ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్యం పెంపొందించుకోవచ్చు. అలాగే పలు వ్యసనాలకు దూరంగా ఉండటం ద్వారా మనస్సును నియంత్రణలో పెట్టుకోవచ్చని చెబుతున్నారు.

శబరిమల తరహాలో పూజలు

కేరళలోని శబరిమల తరహాలో నర్సంపేట అయ్యప్ప దేవాలయంలో అయ్యప్పకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శబరిమలలో జరిగే ఉత్సవ బలి, క్షేత్ర బలి, పల్లివేట, పంబారట్టు, దివ్య పడిపూజ లాంటివన్నీ ఇక్కడి గురుస్వాములు, తాంత్రికవేత్తల ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతాయి. ఆలయం నుంచి ఊరేగింపుగా అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని మునిసిపాలిటీ ఆవర ణలోని మైదానం వరకు తీసుకెళ్లి పల్లివేట కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అలాగే పట్టణంలోని కమలాపురం సమీపంలోని మాధన్న పేట చెరువులో అయ్యప్పస్వామి పంబారట్టు, జలక్రీడ, అభి షేక పూజలు సందడిగా చేపడతారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది మాలాధారులు, ప్రజలు తరలివస్తారు. ఇక్కడ మండల కాల ప్రారంభం రోజు నుంచి 41 రోజుల పాటు నిత్యా న్నదానం కొనసాగుతుంది. అలాగే రాత్రి వేళల్లో అయ్యప్ప స్వాములు బస చేయడానికి ఆల యంలో వసతులు కల్పిస్తారు.

పంట కొయ్యలను కలియదున్నాలి

డీఏవో కె.అనురాధ


డీఏవో అనురాధ

వరంగల్ వ్యవసాయం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పంటలు చేతికొచ్చిన తర్వాత వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, కంది, వేరుశనగ కొయ్యలను కాల్చొద్దని, తద్వారా వాతావరణ కాలుష్యం పెరగడంతో పాటు భూసారం దెబ్బ తింటుందని వరంగల్ జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.అనురాధ సూచిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పంట కొయ్యలను ఆదే పొలాల్లో కలియ దున్నితే భూసారం పెరుగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు. అంతేగాకుండా కొయ్యలను సాగు భూముల్లో కాల్చడం వల్ల వచ్చే సమస్యలను అందులో సూచించారు.

కాల్చడం వల్ల ఇబ్బందులు

- పర్యావరణ కాలుష్యకారకాలైన సీవో, సీవో 2, ఎన్-2 ఓ, ఎస్-2ఓ విడుదలై పంట దిగుబడి తగ్గుతుంది.
- గాలి నాణ్యత తగ్గుతుంది. భూసారం క్షీణిస్తుంది. నత్రజని కార్బనస్థాయి తగ్గుతుంది. ఉపయోగకరమైన సూక్ష్మజీవులు, కీటకాలు చనిపోతాయి.
- భూమిలో నత్రజనితో పాటు భాస్వరం, పొటాషియం, సల్ఫర్ స్థాయిలు తగ్గిపోతాయి.
- వరి గడ్డిని కాల్చడం వల్ల వెలుబడే మీథేన్ వాయువుల ద్వారా ఓజోన్ పొర దెబ్బ తిని వాయుకాలుష్యం పెరుగుతుంది. తద్వారా మానవాళి మనుగడకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది.
- పంట అవశేషాలను కాల్చడం ద్వారా పశుగ్రాసం కొరత ఏర్పడి పశుపోషణ భారం అవుతుంది. ఫలితంగా పాల ఉత్పత్తుల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది.

పంట అవశేషాల ఉపయోగాలు

- పత్తి, మిర్చి, మొక్కజొన్న, కంది కొయ్యలను వంట చెరుకుగా వాడుకోవచ్చు.
- సేంద్రియ ఎరువులు తయారు చేసుకోవచ్చు. పుట్ట గొడుగుల సాగు కోసం ఉపయోగించవచ్చు.
- నేలలో కలియ దున్నడం వల్ల కార్బన స్థాయి పెరుగుతుంది.
- నేల మీద మల్చ్‌గా ఉపయోగించవచ్చు.

నేలలో కలియ దున్నితే..

పంట కొయ్యలను నేలలో కలియదున్నితే సేంద్రియ కార్బనం పెరుగుతుంది. తద్వారా సూక్ష్మజీవుల సాంద్రత పెరిగి నత్రజనితోపాటు ఇతర పోషకాల లభ్యత పెరుగుతుంది. నేలలో కలియ దున్నడానికి వరిలో అయితే మల్చర్, పత్తిలో అయితే శెడ్డర్ వాడుకోవాలి. దీని వల్ల పంట వ్యర్థాలు నేలలో కలిసిపోయి నేల సామర్థ్యం పెరుగుతుంది. కాగా, వ్యర్థ డీకంపోజర్ లేదా పూసా డీకంపోజర్, లేదా పీజేటీ ఎస్‌ఏయూ కన్సార్టియం ద్వారా వరి గడ్డిని త్వరగా కుళ్లబెట్టవచ్చు.

పొలాల్లో పంట వ్యర్థాలను కాల్చివేసిన దృశ్యం (ఫైల్)



దక్షిణ అమెరికా టు భారత్

- టమాటాలో టూటా అబ్సొల్యూటా పురుగు ఉధృతి
- సమగ్ర సస్య రక్షణ


టమాటా పంటను పరిశీలిస్తున్న ఎస్పార్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్లు

హసన్‌పర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం టమాట పంటలో ఆకుతొలుచు (టూటా అబ్సొల్యూటా) పురుగు ఉధృతి పెరిగింది. ఇది దక్షిణ అమెరికా ప్రాంతానికి చెందిన పురుగు. క్రమేనా భారతదేశానికి విస్తరించి 2014లో మహారాష్ట్రలోని పుణేలో మొదటిసారిగా, 2015లో కర్ణాటకలోని గుత్తి ప్రాంతాల్లో గుర్తించబడింది. ప్రస్తుతం భారతదేశం అంతా విస్తరించి, టమాట రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఈ పురుగు అన్ని లార్వా దశలు మొక్క అన్ని భాగాలైన కొమ్మలు, ఆకులు, పువ్వులు, పండ్లను తిని పంట ఉత్పత్తి, నాణ్యతను గణనీయంగా తగ్గిస్తాయి.

పురుగు దాడి వలన ఆకులు మాడిపోవడం, మొక్కల ఎదుగుదల తగ్గిపోవడం, కాయ, పండ్లపై చిన్న రంధ్రాలు ఏర్పడడం, ఈ రంధ్రాల ద్వారా ఇతర వ్యాధి కారక జీవులు పండ్లలో చొరబడి, పండ్లు కుళ్లిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సరైన పద్ధతులు పాటించకుండా సమయానికి నివారించకపోతే పూర్తి పంట నష్టపోయే అవకాశం ఉంది.

సమగ్ర సస్య రక్షణ చర్యలు

- పంట కోసిన తరువాత పొలాన్ని దున్ని కనీసం రెండు నెలల పాటు ఎండనివ్వాలి. దీని వల్ల పురుగు వివిధ దశలో నశిస్తాయి.
- పురుగు ఆశించిన మొక్కలను ఏరి నాశనం చేసుకోవాలి.
- సోలనేసి జాతి పంటలు వేసుకోకుండా ఇతర జాతి పంటలు వేసుకోవాలి.
- నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలి.
- ప్రధాన పొలానికి ఎకరానికి 200 కేజీల వేప పిండిని వేసుకోవాలి.
- నారును నాటుకునే సమయంలో ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ.ను ఒక లీటరు నీటికి కలిపి వేర్లను ముంచి నాటుకోవాలి.
- పురుగుల పర్యవేక్షణ కోసం 2 నుంచి 3 ట్యూటాలూర్ లింగాకర్షక బుట్టలను ఎకరానికి అమర్చుకోవాలి.
- వేప నూనె 5 మి.లీ.ను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.
- గుడ్డు పరాన్న జీవి అయిన ట్రైకోగ్రామ్మా ప్రిటియోసం, ట్రైకోగ్రామ్మా అఖియా ఎకరానికి 45వేలను వారానికి ఒకసారి వాడుకోవాలి.
- నారు నాటిన 45 రోజులకి క్లోరాన్‌ట్రానిలిప్రోల్ 18.5 ఎస్‌సీ 0.15 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.
- చివరిలో బ్రోఫ్లానిలైడ్ 0.15 మి.లీ.ను ఒక లీటరు నీటిలో కలిపి ఉపయోగించినా మంచి ఫలితాలు ఉంటాయి.

సరైన సమయంలో చర్యలు తీసుకుంటేనే అధిక దిగుబడులు

ఎస్పార్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్ లాల్‌సింగ్ రాథోడ్



టమాట పంటలో వచ్చే ఆకుతొలుచు (టూటా అబ్సొల్యూటా) పురుగు ఆడరెక్కల పురుగు సుమారుగా 300 గుడ్లను పెట్టి, 25 నుంచి 30 రోజులలో తన జీవిత చక్రాన్ని పూర్తి చేసుకుంటుంది. ఈ పురుగు దాదాపు మొక్క అన్ని భాగాలపై ఆశించి పంటకు తీవ్ర నష్టాన్ని కలిగించి దిగుబడి పంట నాణ్యతను తగ్గిస్తుంది. దీని ఉధృతిని తగ్గించేందుకు సరైన సమయంలో సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు పొందవచ్చు.

కలికితురాయి.. కళాక్షేత్రం!

- ఆకట్టుకునే రీతిలో ఆడిటోరియం, ఆర్ట్ గ్యాలరీ
- ఈనెల 19న సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- ఎన్నో ప్రత్యేకతలు.. మరెన్నో విశేషాలు
- ప్రాంగణంలో కాళోజీ విగ్రహం ఏర్పాటు


ఆవిష్కరణకు సిద్ధం చేసిన కాళోజీ విగ్రహం

హనుమకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 4.24 ఎకరాల స్థలం.. రూ.95కోట్ల వ్యయంతో నిర్మించిన కాళోజీ కళా క్షేత్రం అద్భుత కట్టడం ఓరుగల్లు కీర్తికిరీటంలో కలికితురాయిగా నిలవనున్నది. ఆధునిక, ప్రాశ్చాత్య డిజైన్ల మేళవింపుతో రూపుదిద్దుకున్న ఈ కళా క్షేత్రం తెలంగాణ రాష్ట్రంలోని అద్భుత కట్టడాల్లో ఒకటిగా నిలవనున్నది. వరంగల్ సాహిత్య, సాంస్కృతిక, నాటక, కళారంగాలకు వేదికగా నిలవనున్నది. ఈ కళాక్షేత్రం కాళోజీ ఆశలు, ఆకాంక్షలు, ఆయన దిక్కార స్వరానికి ప్రతీకగా నిలవనున్నది. నాలుగు అంతస్తుల భవనంలో 1.77 చదరపు అడుగుల భవనం వైశాల్యంలో నిర్మాణం సాగింది. ప్రధాన ఆకర్షణగా ఆడిటోరియం నిలవనుంది. 1,127మంది కూర్చునే సామర్థ్యం ఉంది. ఆధునిక హంగులతో సాహిత్య, సాంస్కృతిక, నాటక కళా ప్రదర్శనలు నిర్వహించేందుకు వీలుగా ఆడిటోరియంతో కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం సాగింది. ప్రీ ఫంక్షన్ లాబీని, చిన్న తరహా సాంస్కృతిక కార్యక్రమాలనూ నిర్వహించేందుకు వీలుగా మినీ హాల్స్ కూడా నిర్మించారు.

పూర్తి ఎయిర్ కండీషన్ కలిగిన ఈ భవనంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో కాళోజీ జీవిత చరిత్రను, ఆయన రచనలను, ఛాయాచిత్రాలను మనముందుంచే ఆర్ట్‌గ్యాలరీని కూడా ఏర్పాటు చేశారు. కాళోజీ అధ్యయన కేంద్రాన్ని కూడా ఇందులో ఏర్పాటు చేయబోతున్నారు. కాళోజీ ఫౌండేషన్ వారి కోసం ప్రత్యేకంగా రెండు గదులను కూడా ఇందులో కేటాయిస్తున్నారు. కళాక్షేత్రం ప్రాంగణంలో కాళోజీ నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. క్షేత్రం ముందు పచ్చని పచ్చిక బయలును అభివృద్ధి చేశారు. ఫౌంటేన్లు, ఇతర కళాకృతులతో అందంగా తీర్చిదిద్దారు.

ప్రారంభోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

ఈనెల 19వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కళాక్షేత్రానికి ప్రారంభోత్సవం చేస్తారు. కాళోజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ఆర్ట్ గ్యాలరీని ప్రారంభిస్తారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది.

ప్రారంభోత్సవం సందర్భంగా కాళోజీ జీవితంపై అలాగే కళా క్షేత్రం విశిష్టతలను తెలిపే ఒక షార్ట్ ఫిల్మ్‌ను కూడా ప్రదర్శిస్తారు. సీఎం ఆర్ట్ గ్యాలరీని, ఇతర విభాగాలను సందర్శిస్తారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ, సాంస్కృతిక వ్యవహారాల మంత్రి జూపల్లి క్రిష్ణారావు, ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు, మేయర్ తదితరులు హాజరవుతారు.


కళాక్షేత్రంలో కాళోజీ ధరించిన దుస్తులు, చెప్పులు, ఉపయోగించిన చేతికర్ర, టేబుల్, కుర్చీ

పదేళ్ల కిందట అంకురార్పణ

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావమైన కొత్తలో అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణ రావు స్మారకార్థం ఒక అద్భుత స్మారక మందిరాన్ని నిర్మించాలని సంకల్పించారు. కాళోజీ కళాక్షేత్రం పేరుతో హనుమకొండ బాలసముద్రం రోడ్డులో హయగ్రీవచారి కాంపౌండ్ స్థలంలో 4.20 ఎకరాల్లో ఈ భవ్యమైన భవన నిర్మాణానికి ఎంతో అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. అప్పట్లోనే ఈ ప్రాజెక్టు పూర్తికి బడ్జెట్‌లో రూ.52కోట్లు ప్రతిపాదించారు. రూ.10కోట్ల చొప్పున విడతల వారీగా నిధుల విడులకు జీవో కూడా జారీ అయింది. మొదట్లో దీని నిర్మాణ బాధ్యతలను ఒక కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు. ఆ సంస్థ మధ్యలోనే విరమించుకోవడంతో దీనిని పూర్తిచేసే బాధ్యతను రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చేపట్టింది. నిధులు లేక పనులు నత్తనడకన సాగాయి.

మధ్యలో కరోనా కాలంలో పనులు రెండేళ్లపాటు పూర్తిగా నిలిచిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా కళాక్షేత్రం పనులు పూర్తికాలేదు. పర్యాటక సంస్థ కూడా నిధుల లేమితో చేతులెత్తేసింది.

దీనిని పూర్తి చేసే బాధ్యత చివరకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ భుజాన పడింది. ఆ సంస్థ తన అంతర్గత వనరులతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వచ్చిన నిధులతో ఎట్టకేలకు రూ.95 కోట్లతో కళాక్షేత్రం పూర్తయింది. రూ.50 కోట్లతో పూర్తి కావలసిన భవనం పనుల్లో జాప్యం వల్ల అంచనా వ్యయం రూ.95 కోట్లకు చేరింది.


కాళోజీ నారాయణ రావు జీవిత విశేషాలను తెలియజేసే ఛాయా చిత్రాలు ఉన్న గ్యాలరీ

రైతుల అభ్యున్నతికి సహకార సంఘాలు

- సుస్థిరమైన జీవనోపాధికి సోపానాలు
- ఉమ్మడి జిల్లాలో 91 సంఘాలు
- సహకార వారోత్సవాలు ప్రారంభం

హనుమకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో గురువారం నుంచి 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 20 వరకు ఈ ఉత్సతవాలు కొనసాగుతాయి. సహకార వారోత్సవాలను విజయవంతం చేసేందుకు కార్యాచరణను రూపొందించారు. అధికారులు సహకార సంఘాల బాధ్యులకు దిశానిర్దేశం చేశారు. సహకార వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ వారం రోజులు రోజుకొక కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తారు. ఏ రోజు ఏ కార్యక్రమాన్ని నిర్వహించాలనే విషయంలో షెడ్యూల్‌ను రూపొందించారు. ఈ కార్యక్రమాల వివరాలను అన్ని సహకార సంఘాలకు పంపించారు. గురువారం అన్ని సహకార సంఘాల కార్యాలయాల ఎదుట సహకార పతాకాలను ఎగురవేశారు. అనంతరం సహకార సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహించారు. సహకార సంఘాల బలోపేతానికి సభ్యులు కృషి చేయాలని ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న వక్తలు పిలుపునిచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తొలిరోజు సహకార వారోత్సవాల్లో పాల్గొన్నారు. సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కాజీపేట దర్గాలో...

కాజీపేట దర్గా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సహకార ఉద్యమాన్ని బలపరచడం- సహకార మంత్రిత్వ శాఖ చొరవ అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఊకంటి వనంరెడ్డి ముందుగా సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. నోడల్ అధికారి యమున, సంఘం పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. సహకార సంఘం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

రైతుల సేవలో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 91 పీఏసీఎస్ ఉన్నాయి. వీటి పరిధిలో లక్షా 20 వేల మంది సభ్యులు ఉన్నారు. పీఏసీఎస్‌లు పల్లెల్లోని రైతులకు పట్టుగొమ్మలాంటివి. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సంఘాలు రైతులకు ఉత్తమ సేవలందిస్తున్నాయి. రైతులకు తక్కువ వడ్డీకి రుణాలందిస్తున్నాయి. ధాన్యం కొనుగోలుతో పాటు పెట్రోల్ బంకుల నిర్వహణను చేపడుతున్నాయి. విదేశాల్లో చదివే రైతుల పిల్లలకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నాయి. తక్కువ వడ్డీకే బంగారు రుణాలను అందిస్తూ రైతులను ఆదుకుంటున్నాయి.

పునర్విభజన ఎప్పుడో ?

సహకార సంఘాలను పునర్విభజించాలన్న డిమాండ్ చాలా కాలంగా వినిపిస్తోంది. మూడు దశాబ్దాల క్రితం పీఏసీఎస్‌లు ఏర్పడ్డాయి. వ్యవసాయంలో రైతులకు అన్ని రకాలుగా ఉపయోగపడే సహకార సంఘాల సేవలు అందుబాటులోకి రావాలంటే వాటిని విభజించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం కొత్తగా 5వేల ఎకరాలకు ఒక క్లస్టర్ ఏర్పాటు చేసి ఏఈవోలను నియమించింది. అదే తరహాలో రైతులకు అందుబాటులో ఉండేలా సొసైటీలను విభజించాలని రైతులు కోరుతున్నారు. ఒక్కో సొసైటీలో వేలాది మంది రైతులు సభ్యులు ఉండగా ఏ అవసరం వచ్చినా క్యూ కట్టాల్సి వస్తోంది. మొదట్లో 250కిపైగా సొసైటీలు ఉండేవి. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంఘాలను బలోపేతానికి ఆర్థికంగా బలహీనంగా ఉన్న సంఘాలను బలంగా ఉన్న సంఘాల్లో విలీనం చేశారు. దీంతో సంఘాల స సంఖ్య 91కి తగ్గిపోయింది. అప్పటి నుంచి సహకార సంఘాల విస్తరణ జరగలేదు. ఈ మధ్య కాలంలో ఉమ్మడి జిల్లా పెరిగింది. రైతుల అవసరాలు పెరిగాయి. జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీల పునర్విభజన జరిగింది కానీ రైతుల అవసరాలకు తగ్గట్టు పీఏసీఎస్‌ల పునర్విభజన, కొత్త సంఘాల ఏర్పాటు జరగలేదు.


కాజీపేట దర్గా పీఏసీఎస్‌లో సహకార వారోత్సవాల్లో పాల్గొన్న అధికారులు, రైతులు

దూరాభారం..


రైతులు ప్రతి పంట సీజన్‌లో రుణాలు రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. కొందరు రైతులు కొత్త రుణాలు తీసుకుంటారు. వాటి కోసం దూరంగా ఉన్న సొసైటీలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో కొన్ని సొసైటీల పరిధిలో తక్కువ గ్రామాలుండగా మరి కొన్ని సొసైటీలకు ఎక్కువ గ్రామాలున్నాయి. గ్రామాలకు దూరంగా ఉన్న సొసైటీలకు వివిధ పనులకు రైతులు వెళ్లి రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. రుణాల కోసం, ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లాలో రాజకీయ చైతన్యం, పలుకుబడి గల మండలాలు చిన్నవైనా రెండు మూడు సొసైటీలు ఉన్నాయి.

సహకార వారోత్సవాలు

గురువారం కాజీపేట దర్గా పీఏసీఎస్‌లో తొలి రోజు సహకార వారోత్సవం నిర్వహించారు. ఈ నెల 15న ధర్మసాగర్ పీఏసీఎస్‌లో సహకార రంగంలో ఆవిష్కరణలు, సాంకేతిక, మంచి పరిపాలన అంశంపై, 16న కమలాపూర్‌లోని పీఏసీఎస్‌లో వ్యాపారవేత్తలు, ఉపాధి, నైపుణ్యాల అభివృద్ధిలో సహకార సంస్థల పాత్ర అంశంపై, 17న ఎల్కతుర్తిలోని పీఏసీఎస్‌లో సహకార వ్యాపారాల్లో మార్పు అంశం, 18న పెంచికలపేట పీఏసీఎస్‌లో సహకార సంస్థల మధ్య సహకారాన్ని బలపరచడం, 19న నందనం పీఏసీఎస్‌లో మహిళలు, యువత, బలహీన వర్గాల కోసం సహకార సంస్థలు, 20న వంగపహాడ్‌లోని పీఏసీఎస్‌లో సుస్థిర అభివృద్ధి సాధించడంలో సహకార సంస్థల పాత్ర, మెరుగైన ప్రపంచం కోసం ముందడుగు అనే ఇతివృత్తాలపై కార్యక్రమాలను నిర్వహిస్తారు.

మల్టీ సర్వీసు సెంటర్లుగా పీఏసీఎస్‌లు

మార్నేని రవీందర్‌రావు, టెస్కాబ్ చైర్మన్



సహకార సంఘాల ఆర్థిక బలోపేతానికి కొత్త పంథాలో చర్యలు చేపట్టాం. రాష్ట్రంలోనే తొలి సారిగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో సంఘాల బలోపేతం కోసం మల్టీ సర్వీసు సెంటర్లను ఏర్పాటు చేశారు. సంఘాలు కేవలం రుణాలకే పరిమితం కాకుండా స్వతహాగా ఆర్థిక ఉన్నతి సాధన కోసం మల్టీ సర్వీసు సెంటర్లు ఉపయోగపడు తున్నాయి. సంఘాలు మల్టీ సర్వీసు సెంటర్లుగా రూపుదిద్దుకోవడం ద్వారా పెట్రోల్ పంపులు, ఫంక్షన్ హాల్‌లు, ధాన్యం నిల్వల కోసం గోదాముల నిర్మాణం, షాపింగ్ మాల్స్ ఇలా 120 రకాలుగా సంఘాలు వ్యాపార కేంద్రాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో మారాయి. వివిధ వ్యాపారాలను సంఘాలు నిర్వహించడం ద్వారా సొంతంగా ఆర్థిక వనరులు సమకూర్చుకుంటున్నాయి.

ఎంఎస్‌సీల నిర్వహణతో ఉమ్మడి వరంగల్ జిల్లా మోడల్‌గా నిలిచింది. సంఘాల బలోపేతానికి అనేక రకాల్లో చర్యలు చేపట్టి ఫలితాలు సాధిస్తున్నాం. సహకార సంఘాలు కేవలం రైతుల రుణాలకే పరిమితం కాకుండా కమర్షియల్ బ్యాంకుల్లాగా సేవలు ఉన్నతీకరణను పొందాయి. అనేక రకాల రుణాలందిస్తున్నాయి. పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ, సంఘాలకు నాబార్డ్ ద్వారా ఏటీఎంలను అందుబాటులోకి తీసుకురావడం, సహకార విశ్వ విద్యాలయం ఏర్పాటు ప్రణాళికతో ఉన్నాం.

ఆంధ్రజ్యోతి

నవ్య

కుటుంబ కదంబం

సోమవారం •18 నవంబరు 2024



హాట్ హిట్స్

ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. భూల్ భులాయా (భూల్ భులాయా3)
3. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
4. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
5. జా రాంరఝున్ (దో పత్తీ)
6. ఆయీ నై (స్త్రీ-2)
7. సాజ్‌నీ రే (లా పతా లేడీస్)
8. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
9. అపనా బనాలే (భేడియా)
10. మిలియనీర్ (గ్లోరీ)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్ : చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

సెలబ్ టాక్

దేనికైనా రెడీ..!

బాలీవుడ్‌లోకి మరో వారసురాలు వచ్చింది.
ఆమె ఎవరో కాదు... హీరో వరుణ్ ధావన్ అన్న కూతురు...
'బిన్నీ అండ్ ఫ్యామిలీ' కథానాయిక... అంజినీ ధావన్.
వెండితెరపై వెలిగిపోవాలన్న ఆశయంతో... కొన్నేళ్లు పరిశ్రమలోనే పని చేసి... అనుభవం గడించింది.
తొలి చిత్రంతోనే మంచి హిట్ సొంతం చేసుకోవడమే కాదు... అగ్ర నటుల ప్రశంసలు కూడా అందుకుంది.



అంజినీ ఇంట్లో అందరూ సినీ పరిశ్రమతో అనుబంధం ఉన్నవారే. తాతయ్య అనిల్ ధావన్ వెటరన్ నటుడు. ఆయన కుమారుడు, అంజినీ తండ్రి సిద్ధార్థ్ ధావన్ బుల్లితెర నటుడు. హిట్ చిత్రాల దర్శకుడు డేవిడ్ ధావన్ పినతాత. డేవిడ్ తనయుడు, ప్రముఖ హీరో వరుణ్ ధావన్ ఆమెకు వరుసకు బాబాయి. చిన్నప్పటి నుంచీ సినీ వాతావరణంలోనే గడిపిన అంజినీకి సాధారణంగానే నటనపై మక్కువ పెరుగుతూ వచ్చింది. ముంబయిలో పుట్టి పెరిగిన ఆమె... డిగ్రీ తరువాత కెరీర్‌పై పూర్తి శ్రద్ధ పెట్టింది. అయితే కుటుంబ నేపథ్యం, ఇంట్లోవాళ్ల ప్రోత్సాహం ఉన్నా... తొలుత తనను తాను పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోవాలని అనుకుంది. ఆ తరువాతే తెర మీద కనిపించాలనే పట్టుదలతో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పరిశ్రమలో అడుగుపెట్టింది. వరుణ్ ధావన్ 'కూలీ నంబర్-1'కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసింది. అప్పుడప్పుడూ బామ్మ రష్మీ ధావన్ యాక్టింగ్ స్కూల్లోని విద్యార్థులతో కలిసి నటనలో మెళకువలు కూడా నేర్చుకుంది. ఇలా ఎక్కడ అవకాశం దొరికినా దాన్ని ఉపయోగించుకొంటూ... తనలోని నటికి మరిన్ని వన్నెలద్దింది. వీటన్నిటి ఫలితం తొలి చిత్రం 'బిన్నీ అండ్ ఫ్యామిలీ'లోనే కనిపించింది. సినిమా చూసినవారందరూ... ఆమెకు అది మొదటి సినిమా అనుకోలేదట. అంతలా అదరగొట్టింది నటనలో. ఇక ఎంతో సహజంగా నటించిందనేది విమర్శకుల మాట.

వేరొక ఆడిషన్‌లో చూసి...

'బిన్నీ అండ్ ఫ్యామిలీ'లో అవకాశం కూడా విచిత్రంగా వచ్చింది అంజినీకి. "వేరొక సినిమా కోసం ఏడాదిగా ఆడిషన్లు ఇస్తున్నా. అది సంజయ్ త్రిపాఠీ దృష్టిలో పడింది. తను తీయబోయే చిత్రంలో 'బిన్నీ' పాత్రకు నేనైతే సరిగ్గా సరిపోతానని ఆయన భావించారట. వెంటనే నన్ను ఆడిషన్స్‌కు పిలిచారు. నా నటన నచ్చింది. అలా 'బిన్నీ అండ్ ఫ్యామిలీ'లో అవకాశం రావడమే కాదు... నటిగా నా కెరీర్ కూడా ప్రారంభమైంది" అంటూ ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది అంజినీ.



'నా జీవితానికి దగ్గరైన పాత్ర'...

ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలను లండన్‌లో చిత్రీకరించాడు సంజయ్. నెల రోజులపాటు సాగిన ఆ షెడ్యూల్‌లో 'పంకజ్ కపూర్, హిమని శివ్‌పురి, రాజేష్‌కుమార్ లాంటి సీనియర్లతో కలిసి పని చేయడంవల్ల ఎంతో నేర్చుకొనే అవకాశం లభించింది. అంతా ఒక కుటుంబ సభ్యుల్లా కలిసిపోయారు. నెల రోజులూ ఎంతో సరదాగా గడిచిపోయాయి. అదీకాకుండా 'బిన్నీ' పాత్ర నిజ జీవితంలో నాకు చాలా దగ్గరగా ఉంటుంది. కొన్ని సన్నివేశాలు చేస్తున్నప్పుడు, ముఖ్యంగా బామ్మ పాత్రధారి నా చిరిగినట్టుండే ఫ్యాషన్ జీన్స్ చూసి ఇదేంటని ప్రశ్నించినప్పుడు మా నాన్న గుర్తుకువచ్చారు. ఆయన కూడా ఇంట్లో నా డ్రెస్‌లు చూసి జోకులు వేసేవారు' అంటూ తన అనుభవాలు పంచుకుంది అంజినీ. డేవిడ్, వరుణ్ ధావన్ ఎప్పుడూ ఆమెకు అండగా ఉంటారు. ముఖ్యంగా ఈ చిత్రం ప్రచార కార్యక్రమాల్లోనే కాకుండా, షూటింగ్ సమయంలో కూడా వరుణ్ అంజినీకి మద్దతుగా నిలిచాడు. తన ఇన్‌స్టా, ఎక్స్ ఖాతాల్లో ఆమె గురించి, ఆమె చిత్రం గురించిన విశేషాలను పంచుకున్నాడు. సినిమా విడుదల తరువాత కూడా అంజినీని ప్రత్యేకంగా అభినందించాడు.

నిరూపించుకొంటేనే...

"నా సినిమా విడుదలకు ముందు కొందరు 'బాలీవుడ్‌లో బంధుప్రీతికి మరో నిదర్శనం' అంటూ కించపరిచేలా నాపై వ్యాఖ్యలు చేశారు. పరిశ్రమలో పరిచయాలవల్ల కష్టపడకుండానే మొదట్లో ఒకటి రెండు అవకాశాలు వస్తాయేమో! కానీ మనలో సామర్థ్యం లేకపోతే ఇక్కడే కాదు, ఏ రంగంలోనూ నిలదొక్కుకోలేము. మనల్ని మనం నిరూపించుకొంటేనే మనుగడ. నటిగా తెరమీద కనిపించడానికి ముందు సినీ నిర్మాణంలో ప్రతి క్రాఫ్ట్ గురించీ తెలుసుకోవాలని అనుకున్నాను. అందుకే తొలుత బాబాయి సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. షూటింగ్ స్పాట్‌కు ఉదయాన్నే వెళ్లిపోయేదాన్ని. కెమెరా, లైటింగ్, లోకేషన్లు... ఇలా అన్నిటి మీద ఒక అవగాహన వచ్చాకనే నటన గురించి ఆలోచించాను" అంటుంది అంజినీ.

మంచి స్నేహితులు...

'కూలీ నంబర్-1' షూటింగ్‌లో వరుణ్, ఆ చిత్ర కథానాయిక సారా అలీఖాన్‌తో ఎంతో సరదాగా గడిచిపోయేదని, తారలపై వచ్చే గాసిప్స్ మీద మాట్లాడుకొని నవ్వుకొనేవారమని చెప్పింది ఇరవై నాలుగేళ్ల అంజినీ. 'వరుణ్‌ను ఎప్పుడూ బాబాయిగా చూడలేదు. అన్నయ్యలాగా భావిస్తాను. తను నన్ను ఎంతో గారాబంగా చూసుకొంటాడు' అంటున్న అంజినీకి సంజయ్ కపూర్ కుమార్తె, నటి షనయ కపూర్, బోనీ- శ్రీదేవిల చిన్న కూతురు ఖుషీ కపూర్ మంచి మిత్రులు. 'నా సినిమా ప్రివ్యూ నుంచి బయటకు వచ్చేటప్పుడు వాళ్ల కళ్లు చమర్చాయి. నా నటన బాగుందని అభినందించారు' అంటూ తన ఆనందాన్ని పంచుకుంది అంజినీ.

అన్నీ చెయ్యాలి...

మొదటి చిత్రంతోనే మంచి నటిగా ప్రశంసలు అందుకున్న అంజినీ... భవిష్యత్తులో అన్ని రకాల పాత్రలూ చేయాలని అనుకొంటోంది. 'యాక్షన్, కామెడీ, ప్రేమ కథలు, స్పై థ్రిల్లర్లు అనే తేడా లేకుండా ప్రతి పాత్రా పోషించాలి. విలక్షణ నటిగా ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలి'... అని కోరుకొంటున్న అంజినీ ఏ పాత్రకైనా రెడీ అంటోంది. ఆమెకు ఇన్‌స్టాలో ఫాలోవర్స్ కూడా తక్కువేంలేరు. ఫ్యాషన్ ఐకాన్‌గా తెరంగేట్రానికి ముందే లక్షలమంది అభిమానులను సంపాదించుకున్న ఆమె... తరచూ వెరైటీ డ్రెస్సుల్లో ఫొటోలు అప్‌లోడ్ చేస్తుంటుంది. వాటికి లైక్‌లూ లక్షల్లోనే. ఫిట్‌గా ఉండటానికి యోగా, జిమ్నాస్టిక్స్‌ను తన దినచర్యల్లో భాగంగా చేసుకుంది.

నవ్య | చిత్రజ్యోతి

ఆ స్వేచ్ఛ మాకూ ఉంది


- విష్వక్‌సేన్

'ఒక సినిమా బాగోగుల గురించి విమర్శకులు, సమీక్షకులు ఎంతటి విశ్లేషణ అయినా చేయవచ్చు కానీ ఆ వంకతో వ్యక్తిత్వ హననానికి పాల్పడేలా ఉండకూడదు. మీలాగా మాకూ భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుందని గుర్తుంచుకోవాలి' అని హీరో విష్వక్‌సేన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'మెకానిక్ రాకీ'. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికలు. రామ్ తాళ్లూరి నిర్మాత. ఈ నెల 22న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం వరంగల్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. విష్వక్‌సేన్ మాట్లాడుతూ "మెకానిక్ రాకీతో మా నిర్మాత రామ్ గర్వపడేలా చేస్తా. పది సినిమాల అనుభవంతో చెబుతున్నా మంచి సినిమా తీశాం. ఐదు నిమిషాలు కూడా బోర్‌కొట్టదు. మా సినిమాను ఆదరించండి' అని ప్రేక్షకులను కోరారు. రామ్ తాళ్లూరి మాట్లాడుతూ 'విష్వక్‌సేన్ కష్టపడి, ఇష్టపడి చేసిన సినిమా ఇది. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలున్నాయి. మీ అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. యువతను, మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో తెరకెక్కిన చిత్రమిదని మీనాక్షి చౌదరి తెలిపారు. సందేశం, వినోదం కలబోతగా రూపొందిన చిత్రమిదని శ్రద్ధా శ్రీనాథ్ చెప్పారు.



కొత్తగా...

రిమాండ్‌కు కస్తూరి



తమిళ నాడులో నివసిస్తున్న తెలుగు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో నటి కస్తూరికి ఎగ్మోర్ మెట్రోపాలిటన్ కోర్టు 12 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆమెను పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. 'అధికార దుర్వినియోగాన్ని ముగింపు పలికి న్యాయాన్ని గెలిపించాల'ని కోర్టు వెలుపల కస్తూరి మీడియాతో అన్నారు. మధురై కోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించడంతో హైదరాబాద్‌లో తలదాచుకున్న కస్తూరిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకొని తమిళనాడుకు తరలించిన విషయం తెలిసిందే.



పట్నాలో పుష్ప రూల్

'నేను మొదటిసారి బిహార్‌కు వచ్చాను. నా హిందీ అంత బావుండదు. తప్పులు మాట్లాడితే క్షమించండి. ఎవరికీ తలవంచని పుష్ప నేడు మీ ముందు తలవంచుతున్నాడు. మీ అభిమానమే 'పుష్ప 2: ది రూల్' లాంటి మంచి చిత్రాన్ని తీయడానికి మాకు ప్రేరణ' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పుష్ప 2'. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని బిహార్ రాజధాని పట్నాలో భారీ జనసందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ "పుష్ప' చిత్రాన్ని పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఆ సినిమా సూపర్‌హిట్ అయ్యిందంటే ఆ గొప్పదనం నాది కాదు, ప్రేక్షకులదే. మీ ప్రేమే 'పుష్ప 2: ది రూల్' చిత్రాన్ని ఇంత గొప్పగా తీయడానికి కారణమైంది. డిసెంబర్ 5న మీ ముందుకు రాబోతోంది. తప్పకుండా మీ అందరినీ అలరిస్తుంది. మీ సమక్షంలో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను' అని చెప్పారు. రష్మిక మందన్న మాట్లాడుతూ 'ఇంతమంది అభిమానులు 'పుష్ప' ప్రపంచంలోకి వచ్చినందుకు నాకు సంతోషంగా ఉంది. రెండు సంవత్సరాలుగా అభిమానులు ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నారు. మీ అందరి అంచనాలకు మించి సినిమా ఉండబోతోంది' అని తెలిపారు. 'పట్నా ప్రజల నుంచి ఈ స్థాయి ఆదరణను ఊహించలేదు. ఈ గొప్పదనం అల్లు అర్జున్, సుకుమార్‌కు దక్కుతుంది' అని నిర్మాత యలమంచిలి రవి, నవీన్ యెర్నేని తెలిపారు. 'పుష్ప 2' చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం భారీ ఎన్నికల ప్రచార సభను తలపించింది. దేశవ్యాప్తంగా ఉన్న అల్లు అర్జున్ అభిమానులు తరలివచ్చారు. గాంధీ మైదానం జనాలతో కిటకిటలాడిపోయింది. ఈ కార్యక్రమానికి సుమారు రెండు లక్షలమంది హాజరయ్యారని అంచనా. "పుష్ప అంటే ఫైర్ కాదు వైల్డ్ ఫైర్' అంటూ ఆయన చెప్పిన డైలాగ్‌లకు అభిమానుల కేరింతలతో సభాప్రాంగణం మార్మోగింది. బిహార్ డిప్యూటీ సీఎం విజయ్ సేన సాహెబ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పశుపాలకుడిగా ప్రణవ్



వెండితెరపైన సాదా సీదా పాత్రలను అద్భుతంగా పోషించే తారలు నిజ జీవితంలో అలా జీవించగలరా? అంటే 'కష్టమే' అని చెప్పాలి. కానీ మలయాళ మెగా స్టార్ మోహన్‌లాల్ కొడుకు ప్రణవ్ మాత్రం స్టార్‌డమ్‌ను పక్కన పెట్టి దేశం కాని దేశంలో అనామకంగా జీవిస్తున్నాడు. ప్రస్తుతం స్పెయిన్‌లో 'వర్క్ అవే' అనే కార్యక్రమంలో భాగంగా ఆయన ఓ పొలంలో కష్టపడి పనిచేస్తున్నారు. పశుపాలకుడిగా గొర్రెలు, మేకలు, గుర్రాలను కాస్తున్నారు ప్రణవ్. నటుడిగా పోషించాల్సిన విభిన్న పాత్రల్ని తన కొడుకు నిజజీవితంలో పోషిస్తున్నారని ప్రణవ్ తల్లి సుచిత్ర ఓ ఇంటర్వ్యూలో చెప్పడంతో ఈ విషయం అందరికీ తెలిసింది. ఒక సూపర్‌స్టార్‌కి కొడుకు, ఆగర్భ శ్రీమంతుడు అయినా విలాసవంతమైన జీవన శైలిని వదిలి ఇలా సాదాసీదాగా గడుపుతున్న ప్రణవ్‌ను నెటిజన్లు అభినందిస్తున్నారు. 2002లో 'ఒన్నమన్' అనే సినిమాతో బాలనటుడిగా అరంగేట్రం చేసిన ప్రణవ్.. 'పునర్జనీ' చిత్రంతో ఉత్తమ బాలనటుడిగా కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డు అందుకున్నారు. 2018లో జీతూ జోసెఫ్ దర్శకత్వంలో 'ఆది' అనే చిత్రంతో హీరోగా పరిచయమయ్యారు. ఈ సినిమా ఆ ఏడాది అత్యధిక వసూళ్లు అందుకున్న చిత్రంగా నిలవడమే కాకుండా ప్రణవ్‌కు ఉత్తమ నటుడిగా సైమా అవార్డునూ తెచ్చిపెట్టింది. ప్రణవ్ కేవలం నటుడిగానే కాకుండా ప్లేబ్యాక్ సింగర్‌గా, పాటల రచయితగానూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు.

గాయకుడు అనురాగ్ కులకర్ణి, గాయని రమ్య బెహర వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ వేడుకకి సంబంధించిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరలవుతున్నాయి. కొద్దిమంది కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్.కీరవాణి చిన్న కుమారుడు శ్రీ సింహా, సీనియర్ నటుడు మురళీ మోహన్ మనవరాలు రాగ వివాహం త్వరలోనే జరగనుంది. ఆదివారం గోల్కొండ రిసార్ట్స్‌లో ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ వేడుకలో ఆంధ్రజ్యోతి గ్రూప్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, ఆంధ్రప్రదేశ్ స్పీకర్ రఘురామకృష్ణరాజు సహా పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

రూ. పదికోట్ల వీడియో ఫ్రీగా చూడండి





నటి నయనతార బయోపిక్‌గా నెట్‌ఫ్లిక్స్ తెరకెక్కించిన డాక్యుమెంటరీ 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్'. దీనికోసం 'నానుమ్ రౌడీ దాన్' సినిమా సమయంలో షూట్ చేసిన మూడు సెకన్ల క్లిప్‌ను వాడుకున్నందుకు రూ.పది కోట్లు ఇవ్వాలని నటుడు, నిర్మాత ధనుష్ కోరారని.. ఇందుకు ఆయనని విమర్శిస్తూ నయనతార ఓ బహిరంగ లేఖ రాసిన సంగతి తెలిసిందే. అయితే నయనతారను సపోర్ట్ చేస్తూ ఆదివారం ఆమె భర్త విఘ్నేష్ శివన్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రెండు పోస్టులు పెట్టారు. అందులో ఒక దాంట్లో.."కేవలం మూడు సెకన్లకు ధనుశ్ రూ.పది కోట్లు డిమాండ్ చేసిన వీడియో ఇదే. మీరంతా ఫ్రీగా చూసేయ్యండి" అని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు. అంతటితో ఆగకుండా... మరో పోస్ట్‌లో.. 2017లో 'సక్క పోడు పోడు రాజా' సినిమా ఆడియో ఫంక్షన్‌లో ధనుశ్ మాట్లాడిన వీడియోను కూడా షేర్ చేశారు. అందులో ప్రేమను పంచడం గురించి.. నటీనటులు పనిచేసే చోట ఉండాల్సిన వాతావరణం గురించి ధనుశ్ మాట్లాడారు. ఆ వీడియోకి కౌంటర్‌గా "జీవించండి.. ఇతరులని స్వేచ్ఛగా జీవించనివ్వండి. ప్రేమను పంచండి.. ఓం నమః శివాయ. మీరు చెప్పినవి ముందు మీరు పాటించండి. కనీసం మీ అభిమానుల కోసమైనా" అని పేర్కొన్నారు. అయితే ఈ పోస్టులను కొద్దిసేపటికే విఘ్నేష్ శివన్ తొలగించడం గమనార్హం. మరోవైపు గాయని సుచిత్ర, ధనుశ్ ఎంతో మంది హీరోయిన్లను వేధించారని ఆరోపించారు.

బిజినెస్

నేటి నుంచి బ్యాంక్ ఆఫ్ ఇండియా సంఝౌతా ఔట్‌రీచ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మొండి బకాయిల (ఎన్‌పీఏ) పరిష్కారం లక్ష్యంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) సోమవారం నుంచి శుక్రవారం వరకు సంఝౌతా ఔట్‌రీచ్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఎన్‌పీఏ ఖాతాలున్న వారికి ఈ ఐదు రోజుల్లో బకాయిల చెల్లింపునకు ఆకర్షణీయమైన తగ్గింపులతో ఏకకాల సెటిల్మెంట్ (ఓటీఎస్) అవకాశం కల్పిస్తారు. ఏదైనా న్యాయబద్ధమైన కారణంతో రుణ బకాయిలు సకాలంలో చెల్లించలేకపోయిన కస్టమర్లు సంబంధిత బ్యాంకు శాఖను సందర్శించి ఏకకాల పరిష్కారం పొంది రుణవిముక్తులు కావాలని బ్యాంకు పిలుపు ఇచ్చింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	545	విజయవాడ	575
వరంగల్	547	గోదావరి	565
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	109
వరంగల్	90	గుంటూరు	103
కరీంనగర్	90	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	99
కర్నూలు	90	నెల్లూరు	99
విశాఖపట్నం	103	అనంతపురం	99
గోదావరి	109		

కారు మరింత స్మార్ట్ గురూ

ఇక రూ.20 లక్షల కారుకూ 5జీ ఎం2ఎం టెక్నాలజీ



న్యూఢిల్లీ: దేశంలో ఆటోమొబైల్ రంగం ముఖచిత్రం 2025లో పూర్తిగా మారిపోతోంది. 5జీ ఎం2ఎం కనెక్టివిటీ (ఇంటర్నెట్ సహాయంతో డివైస్‌ల మధ్య పరస్పరం డేటా మార్పిడి చేసుకునే టెక్నాలజీ), అడ్వాన్స్‌డ్ ఏఐ టెక్నాలజీలతో కూడిన కార్ల రాకతో మరింత అధునాతనమైన "స్మార్ట్ శకం"లోకి భారత్ అడుగు పెట్టబోతోంది. టెక్‌ఆర్క్ ఇండియా కనెక్టెడ్ కన్స్యూమర్ నివేదిక ఈ తాజా వాస్తవాలను వెలుగులోకి తెచ్చింది. మన దేశంలో ఆటోమోటివ్ రంగం 4జీని తోసి రాజని 5జీ సెల్యులార్ టెక్నాలజీని వినియోగించేందుకే మొగ్గు చూపుతోంది. వినియోగదారులు కూడా లెక్కకు మించి డివైస్‌ల వినియోగాన్ని పక్కన పెట్టి చక్కని ఫీచర్లతో సరికొత్త అనుభవాన్ని అందించడం ద్వారా తమ సొమ్ముకు విలువ సమకూర్చే టెక్నాలజీలపై ఎంతైనా ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని ఆ సర్వేలో తేలింది. తాము డివైస్‌ల సంపూర్ణ సామర్థ్యాన్ని తాము వినియోగించుకోవాలనుకుంటున్నట్టు 22 శాతం మంది చెప్పారు. అందులోనూ 55 శాతం మంది స్మార్ట్/కనెక్టెడ్ కార్లపై అధిక మక్కువ ప్రదర్శించారు. సర్వేలో భాగంగా మొత్తం 4500 కనెక్టెడ్ వినియోగదారులను ప్రశ్నించారు. స్మార్ట్‌ఫోన్ ఒక్కటే కాకుండా మరో 3 డివైస్‌లున్న వారిని "కనెక్టెడ్ వినియోగదారులు"గా నిర్వచించారు.

సగటు జీవి కారుకూ ఆధునిక ఫీచర్లు

2025 నుంచి అధిక శాతం కార్లు 5జీ ఎం2ఎం కనెక్టివిటీ, ఆన్ డివైస్ జెనరేటివ్ ఏఐ, క్లౌడ్ కనెక్టివిటీతో రానున్నాయి. దీంతో విభిన్న ధరల శ్రేణుల్లోని కార్లకు ఈ ఫీచర్లు అందుబాటులో ఉంటాయి. డ్రైవర్లకు మద్దతుగా రియల్ టైమ్ డేటా ప్రాసెసింగ్‌కు వీలుగా వాహనాల్లో ఇన్ వెహికల్ కంప్యూటింగ్, జెనరేటివ్ ఏఐ, క్లౌడ్ అప్లికేషన్లు తప్పనిసరి అవసరాలు కానున్నాయి. ఇప్పటివరకు విలాసవంతమైన కార్లకే అందుబాటులో ఉన్న ఈ ఫీచర్లన్నీ రూ.20 లక్షలు, ఆ పైబడిన ధరల శ్రేణిలోని కార్లన్నింటికీ సర్వసాధారణం కాబోతున్నాయి. ఆటోమోటివ్ చిప్‌సెట్ కంపెనీల ఆదాయాలు ఇప్పటికే 150 కోట్ల డాలర్లు దాటాయి. క్వాల్‌కామ్, మీడియా టెక్ ఇందులో అగ్రగాములుగా ఉన్నాయి. రాబోయే కాలంలో ఆటోమొబైల్ రంగం భవిష్యత్తును కనెక్టివిటీ, టెక్నాలజీలే నిర్దేశించనున్నాయని టెక్‌ఆర్క్ ఆటోటెక్ అనలిస్ట్ సాదత్ అహంగర్ అన్నారు.

5జీ ఎం2ఎంలోనూ మనదే పైచేయి

ప్రస్తుతం దేశంలో 22 ఆటోమొబైల్ తయారీ కంపెనీలు ఏటా 50 లక్షల కార్లు ఉత్పత్తి చేస్తున్నాయి. రాబోయే కొద్ది సంవత్సరాల్లో ప్రపంచ 5జీ ఎం2ఎం మార్కెట్లో మనదే అగ్రస్థానం కాబోతున్నదని టెక్‌ఆర్క్ నివేదిక తెలిపింది. ప్రస్తుతం కనెక్టెడ్ కార్ల విభాగంలో ఎంజీ మోటార్స్‌దే అగ్రస్థానమని 21 శాతం మంది అన్నారు. కియా మోటార్స్ (18 శాతం), టాటా మోటార్స్ (15 శాతం) తర్వాతి స్థానాల్లో ఉండగా హ్యుండాయ్, మారుతి టాప్ 5 బ్రాండ్లలో స్థానం దక్కించుకున్నాయి.

ఎలక్ట్రానిక్స్‌పై పట్టు పెంచుకుంటున్న టాటా

పెగాట్రాన్ ప్లాంట్‌లో 60 శాతం వాటా!



న్యూఢిల్లీ: ఐ ఫోన్ల అసెంబ్లింగ్‌పై టాటా గ్రూప్ పట్టు బిగిస్తోంది. ఇందులో భాగంగా తాజాగా పెగాట్రాన్ చెన్నై ప్లాంట్ ఈక్విటీలో 60 శాతం వాటా టాటా ఎలక్ట్రానిక్స్ కొనుగోలు చేసింది. అయితే రెండు కంపెనీలు ఈ విషయాన్ని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. పెగాట్రాన్ ఈ ప్లాంట్‌లో యాపిల్ కంపెనీ కోసం ఐఫోన్లు అసెంబ్లింగ్ చేస్తుంటుంది. గత ఏడాది కర్ణాటకలోని విస్ట్రాన్ కంపెనీని తైవాన్ కంపెనీ నుంచి రూ.1,000 కోట్లకు టాటా ఎలక్ట్రానిక్స్ ఇందుకోసమే కొనుగోలు చేసింది. వీటికి తోడు యాపిల్ కంపెనీకి చెందిన వివిధ ఉపకరణాల అసెంబ్లింగ్ కోసం తమిళనాడులోని హోసూరు వద్ద ప్రత్యేక ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. పెగాట్రాన్ చెన్నై ప్లాంట్‌తో కలిపితే ఐఫోన్ల అసెంబ్లింగ్ కోసం టాటా గ్రూప్ మూడు ప్లాంట్లు కలిగి ఉండబోతోంది.

విదేశీ ఆస్తులు వెల్లడించకపోతే రూ.10 లక్షల జరిమానా



న్యూఢిల్లీ: పన్ను ఎగవేతదారులపై ఆదాయ పన్ను శాఖ ఉచ్చు బిగిస్తోంది. ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేసే వ్యక్తులు ఇక తప్పనిసరిగా విదేశాల్లో తాము సంపాదించిన స్థిర, చరాస్తులు, బ్యాంకు ఖాతాలు, ఆదాయాల వివరాలను తమ రిటర్న్‌ల్లో వెల్లడించాలి. లేకపోతే నల్లధన నిరోధక చట్టం కింద వారిపై రూ.10 లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరించింది. 2024-25 అసెస్‌మెంట్ ఇయర్ (ఏవై) నుంచే ఈ నిబంధన అమల్లోకి వచ్చినట్టు తెలిపింది. రిటర్న్‌లు ఫైల్ చేసే వారి దేశీయ ఆదాయం పన్ను పరిధి కంటే తక్కువగా ఉన్నా సరే, వారు విదేశాల్లోని తమ స్థిర, చరాస్తులు, బ్యాంకు ఖాతాలు, వాటిల్లోని డిపాజిట్లు, విదేశాల నుంచి సంపాదించిన సంపాదన వివరాలు తప్పనిసరిగా వెల్లడించాలని స్పష్టం చేసింది. అంతర్జాతీయ ఒప్పందాలు, ద్వైపాక్షిక ఒప్పందాల ద్వారా ఇలాంటి ఘరానా పెద్దల వివరాలను ఐటీ శాఖ ఎప్పటికప్పుడు సేకరిస్తోంది. ఒకవేళ ఎవరైనా తమ 2024-25 అసెస్‌మెంట్ ఇయర్ రిటర్న్‌లో ఈ వివరాలు తెలపకపోతే, వచ్చే నెలాఖరులోగా సవరించిన రిటర్న్ ఫైల్ చేయాలని కోరింది.

23850 పైన బుల్లిష్

(నవంబరు 18-22 తేదీల మధ్య వారానికి)

ఆస్ట్రో


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ: 23533 (-615)

నిఫ్టీ గత వారం 24337-23484 పాయింట్ల మధ్యన కదలాడి 615 పాయింట్ల నష్టంతో 23533 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23850 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23740, 24042, 24129, 24482 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా దిగువకు రావడం దీర్ఘకాలిక బేరిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 23950 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23100

నిరోధ స్థాయిలు: 23750, 23850, 23950 (23650 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 23300, 23200, 23100 (234250 దిగువన బేరిష్)

ఈ వారమూ అనిశ్చితే...

ఈ వారంలో కూడా స్టాక్ మార్కెట్ ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం కనిపిస్తోంది. డొనాల్డ్ ట్రంప్ గెలుపుతో అమెరికా డాలర్ బలం పుంజుకుంటోంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ, బులియన్ మార్కెట్లు నేల చూపులు చూస్తున్నాయి. ఎఫ్‌పీఐల అమ్మకాలు, డాలర్‌తో రూపాయి బలహీనత ఇందుకు మరింత దోహదం చేస్తున్నాయి. చైనా ఉద్దీపన ప్యాకేజీతో పెద్దగా ప్రయోజనం లేదని తేలిపోయింది. దీంతో ఎఫ్‌పీఐలు మళ్లీ త్వరలోనే మన మార్కెట్‌కు తిరిగి వస్తాయనే అంచనాలు పెరుగుతున్నాయి. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత మార్కెట్ స్థిరపడే అవకాశం ఉంది.

ఈ వారం స్టాక్ రికమండేషన్లు...

ఇండియన్ హోటల్స్: డల్ మార్కెట్‌లోనూ ఈ షేర్లు చురుగ్గా ట్రేడవుతున్నాయి. తాజా త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగుండడంతో, ఈ కౌంటర్‌పై ఇన్వెస్టర్ల ఆసక్తి మరింత పెరిగింది. ప్రస్తుతం ఈ షేర్లలో డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్స్ కూడా పెరుగుతున్నాయి. గత వారం రూ.741 వద్ద ముగిశాయి. రూ.800/840 టార్గెట్‌తో రూ.720 వద్ద మదుపరులు ఈ కౌంటర్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు. రూ.700ను గట్టి స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

పాలసీ బజార్: జీవిత కాల గరిష్ఠ స్థాయి నుంచి ఈ కౌంటర్‌లో 18 శాతం దిద్దుబాటు జరిగింది. ప్రస్తుతం రూ.1,650-1,740 మధ్య కన్సాలిడేట్ అవుతోంది. మార్కెట్ దిద్దుబాటుకు లోనవుతున్నా, ఈ కౌంటర్‌లో మాత్రం పెద్దగా ఆటుపోట్లు లేవు. నిఫ్టీతో పోలిస్తే ఈ షేర్లు మెరుగ్గా ట్రేడవుతున్నాయి. గత వారం రూ.1,724 వద్ద ముగిశాయి. రూ.1,850 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,700 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. రూ.1,670ను కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

గ్లాండ్ ఫార్మా: ప్రస్తుతం ఈ కంపెనీ షేర్లు 200 సింపుల్ మువింగ్ యావరేజ్ (ఎస్‌ఎంఏ) కంటే దిగువన ట్రేడవుతున్నాయి. తాజా ఆర్థిక ఫలితాలు బాగుండంతో, ఈ కౌంటర్‌లో ఇటీవల ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్స్ గణనీయంగా పెరిగాయి. గత వారం రూ.1,774 వద్ద ముగిశాయి. రూ.1,850/1,920 టార్గెట్‌తో మదుపరులు రూ.1,750 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.1,710ను గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

నౌకరి: జీవిత కాల గరిష్ఠ స్థాయి తర్వాత ఈ కౌంటర్‌లో 10 శాతం వరకు దిద్దుబాటు జరిగింది. మార్కెట్ సెంటిమెంట్ బలహీనంగా ఉన్నా, ఈ కంపెనీ షేర్లు జోరుగా ట్రేడవుతున్నాయి. ప్రస్తుతం కన్సాలిడేషన్ దశలో ఉన్నాయి. గత వారం రూ.7,768 వద్ద ముగిశాయి. ఇన్వెస్టర్లు రూ.7,840/7,900 టార్గెట్‌తో రూ.7,700 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. రూ.7,670ను కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టాటా పవర్: ఈ కంపెనీ షేర్లు కూడా జీవితకాల గరిష్ఠ స్థాయి నుంచి 20 శాతం వరకు దిద్దుబాటుకు లోనయ్యాయి. ప్రస్తుతం రూ.400 వద్ద కీలక మద్దతు లభిస్తోంది. దీంతో ఈ షేర్లపై మదుపరుల ఆసక్తి పెరిగింది. రూ.470/510 టార్గెట్‌తో రూ.400 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.370ను గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ: మద్దతు స్థాయిలు 23500, 23350


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత సోమవారం 24000 వద్ద మైనర్ రికవరీతో ప్రారంభమైనా ఆ స్థాయిలో నిలదొక్కుకోలేక వారం మొత్తం డౌన్‌ట్రెండ్‌లోనే ట్రేడయి చివరికి వారం కనిష్ఠ స్థాయిల్లో క్లోజయింది. వారం మొత్తం మీద 615 పాయింట్ల నష్టంతో 23530 వద్ద ముగిసింది. టెక్నికల్‌గా గత ఆరు వారాల డౌన్‌ట్రెండ్ కొనసాగుతోంది. నిఫ్టీ గరిష్ఠ స్థాయి 26000 నుంచి సుమారు 2500 పాయింట్లు నష్టపోయింది. గత వారంలో మిడ్‌క్యాప్ సూచీ 2300 పాయింట్లు, స్మాల్ క్యాప్ సూచీ 850 పాయింట్ల భారీ నష్టంతో ముగిశాయి. గత శుక్రవారం అమెరికన్ మార్కెట్ల ధోరణిని బట్టి ఈ వారం మన మార్కెట్ అప్రమత్తంగానే ప్రారంభం కావచ్చు. గత ఆరు సెషన్లలో నిట్టనిలువుగా పతనమైన నిఫ్టీ ప్రస్తుతం కీలక స్థాయి 23500 వద్ద ఉంది.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ ప్రస్తుతం కీలక మానసిక మద్దతు స్థాయి 23500 సమీపంలో ఉంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం రాబోయే రెండు రోజుల్లో ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. ప్రధాన నిరోధం 23750. ఆ పైన 24000. మార్కెట్లో తీవ్ర ఆటుపోట్లు నెలకొన్నందు వల్ల ట్రెండ్‌లో స్పష్టత కోసం కనీసం కొద్ది రోజుల పాటు నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బేరిష్ స్థాయిలు: 23500 వద్ద విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 23350 (జూన్ 24న ఏర్పడిన కనిష్ఠ స్థాయి). ఇక్కడ కూడా విఫలమైతే మరింత బలహీనత ఏర్పడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 23000.

బ్యాంక్ నిఫ్టీ: గత వారంలో కూడా డౌన్‌ట్రెండ్‌లోనే ట్రేడయిన ఈ సూచీ వారం మొత్తం మీద 1400 పాయింట్లు నష్టపోయి ప్రధాన మానసిక అవధి 50000 సమీపంలో క్లోజయింది. సానుకూలత కోసం ఇక్కడ కన్సాలిడేట్ అయి తీరాలి. గత ఐదు నెలల కాలంలో ఇదే స్థాయిలో కొన్ని ప్రధాన బాటమ్‌లు ఏర్పడ్డాయి. అందుకే ఇది కీలక స్థాయిగా మారింది. రికవరీ బాట పడితే సానుకూలత కోసం ప్రధాన నిరోధం 50600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 51000. కీలక స్థాయి 50000 వద్ద విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 49400.

పాటర్న్: నిఫ్టీ ప్రస్తుతం 200 డీఎంఏ సమీపంలో ఉంది. సానుకూలత కోసం ఇక్కడ కన్సాలిడేట్ కావాలి. 23500 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే మరింత బలహీనత ప్రదర్శిస్తుంది. మార్కెట్ ప్రస్తుతం ఓవర్‌సోల్డ్ స్థితిలో ఉంది. కనిష్ఠ స్థాయిల్లో స్వల్పకాలిక ట్రేడర్లు అప్రమత్తంగా ఉండాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం సోమవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	23,610, 23,660
మద్దతు	23,460, 23,400

స్పోర్ట్స్

ఓపెనర్..రాహుల్!

జురెల్, నితీశ్‌కు చాన్స్
బుమ్రాకు పగ్గాలు

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ



పెర్త్: మరో నాలుగు రోజుల్లో ఆస్ట్రేలియాతో తొలి టెస్టు జరగాల్సి ఉండగా టీమిండియాను గాయాల బెడద వేధిస్తోంది. శుభ్‌మన్ గిల్ బొటన వేలికి ఫ్రాక్చర్ కావడంతో విశ్రాంతి అవసరం కాగా, కెప్టెన్ రోహిత్ కుటుంబ కారణాలరీత్యా అందుబాటులో ఉండడం లేదు. దీంతో 22 నుంచి జరిగే ఈ మ్యాచ్‌లో వైస్‌కెప్టెన్ బుమ్రా ఆధ్వర్యంలో టీమిండియా బరిలోకి దిగనుంది. డిసెంబరు 6 నుంచి జరిగే రెండో టెస్టులో రోహిత్ ఆడనున్నాడు. అయితే ఇంట్రా స్క్వాడ్ వామప్‌లో మోచేతి గాయానికి గురైన కేఎల్ రాహుల్ ఫిట్‌నెస్ సాధించడం భారత్‌కు సానుకూలాంశం. అతను పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ ఓవర్‌లో శుక్రవారం గాయపడ్డాడు. వెంటనే మైదానం వీడిన రాహుల్ తిరిగి బ్యాట్ పట్టలేదు. అయితే ఆదివారం మాత్రం ఎలాంటి ఇబ్బందీ లేకుండా బ్యాటింగ్ చేయడంతో టీమ్ మేనేజ్‌మెంట్ ఊపిరి పీల్చుకుంది. అలాగే మూడు గంటల పాటు జరిగిన నెట్స్‌లోనూ చురుగ్గా పాల్గొన్నాడు. దీంతో యశస్వీ జైస్వాల్‌కు జతగా రాహుల్‌ను ఓపెనర్‌గా దించాలన్న ఆలోచనలో ఉన్నారు. తాను కూడా తొలి టెస్టు ఆడేందుకు ఆత్రుతగా ఎదురుచూస్తున్నట్టు రాహుల్ తెలిపాడు. సోమవారం విశ్రాంతి దినం. మ్యాచ్ జరిగే ఓప్టస్ స్టేడియంలో జట్టు మంగళవారం ప్రాక్టీస్ సాగించనుంది.

ఆరో నెంబర్‌లో జురెల్!

ఆస్ట్రేలియా 'ఎ'తో జరిగిన రెండో అనధికార టెస్టులో విశేషంగా రాణించిన ధ్రువ్ జురెల్ పెర్త్ టెస్టులో ఆడనున్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే రిషభ్ పంత్ ప్రధాన కీపర్‌గా ఉండడంతో జురెల్‌ను స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఆరో నెంబర్‌లో బరిలోకి దించే అవకాశం ఉందని మీడియా కథనం. కెప్టెన్ రోహిత్, గిల్ లేకపోవడంతో జట్టు జురెల్ వైపు మొగ్గు చూపుతోంది. దీనికి తోడు ఇన్‌స్టాలో టీమిండియా జెర్సీ వేసుకుని జురెల్ ఫొటో పోస్ట్ చేయడం ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది.

మనోడి అరంగేట్రం ఖాయమా?

తెలుగు క్రికెటర్ నితీశ్ కుమార్ కూడా టెస్టు అరంగేట్రం చేసే అవకాశం కనిపిస్తోంది. కోచ్ గంభీర్ కూడా అతడిపై ఆసక్తి చూపుతున్నాడు. హార్దిక్ తరహాలో బ్యాటింగ్‌లోనే కాకుండా నాలుగో పేసర్‌గా జట్టుకు ఉపయోగపడగలడని భావిస్తున్నారు. నితీశ్ భారత్ తరఫున బంగ్లాదేశ్‌పై ఇప్పటికే టీ20ల్లో ఆడాడు. అలాగే ఇటీవల భారత్ 'ఎ' తరఫున ఆసీస్ 'ఎ'పై ఆడినా పెద్దగా రాణించలేదు. ఇక, రెండు అనధికార టెస్టుల్లో ఒక వికెట్ మాత్రమే తీశాడు. కానీ మొత్తంగా 23 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో నితీశ్ 56 వికెట్లు తీయడం విశేషం.

హర్షిత్, ప్రసిద్ధ్ మధ్య పోటీ

తొలి టెస్టులో మూడో పేసర్ బెర్త్ కోసం ప్రసిద్ధ్ కృష్ణకు హర్షిత్ రాణా గట్టి పోటీనే ఇస్తున్నాడు. నిలకడగా గంటకు 140 కి.మీ వేగంతో బంతులు విసిరే రాణా అదనపు బౌన్స్‌తో బ్యాటర్లను ఇబ్బంది పెట్టగలడు. పెర్త్ గ్రౌండ్‌లో భారత బ్యాటర్లకు కూడా తన పదునైన పేస్‌తో సవాల్ విసిరాడు. హర్షిత్ ఇటీవల భారత్ 'ఎ' జట్టు తరఫున రెండు అనధికార టెస్టుల్లోనూ ఆకట్టుకున్నాడు.

ఆసీస్‌లోనే దేవ్‌దత్

ముందు జాగ్రత్తగా టాపార్డర్ బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్‌ను ఆస్ట్రేలియాలోనే ఉంచనున్నారు. భారత్ 'ఎ' తరఫున ఆడిన అతడిని బ్యాటింగ్ బ్యాకప్‌గా భావిస్తున్నారు. నెట్స్‌లో బుమ్రా బౌలింగ్‌ను దేవ్‌దత్ మెరుగ్గా ఎదుర్కొన్నాడని, అలాగే పేసర్లు ముకేశ్, ఖలీల్, సైనీ కూడా టీమిండియాతోనే ఉంటారని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి.

షమి ఇప్పుడే వెళ్లడు!

బెంగాల్ తరఫున రంజీ ట్రోఫీలో పేసర్ మహ్మద్ షమి ఏడు వికెట్లతో రాణించాడు. దీంతో అతడిని ఆసీస్ టూర్‌కు పంపుతారని అంతా భావించారు. అయితే వెంటనే కాకుండా సిరీస్ ద్వితీయార్థంలో షమీ అక్కడికి వెళ్లే అవకాశం ఉందని సమాచారం. ఒక్క మ్యాచ్‌తో అంచనా వేయకుండా మరింత ప్రాక్టీస్ కోసం షమిని సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో కూడా ఆడించాలని భావిస్తున్నారు. అప్పుడే షమి ఫిట్‌నెస్‌పై పూర్తి స్థాయి అవగాహనకు రాగలమని బోర్డు వైద్య సిబ్బంది చెబుతున్నారు.

శ్రీనివాస్ 'ట్రిపుల్'

క్యారమ్స్ ప్రపంచ కప్



హైదరాబాద్: తెలుగు ఆటగాడు కె. శ్రీనివాస్ క్యారమ్స్ ప్రపంచకప్‌లో అదరగొట్టాడు. అమెరికాలోని కాలిఫోర్నియాలో జరిగిన ఈ మెగా ఈవెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ ఏకంగా మూడు విభాగాల్లో విజేతగా నిలిచి 'ట్రిపుల్' ఘనతను అందుకున్నాడు. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో శ్రీనివాస్ సింగిల్స్ ఫైనల్లో భారత్‌కే చెందిన హకీమ్‌ను ఓడించి చాంపియన్‌గా అవతరించాడు. అంతేకాదు.. పురుషుల డబుల్స్‌తో పాటు టీమ్ చాంపియన్‌షిప్ టైటిళ్లు కూడా శ్రీనివాస్ కైవసం చేసుకున్నాడు. ఇలా, ఈ మెగా టోర్నీలో ఒకేసారి ట్రిపుల్ సాధించిన భారత క్యారమ్స్ ఆటగాడిగా శ్రీనివాస్ రికార్డు సృష్టించాడు. మరో తెలుగు క్రీడాకారుడు ఆదిత్య స్విస్ లీగ్‌లో సింగిల్స్ కాంస్యం, డబుల్స్‌లో రజతం, టీమ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణంతో మూడు పతకాలు కొల్లగొట్టాడు.

జ్యోతి సురేఖకు స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వరల్డ్ ఇండోర్ ఆర్చరీ సిరీస్ టోర్నమెంట్‌లో తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ పసిడి పతకంతో మెరిసింది. ఆదివారం లక్సెంబర్గ్‌లో జరిగిన కాంపౌండ్ విభాగం ఫైనల్లో సురేఖ 147-145తో పాస్‌మీరి మారిటా (బెల్జియం)పై నెగ్గి, విజేతగా నిలిచింది. పురుషుల విభాగంలో అభిషేక్ వర్మ స్వర్ణం కొల్లగొట్టాడు.

కార్ల్‌సన్ కమాల్

బ్లిట్జ్ టైటిల్ కూడా మాగ్నస్‌దే
అర్జున్‌కు మూడో స్థానం
టాటా చెస్ మహిళల చాంపియన్ లగ్నో



కోల్‌కతా: ప్రపంచ నెంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సన్ టాటా స్టీల్ చెస్ టోర్నీలో అదరగొట్టాడు. శుక్రవారంనాడు టోర్నమెంట్ ర్యాపిడ్ టైటిల్‌ను సొంతం చేసుకున్న ఈ నార్వే దిగ్గజం.. తాజాగా బ్లిట్జ్ విభాగంలోనూ విజేతగా నిలిచి డబుల్ ధమాకా మోగించాడు. 18రౌండ్ల బ్లిట్జ్ విభాగంలో మొదటి తొమ్మిది రౌండ్లు ముగిసేసరికి కార్ల్‌సన్ అగ్రస్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. ఆదివారం జరిగిన చివరి తొమ్మిది రౌండ్లలో.. ఒక్క 17వ రౌండ్‌లో మినహా మిగిలిన అన్ని రౌండ్లలోనూ కార్ల్‌సన్ జోరు ప్రదర్శించాడు. ఈ రౌండ్‌లో కార్ల్‌సన్‌కు అర్జున్ ఇరిగేసి షాకిచ్చాడు. శనివారం జరిగిన ఎనిమిదో రౌండ్‌లోనూ కార్ల్‌సన్‌పై అర్జున్ నెగ్గడం విశేషం. ఇక 18వ రౌండ్‌లో విదిత్ గుజ్‌రాతీపై విజయం సాధించిన మాగ్నస్ మొత్తం 13 పాయింట్లతో టైటిల్ అందుకొన్నాడు. దాంతో ఈ టోర్నమెంట్‌లో రెండోసారి అతడు రెండు టైటిళ్లను దక్కించుకున్నట్టయ్యింది. 2019 లోనూ కార్ల్‌సన్ ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాలలో చాంపియన్‌గా నిలిచాడు. అమెరికన్ గ్రాండ్‌మాస్టర్ వెస్లీ సో (11.5) రెండో స్థానం కైవసం చేసుకోగా, అర్జున్ (10.5) మూడో స్థానంలో నిలిచాడు. మహిళల విభాగంలో.. మూడుసార్లు విజేత కాటెరినా లగ్నో (రష్యా) 11.5 పాయింట్లతో టైటిల్ చేజిక్కించుకుంది. తెలుగు గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి (9) నాలుగో, హారిక (8.5) ఐదో స్థానంలో నిలిచారు.

హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ సందడి

నేడు గచ్చిబౌలి స్టేడియంలో భారత్‌తో మలేసియా ఫ్రెండ్లీ మ్యాచ్



రాత్రి 7.30 నుంచి స్పోర్ట్స్ 18లో..

హైదరాబాద్: భాగ్యనగరంలో అంతర్జాతీయ ఫుట్‌బాల్ సందడి నెలకొంది. గచ్చిబౌలి స్టేడియంలో సోమవారం జరిగే ఫిఫా స్నేహపూర్వక మ్యాచ్‌లో మలేసియాతో భారత్ తలపడనుంది. రాత్రి 7.30కి మొదలయ్యే ఈ మ్యాచ్‌కు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. కాగా ఈ ఏడాది 10 మ్యాచ్‌లు ఆడిన భారత్.. ఒక్క దాంట్లోనూ నెగ్గలేదు. గాయం కారణంగా పది నెలలపాటు ఆటకు దూరమైన సీనియర్ ఆటగాడు సందేశ్ జింగన్ జట్టులోకి పునరాగమనం చేస్తుండడం జట్టు బలాన్ని పెంచేదే. ఇక.. ఇరుజట్లు గతంలో 32 సార్లు తలపడగా.. చెరో 12 మ్యాచ్‌ల్లో విజయం సాధించాయి.

టీఓఏ ఎన్నికలకు జితేందర్ రెడ్డి అనర్హుడు

ఐఓఏకి చాముండి లేఖ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ ఒలింపిక్ సంఘం (టీఓఏ) అధ్యక్షుడిగా పోటీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారుడు ఏపీ జితేందర్ రెడ్డి అనర్హుడని రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు వి.చాముండేశ్వరనాథ్ తెలిపారు. ఈ విషయమై భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉషకు చాముండేశ్వరనాథ్ లేఖాస్త్రం సంధించారు. '2011 స్పోర్ట్స్ కోడ్ ప్రకారం 70 ఏళ్లు నిండిన వారు క్రీడా సంఘాల ఎన్నికల్లో పోటీ చేయకూడదు. ఈ నిబంధనను ఉల్లంఘించి జితేందర్ రెడ్డి పోటీ చేస్తున్నారు. అలాగే తెలంగాణలో 33 జిల్లాలు ఉండగా కేవలం 8 జిల్లాలకే ఓటు హక్కు ఇచ్చారు. టీఓఏ వ్యవహారాలపై నివేదిక ఇవ్వాల్సిందిగా ఇటీవల మీరు వి.షియాద్‌ను కమిషనర్‌గా నియమించారు. వచ్చే నెల 10వ తేదీన వారు నివేదిక సమర్పించాల్సి ఉంది. అప్పటివరకు ఎన్నికలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలి' అని లేఖలో చాముండేశ్వర్‌నాథ్ పేర్కొన్నారు.

విజేత రుత్విక జోడీ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సీఎం ట్రోఫీ ఇండియా ఇంటర్నేషన్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో గద్దె రుత్విక శివానీ జోడీ మిక్స్‌డ్ డబుల్స్ ట్రోఫీ సొంతం చేసుకుంది. ఆదివారం రాయ్‌పూర్‌లో జరిగిన ఫైనల్లో రుత్విక-రోహన్ కపూర్ ద్వయం 21-16, 19-21, 21-12తో భారత్‌కే చెందిన సూర్య-అమృత జంటపై నెగ్గింది.

విండీస్ రికార్డు ఛేదన

5 వికెట్లతో ఇంగ్లండ్ ఓటమి

గ్రోస్ ఐస్‌లెట్ (సెయింట్ లూయిస్): లూయిస్ (68), హోప్ (54) చెలరేగడంతో.. స్వదేశంలో వెస్టిండీస్ అత్యధిక లక్ష్యాన్ని ఛేదించింది. శనివారం రాత్రి జరిగిన నాలుగో టీ20లో వెస్టిండీస్ 5 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. తొలుత ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 218 పరుగుల భారీ స్కోరు చేసింది. బెథల్ (62 నాటౌట్), సాల్ట్ (55) దూకుడుగా ఆడారు. ఛేదనలో వెస్టిండీస్ 19 ఓవర్లలో 221/5 స్కోరు చేసి గెలిచింది. 2017లో భారత్‌పై 191 పరుగుల లక్ష్యఛేదనే ఇప్పటివరకు సొంతగడ్డపై విండీస్ అత్యధికం.

అమ్మాయిలు అజేయంగా..

రాజ్‌గిర్ (బిహార్): డ్రాగ్‌ఫ్లికర్ దీపిక డబుల్ ధమాకాతో.. ఆసియా చాంపియన్స్ ట్రోఫీ లీగ్ దశను భారత మహిళల హాకీ జట్టు అజేయంగా ముగించింది. ఈపాటికే సెమీస్ బెర్త్‌ను ఖరారు చేసుకొన్న భారత్.. ఆదివారం జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో 3-0తో జపాన్‌ను చిత్తు చేసింది. దీపిక రెండు, నవ్‌నీత్ కౌర్ ఒక గోల్ చేశారు. మంగళవారం జరిగే సెమీస్‌లో జపాన్‌తో భారత్, మలేసియాతో చైనా జట్లు తలపడనున్నాయి.

22 జిల్లాల్లో మహిళా శక్తి భవనాలు

- ఒక్కో భవనానికి రూ.5 కోట్లు.. ఉత్తర్వులు జారీ
- ఎస్‌హెచ్‌జీలు మరింత బలోపేతం: మంత్రి సీతక్క

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసేందుకుగాను రాష్ట్రంలోని 22 జిల్లాల్లో 'ఇందిరా మహిళా శక్తి భవనాల'ను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా జిల్లాల్లో భవనాల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మేడ్చల్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, హన్మకొండ, కామారెడ్డి, నిజామాబాద్, ములుగు, నారాయణపేట, జగిత్యాల, భూపాలపల్లి, వనపర్తి, మెదక్, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్, నిర్మల్, మహబూబాబాద్, కొత్తగూడెం, జనగామ, ఆసిఫాబాద్, పెద్దపల్లి, గద్వాల జిల్లాల పరిధిలో చేపట్టే భవనాల నిర్మాణానికి అనుమతులిచ్చారు. ఒక్కో భవనానికి రూ.5 కోట్ల చొప్పున.. మొత్తం రూ.110 కోట్ల వ్యయంతో చేపట్టాలని నిర్ణయించారు. కాగా, ఇప్పటివరకు 10 జిల్లాల్లోనే మహిళా సంఘాల సమాఖ్యలకు సొంత భవనాలున్నాయని మిగిలిన 22 జిల్లాల్లో భవనాల అవసరం గుర్తించి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని మంత్రి సీతక్క తెలిపారు. ఈ భవనాల నిర్మాణం ద్వారా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు.

వరి కొయ్యలు తగలబెట్టొద్దు: తుమ్మల

సూర్యాపేట రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వరి కొయ్యలను తగలబెట్టొద్దని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సూచించారు. అలా తగలబెడితే కలిగే అనర్థాలపై ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆదివారం ఖమ్మం వెళ్తూ సూర్యాపేట జిల్లాలో రైతులు వరి కొయ్యలను తగులబెట్టడం చూసి మంత్రి ఆందోళన చెంది వ్యవసాయశాఖ సంచాలకుడితో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం టేకుమట్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా.. రేషన్ షాపుల ద్వారా నాణ్యమైన బియ్యం అందించడానికే కొనుగోలు కేంద్రాల్లో 17 శాతం తేమ నిబంధనను అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు రైతుల నుంచి రూ.2,851 కోట్ల విలువైన 12.29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. శనివారం ఒక్క రోజే 1.48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించమన్నారు. ఇప్పటివరకు 1,64,191టన్నుల పత్తిని ప్రభుత్వం కొనుగోలు చేసిందని వెల్లడించారు.

మిడ్ మానేర్ నిర్వాసితులకు 4,696 ఇళ్లు

హైదరాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మిడ్ మానేర్ రిజర్వాయర్ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన 4,696 మందికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ఈ ప్రాజెక్టుతో మొత్తం 12 గ్రామాల పరిధిలో 10,683 మంది భూ నిర్వాసితులవ్వగా.. వీరిలో 5,987 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. మిగతా 4,696 మందికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సిరిసిల్ల జిల్లా కలెక్టర్ చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం సమ్మతించింది. పథకం కింద ఒక్కో ఇంటి కోసం రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రేవంత్ పాలన

- రేపటి సభను జయప్రదం చేయండి: సురేఖ, సీతక్క

హనుమకొండ సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలన సాగుతోందని మంత్రులు కొండా సురేఖ, సీతక్క కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం హనుమకొండలో జరగనున్న 'ప్రజాపాలన విజయోత్సవ' సభ ఏర్పాట్లను ఆదివారం మంత్రులు పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఏడాదిగా ప్రజలు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటున్నారని, కేసీఆర్ నియంతపాలన ముగియడంతో అన్ని వర్గాలు ఆనందంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీల అమలుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. మంగళవారం జరిగే విజయోత్సవ సభను జయప్రదం చేయాలని ప్రజలను కోరారు.

ఝార్ఖండ్ సంపదపై బీజేపీ కన్ను: భట్టి

హైదరాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్ ప్రజలపై బీజేపీకి ప్రేమ లేదని, ఇక్కడి అపార ఖనిజ సంపదపైన ఆ పార్టీ కన్నేసిందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖనిజ సంపదను అంబానీ, అదానీలకు అప్పగించేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఝార్ఖండ్ ఎన్నికల పరిశీలకులుగా ఉన్న భట్టి.. ఆదివారం బొకారో నియోజకవర్గంలో ఇండియా కూటమి తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే తరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర సంపదను, వనరులను కాపాడే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జనాభా నిష్పత్తి ప్రకారం దేశ సంపద, వనరుల పంపిణీ జరగాలని రాహుల్ చెబుతున్నారని, ఇదే నినాదంతో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. ఝార్ఖండ్‌లోనూ ఇండియా కూటమి గెలిస్తే.. ఇక్కడి సంపద ఈ ప్రాంత వాసులకే పంచుతామన్నారు. తెలంగాణ తరహాలో ఏడు గ్యారెంటీలను అమలు చేస్తుందని తెలిపారు.

మంత్రి దుద్దిళ్లపై ఆరోపణలు..బీజేపీ నేతపై కేసు

కాటారం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై సోషల్ మీడియాలో ఆరోపణల నేపథ్యంలో బీజేపీ నేత చల్లా నారాయణరెడ్డిపై ఆదివారం కేసు నమోదైందని భూపాలపల్లి జిల్లా కాటారం ఎస్సై అభినవ్ తెలిపారు. మంత్రిపై నారాయణరెడ్డి యూట్యూబ్ తదితర సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల ద్వారా నిరాధార ఆరోపణలు చేస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నాడని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నామని వివరించారు.

కేటీఆర్‌కు జైలు భయం పట్టుకుంది: కడియం

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాల విషయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు జైలుకు వెళ్తామనే భయం పట్టుకుందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించారు. ఆదివారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆయన మాట్లాడుతూ... జైలుకు వెళ్లడం తప్పదని భావించి 'అరెస్టు చేయండి, జైలుకు పంపండి' అని కేటీఆర్ ప్రజల నుంచి సానుభూతి పొందే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నిరంకుశపాలన కొనసాగించి రాష్ట్ర వనరులను కల్వకుంట్ల కుటుంబం దోచుకుందని ఆరోపించారు. కల్వకుంట్ల కుటుంబ చేసిన అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని పేర్కొన్నారు. రైతులను ఏనాడు పట్టించుకోని బీజేపీ రైతు రుణమాఫీపైన విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు.

ఇది నా తండ్రికి దక్కిన గౌరవమే: వెన్నెల గద్దర్

అల్వాల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తనకు తెలంగాణ సాంస్కృతిక మండలి ఛైర్‌పర్సన్ పదవిని ఇవ్వడం తన తండ్రిని గౌరవించడమేనని గద్దర్ కూతురు వెన్నెల గద్దర్ పేర్కొన్నారు. ఆదివారం మహాబోధి పాఠశాలలోని గద్దర్ స్మృతి వనాన్ని సందర్శించి పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. అనంతరం వెన్నెల మాట్లాడుతూ.. గద్దర్ ప్రజల మనిషని, ఆయన జీవితకాలం ప్రజల కోసమే పనిచేశారని.. అందుకే ప్రభుత్వం తన తండ్రిని గౌరవించి తనకు పదవిని ఇచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సారు రావాలి.. భరోసా ఇవ్వాలి!

- సోషల్ మీడియాలో గజ్వేల్ బీఆర్ఎస్ శ్రేణుల వినతి

గజ్వేల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ సీఎం కేసీఆర్ సారు ఒక్కసారి గజ్వేల్‌కు రావాలని.. నేనున్నానంటూ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలకు భరోసా ఇవ్వాలని ఆ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను ఈ ప్రభుత్వం పూర్తి చేయడం లేదని, కేసీఆర్ సమీక్ష నిర్వహిస్తే పెండింగ్ పనులు పూర్తయ్యే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి.. తానున్నానని భరోసా ఇవ్వాలని బీఆర్ఎస్ శ్రేణులు కోరుకుంటున్నాయి. కేసీఆర్ ఒక్కసారి నియోజకవర్గానికి వస్తే రాజకీయ రంగు మారిపోతుందంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా పోస్టులు పెడుతున్నారు. స్థానిక నేతలు యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి కేసీఆర్‌తో మాట్లాడి గజ్వేల్‌లో సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కిషన్‌రెడ్డి.. గుజరాత్ గులామ్

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. గుజరాత్ మోడల్‌కు తెలంగాణ రైజింగ్ అన్నది కౌంటర్ మోడల్ అన్నారు. ఈ కాంగ్రెస్ మోడల్ దేశం మొత్తం తెలిస్తే గుజరాత్ మోడల్ విఫలమవుతుందనే దాన్ని చెడగొట్టే ప్రయత్నం కిషన్‌రెడ్డి చేస్తున్నారని ఆరోపించారు. గంగా నది ప్రక్షాళన, సబర్మతీ రివర్‌ఫ్రంట్‌లను ఏర్పాటు చేస్తే కిషన్‌రెడ్డికి బాగా కనిపిస్తుంది కానీ.. మూసీ ప్రక్షాలన మాత్రం మంచిగ కనిపించదన్నారు. వారు ఏది చేసుకున్నా మూసీ ప్రక్షాళన మాత్రం చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఆదివారం మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో, ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడారు. ఛత్రపతి శివాజీ, జ్యోతి బాపూలే, బీఆర్ అంబేడ్కర్, బాలా సాహెబ్, శరద్ పవార్ వంటి యోధుల నేలలో ఇప్పుడు ఏక్‌నాథ్ శిండే, అజిత్ పవార్, అశోక్ చవాన్ వంటి విద్రోహులు తయారయ్యారని మండిపడ్డారు. వారు గుజరాత్ గులాంలుగా మారారని విమర్శించారు. అబద్ధాల పోటీలు పెడితే దేశంలో నంబర్‌వన్‌గా ప్రధాని నరేంద్ర మోదీ నిలుస్తారని ఎద్దేవా చేశారు. ఆటో డ్రైవర్‌గా ఉన్న ఏక్‌నాథ్ శిందేను మంత్రి వరకు బాలాసాహెబ్ కుటుంబం తీసుకొచ్చిందని గుర్తు చేశారు. సొంత కుమార్తెను కాదని అజిత్ పవార్‌ను శరద్ పవార్ ఉప ముఖ్యమంత్రి చేశారని, అలాగే.. అశోక్ చవాన్.. ఆయన తండ్రి శంకర్‌రావు చౌహాన్‌లను



కాంగ్రెస్.. మహారాష్ట్రకు సీఎంలుగా చేసిందన్నారు. ఇప్పుడు వారు ముగ్గురూ విద్రోహులుగా మారి వీరుల నేలను అవమానాలపాలు చేశారని ఫైర్ అయ్యారు. తెలంగాణలో తమ ప్రభుత్వం 50 రోజుల్లోనే రూ.18 వేల కోట్లను రుణమాఫీ చేసిందని చెప్పారు. మహారాష్ట్రలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే రైతులకు రూ.3 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో రుణమాఫీతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.. రూ.500కే సిలిండర్.. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న నయాగామ్ శాసనసభ నియోజకవర్గ అభ్యర్థి మీనల్ పాటిల్ ఖత్‌గావ్‌కర్, భోకర్ అభ్యర్థి తిరుపతి కదమ్ కొండేకర్, దక్షిణ సోలాపూర్ అభ్యర్థి చేతన్ నరోటే, నాందేడ్ లోక్‌సభ ఉప ఎన్నికకు సంబంధించి అభ్యర్థి రవీంద్ర చౌహాన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

మళ్లీ రేవంత్ వాహనం తనిఖీ

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా భోకర్ నియోకవర్గంలో పర్యటిస్తున్న సీఎం రేవంత్ కాన్వాయ్‌ను ఆవీ వాహనాలను ఆ రాష్ట్ర పోలీసులు ఆదివారం తనిఖీ నిర్వహించారు. శనివారం కూడా ఓ బహిరంగ సభలో పాల్గొనేందుకు వెళ్తుండగా రేవంత్ కాన్వాయ్‌ని పోలీసులు తనిఖీ చేశారు.

ప్రజల్ని ఒప్పించి.. ప్రక్షాళన చెయ్!

(మొదటిపేజీ తరువాయి)

పాదయాత్ర చేయాలని, తాను కూడా పాదయాత్ర చేస్తానని చెప్పారు. బీజేపీ మూసీ నిద్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి అంబర్‌పేట తులసీరాం నగర్‌లో బస చేసిన కిషన్‌రెడ్డి.. ఆదివారం ఉదయం అక్కడే అల్పాహారం చేసి బస్తీవాసులతో ముచ్చటించారు. ఎన్ని బుల్డోజర్లు వచ్చినా పేద ప్రజల ఇళ్లకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. పేద ప్రజలపైన రాష్ట్ర ప్రభుత్వం యుద్ధం ప్రకటించి ఇళ్లను కూల్చుతోందన్నారు. ఇండ్లు కూల్చుతామని సీఎం రేవంత్ ప్రకటించిన తర్వాత.. భయం, ఆవేదన కారణంగా 9 మంది గుండెపోటుతో మరణించారన్నారు. ఇళ్లను కూల్చడమే ఇందిరమ్మ రాజ్యామా అని నిలదీశారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు పూర్తి కావాలంటే రూ.1.50 లక్షల కోట్ల నిధులు కావాలని, వాటిని ప్రభుత్వం ఎక్కడి నుంచి తెస్తుందని ప్రశ్నించారు. మూసీలో పెద్ద ఎత్తున పరిశ్రమల కాలుష్యం, అనేక కాలనీల డ్రైనేజీ నీళ్లు కలుస్తున్నాయని, ముందు దానిని నివారించాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లను కూల్చడం సరికాదన్నారు. మూసీ నిద్ర చేశామని, ఇక్కడ ఎటువంటి దుర్గంధం రావడం లేదని కిషన్‌రెడ్డి తెలిపారు. ఏ ఒక్కరు కూడా ఇక్కడున్న ఇల్లు ఖాళీ చేస్తామని చెప్పలేదని, మరోచోట తమకు ఇల్లు ఇవ్వాలని అడగలేదని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి కూలీ చేసుకుంటూ కష్టపడి కట్టుకున్న ఇండ్లను కూలగొడితే ఎక్కడికిపోవాలంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గతంలో కేసీఆర్ కూడా మూసీని కొబ్బరినీళ్లలా మారుస్తామని, ట్యాంక్‌బండ్ చుట్టూ ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తామని చెప్పి గులాబీ గ్రాఫిక్స్ చూపించారని చివరికి ఫాంహౌస్‌కు వెళ్లిపోయారని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ఇళ్లను కూల్చుతూ కొత్త పల్లవి ఎత్తుకున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయ



అంబర్‌పేటలో స్థానికులతో కలిసి అల్పాహారం తీసుకుంటున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కుండా, మహారాష్ట్ర ఎన్నికల్లో మాత్రం అన్నీ అమలు చేశామంటూ అబద్ధాలను ప్రచారం చేస్తోందన్నారు.

భవిష్యత్తు ఉద్యమానికి సమాయత్తం: లక్ష్మణ్

ముసారాంబాగ్ డివిజన్‌లోని శాలివాహననగర్ కాలనీలో శనివారం రాత్రి బస చేసిన బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె లక్ష్మణ్.. కోతికి కొబ్బరిచిప్ప దొరికినట్లుగా కాంగ్రెస్‌కు అధికారం లభించిందన్నారు. ఎన్నికల ముందు మూసీ ప్రక్షాళన ప్రస్తావనే కాంగ్రెస్ చేయలేదని, అధికారంలోకి వచ్చిన తర్వాత కాంట్రాక్టర్ల జేబులు నింపడంలో భాగంగానే మూసీ ప్రక్షాళన అంటున్నారని ఆరోపించారు. రైతులకు, మహిళలకు ఇచ్చిన హామీలను అమలుపరిచేలా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మెడలు వంచుతామని, అవసరమైతే ప్రజా ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఇది మొదటి విడత బస్తీ నిద్ర మాత్రమేనని, రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి నిద్ర లేకుండా చేస్తామన్నారు.

పేదలతో గోక్కున్నోడు బాగుపడలేదు

ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని ఫణిగిరి కాలనీలో బస చేసిన బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, పేదలతో గోక్కున్నోడు ఎవడూ బాగు పడలేదని మండిపడ్డారు. నోటీసులు ఇవ్వకుండా, కనీసం ఇంట్లో ఉన్న వాటిని తీసుకునే సమయం కూడా ఇవ్వకుండా ఇళ్లు కూల్చడం రేవంత్‌రెడ్డి పాశవిక పాలనకు నిదర్శనమని దుయ్యబట్టారు. మూసీ పక్కన ఉన్న దేవాలయాలకు కూడ నోటీసులు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విలువైన భూమలు కాబట్టే చైతన్యపురి మూసీపరివాహక ప్రాంతం మీద రేవంత్‌రెడ్డి కన్నుపడిందన్నారు. పలువురు బాధితులు ఈ సందర్భంగా ఈటలతో తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇల్లు కూల్చేస్తారన్న ఆందోళనతో యాసిడ్ తాగానని రాము అనే ఆటోడ్రైవర్ బోరున విలపించారు. ఆరోగ్యం పూర్తిగా నయంకాక ఆటో నడపటం లేదని, ఇల్లు కూడా గడవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని రూ.400 ఛార్జీలు పెట్టుకుని వరంగల్ పోయి ఓటు వేసి వచ్చానని, ఆ విశ్వాసంతోనైనా తమ ఇళ్లను కూలగొట్టకండి అని ఆయన ప్రాధేయపడ్డాడు. నరకం ఎక్కడో లేదు..రేవంత్‌రెడ్డి రూపంలో తెలంగాణ రాష్ట్రానికి పట్టిందని ఓ బాధిత మహిళ ఆగ్రహం వ్యక్తం చేసింది.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై నేడు బీజేపీ వర్క్‌షాప్

ఆరుగ్యారంటీల అమలులో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ సోమవారం వర్క్‌షాప్ నిర్వహించనుంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం ఉదయం 11.30 గంటలకు బొంగులూరు గేట్ వద్ద ఉన్న వేద కన్వెన్షన్‌లో జరుగనుంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేలా అసెంబ్లీ నియోజక వర్గాల్లో పాదయాత్రలపై ఈ వర్క్‌షాప్‌లో కార్యాచరణ రూపొందించనున్నట్లు పార్టీవర్గాలు తెలిపాయి.

రైతుల శ్రమతోనే వరి సిరి

- కాళేశ్వరంతో సంబంధం లేకుండా రికార్డు స్థాయిలో పంట.. సీఎం రేవంత్‌రెడ్డి ట్వీట్
- 66.77 లక్షల ఎకరాల్లో 1.53 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం వల్లే తెలంగాణలో వరి సాగు పెరిగిందన్న బీఆర్ఎస్ పార్టీ తప్పుడు ప్రచారం పటాపంచలైందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ ప్రాజెక్టుతో సంబంధమే లేకుండా ఈ ఏడాది రికార్డు స్థాయిలో ధాన్యం పండిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన సోషల్ మీడియా మాధ్యమం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ కుంగిపోయి నీటిని నిల్వ చేసే పరిస్థితి లేకున్నా.. జాతీయ డ్యాం భద్రతా అథారిటీ (ఎన్డీఎస్ఏ) సూచన మేరకు అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో నీటిని నిల్వ చేయకపోయినా.. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారిగా రికార్డు స్థాయిలో వరి ధాన్యం దిగుబడి వచ్చిందని రేవంత్ పేర్కొన్నారు. ఇది తెలంగాణ రైతుల ఘనత అని, వారి శ్రమ, స్వేదం ఫలితమని కొనియాడారు. తెలంగాణ అన్నదాతలు దేశానికే గర్వకారణమని, ఈ ఘనత సాధించిన ప్రతి రైతు సోదరుడికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

రైతులకు వెన్నుదన్ను.. ఇదే నిదర్శనం

తెలంగాణ రైతులు 66.77 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తే 1.53 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, ఇది రైతాంగం సాధించిన ఘన విజయం అని సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మూడు బరాజ్‌లు పనిచేయకున్నా వరి ధాన్యం దిగుబడిలో సాధించిన ఈ రికార్డు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతుందని పేర్కొన్నారు. ఆదివారం ప్రకటన విడుదల చేసిన ఉత్తమ్.. రైతులకు సర్కారు వెన్నుదన్నుగా నిలుస్తున్నదనడానికి పండిన పంట నిదర్శనమన్నారు. ఉమ్మడి ఏపీలో, తెలంగాణ వచ్చాక ఈ స్థాయిలో దిగుబడి వచ్చిన సందర్భం లేదన్నారు. రాష్ట్ర చరిత్రలోనే కాక యావత్ దేశంలోనే ఇదో అరుదైన రికార్డు అని ఉత్తమ్ అభివర్ణించారు. అంకితభావంతో సాగు చేసిన రైతాంగానికి, చేయూత అందించిన వ్యవసాయ, నీటిపారుదల శాఖల సిబ్బందికి మంత్రి అభినందనలు తెలిపారు.



రంగారెడ్డి జిల్లా శేరిగూడలో ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించని పోలీసులు

గ్రూప్-3 పరీక్షకు 50% హాజరు

- హైదరాబాద్‌లో 41% మంది హాజరు
- ఆలస్యంగా వచ్చినవారికి నో ఎంట్రీ

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్ 3 పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెల్లడించింది. మొదటి పేపర్‌కు 51%, రెండో పేపర్‌కు 50 శాతం మంది హాజరైనట్లు పబ్లిక్ సర్వీస్ కమిషన్ సెక్రటరీ నవీన్ నికోలస్ తెలిపారు. మొదటి పేపర్‌కు 2.73 లక్షల మంది, రెండో పేపర్‌కు 2.72 లక్షల మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా 64.5%, హైదరాబాద్‌లో అత్యల్పంగా 41% మంది హాజరైనట్లు ఆయన తెలిపారు.

ఆలస్యం... అనుమతి నిరాకరణ

రంగారెడ్డి జిల్లా శేరిగూడలోని శ్రీదత్త ఇంజినీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రానికి నలుగురు అభ్యర్థులు 9.30 తర్వాత చేరుకున్నారు. అధికారులు అనుమతించకపోవడంతో అభ్యర్థులు నిరాశగా వెనుదిరిగారు. వికారాబాద్ జిల్లాలో ఆలస్యంగా వచ్చిన 65 మంది పరీక్ష రాసే అవకాశం కోల్పోయారు. మేడ్చల్ జిల్లాలోని ఎస్ఎస్ఆర్ జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రంలో అభ్యర్థులు తాము ఎడిట్ ఆప్షన్‌లో పెట్టుకున్న విధంగా పేపర్లు ఇవ్వాలని కోరడంతో కాసేపు గందరగోళం ఏర్పడింది. జేఎన్టీయూ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్దకు ఓ యువతి పరిగెత్తుకుంటూ వచ్చే క్రమంలో స్పృహ తప్పే పరిస్థితికి చేరింది. అక్కడే విధులు నిర్వరిస్తున్న ఎస్బీ ఏఎస్సై వెంకట్రాములు గమనించి, ఆమెను జాగ్రత్తగా లోనికి తీసుకెళ్లారు. మహిళా కానిస్టేబుళ్లు ఆమెకు నీరు తాగించి, తేరుకున్నాక పరీక్ష కేంద్రంలోకి పంపించారు. ఒక పరీక్ష కేంద్రానికి బదులు మరో పరీక్ష కేంద్రానికి వచ్చిన యువతిని ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ తన వాహనంపై తీసుకెళ్లి వదిలిపెట్టారు.

ఆలస్యమైనా అనుమతించారు

నారాయణపేట జిల్లా మక్తల్‌కు చెందిన భార్యాభర్తలు గ్రూప్-3 పరీక్ష రాయాల్సి ఉండగా, భార్యకు అనుమతి నిరాకరించగా, ఐదు నిముషాలు ఆలస్యంగా వెళ్లిన భర్తను లోపలికి అనుమతించారు. విజయ్‌కుమార్ తన భార్య దీపికను నర్సిరెడ్డి డిగ్రీ కళాశాల కేంద్రం వద్ద 9.30కు వదిలిపెట్టి కిలోమీటరు దూరంలో తనకు కేటాయించిన కేంద్రానికి వెళ్లాడు. అప్పటికే 9.30 దాటినా, అధికారులు ఆయనను అనుమతించారు. డిగ్రీ కళాశాల వద్ద విజయ్ కుమార్ భార్యను మాత్రం లోనికి అనుమతించలేదు.

రేవంత్, కేటీఆర్.. ఇద్దరూ సీఎంలే

రాష్ట్రంలో ఆర్‌కే బ్రదర్స్ పాలన నడుస్తోంది.. వారి కుటుంబాల మధ్య వ్యాపార సంబంధాలు

- రుజువు చేయలేకపోతే పదవి నుంచి తప్పుకొంటా: బండి సంజయ్

సంగారెడ్డి టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో ఇద్దరు ముఖ్యమంత్రులు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వారిలో ఒకరు రేవంత్‌రెడ్డి కాగా, మరొకరు కేటీఆర్. ఇక్కడ ఆర్‌కే (రేవంత్‌రెడ్డి, కేటీఆర్) బ్రదర్స్ పాలన నడుస్తోంది. వారి కుటుంబాల నడుమ వ్యాపార సంబంధాలు ఉన్నాయి. ఆ విషయాన్ని రుజువు చేయకుంటే నేను పదవి నుంచి తప్పుకొంటా. రుజువు చేస్తే వారు పదవి నుంచి తప్పుకొంటారా?" అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. సంగారెడ్డిలో ఆదివారం ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఆయన... మీడియాతో మాట్లాడారు. ఢిల్లీ కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యంతోనే ఫోన్ ట్యాపింగ్, జన్వాడ ఫాం హౌస్, ఫార్ములా-ఈ తదితర కేసులు మూతబడ్డాయని అన్నారు. లగచర్ల విధ్వంసంలో కేటీఆర్ హస్తం ఉందని ప్రకటించిన ప్రభుత్వం.. ఎందుకు అరెస్టు



సంగారెడ్డిలో మీడియాతో మాట్లాడుతున్న సంజయ్

చేయడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. లగచర్లలో బీఆర్ఎస్ నాయకుల కుట్ర ఉంటే అమాయకులను అరెస్ట్ చేయడమేంటని ప్రశ్నించారు. రైతుల సమస్యలను పక్కదారి పట్టించేందుకే లగచర్ల విధ్వంసం సృష్టించారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతగానితనం వల్లే ఇలాంటి దాడులు జరుగుతున్నాయన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ డ్రామాలు ఆడుతూ ప్రజలను పిచ్చోళ్లను చేస్తున్నాయని, తెలంగాణలో బీజేపీ ఎదగకుండా కుట్ర పన్నుతున్నాయని ధ్వజమెత్తారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని, దాని పేరిట లక్షల కోట్లు దోచుకోవాలన్న ప్రణాళికకే తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. మూసీ బాధితులకు అన్యాయం జరగకుండా ప్రక్షాళన చేయాలని సూచించారు. రాష్ట్రంలో పథకం ప్రకారమే ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వంఆలస్యం చేస్తోందని విమర్శించారు. ఈ నెల 15 నాటికి 20 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు కనీసం 10 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వంపై రైతులకు నమ్మకం లేక ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే ధాన్యాన్ని విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించిన కాంగ్రెస్.. ఇప్పుడు సన్న రకానికే ఇస్తామంటూ సన్నాయి నొక్కులు నొక్కుతోందని విమర్శించారు.

ఫొటో షూట్ కోసమే కిషన్‌రెడ్డి మూసీ నిద్ర

- సబర్మతీకో న్యాయం.. మూసీకి మరో న్యాయమా?: మహేశ్ గౌడ్
- మహారాష్ట్రలో ఓట్ల కోసమే బీజేపీ మూసీ నిద్ర.. శ్రీధర్ బాబు ఫైర్

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఫొటో షూట్ కోసమే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మూసీ నిద్రకు వెళ్లారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. మూసీ పరీవాహక ప్రాంతంలో 3 నెలలుంటే అక్కడి సమస్యలు తెలుస్తాయని సీఎం రేవంత్‌రెడ్డి అంటే.. 12 గంటల ఉండి ఫొటో షూట్ చేసుకుని వచ్చారన్నారు. కిషన్‌రెడ్డి మూసీ నిద్రకు వెళ్లడానికి ముందే ఆ ప్రాంతంలో దోమలు, ఈగల మందు కొట్టారన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. మూసీ పరీవాహక ప్రాంతాల్లో 3 నెలల పాటు ఉండి.. అక్కడి ప్రజలతో మూసీపై చర్చ కార్యక్రమం చేద్దాం రావాలంటూ కిషన్‌రెడ్డికి సవాల్ విసిరారు. మూసీ నది ప్రక్షాళనకు ఒక న్యాయం.. సబర్మతీ రివర్‌ఫ్రంట్‌కు మరో న్యాయమా అంటూ ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టును బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై ఆపే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. గుజరాత్ గులాంలా వ్యవహరిస్తూ తెలంగాణ అభివృద్ధికి ఎందుకు అడ్డుపడుతున్నారని కిషన్‌రెడ్డిని నిలదీశారు. తెలంగాణ.. గుజరాత్‌ను ఎక్కడ దాటిపోతుందోనన్న భయం బీజేపీని వెంటాడుతోందని.. అందుకే ఈ కుట్రలని మండిపడ్డారు. లగచర్ల దాడి వెనుక కేటీఆర్ ఉన్నాడని స్పష్టం కావడంతోనే ఆ అంశాన్ని పక్కదారి మళ్లించేందుకే కిషన్‌రెడ్డి.. మూసీ నిద్ర కార్యక్రమాన్ని పెట్టుకున్నారని ఆరోపించారు. కాగా.. సోమవారం సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొనేందుకు ఆ జిల్లాకు మహేశ్‌గౌడ్ వెళ్తున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి తదితరులు పాల్గొననున్నారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్‌పై నిందలు వేస్తే మహారాష్ట్రలో ఓట్లు వస్తాయని భావించి మూసీ నిద్రను బీజేపీ నేతలు ఎంచుకున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. మూసీ నిద్రకు వెళ్లి ఆలౌట్లు, మస్కిటో కాయిల్స్ పెట్టుకొని పడుకుంటారా అని ప్రశ్నించారు. మూసీ కాలుష్యంతో నల్లగొండ జిల్లా ప్రజలు, రైతుల పరిస్థితి చూసి.. ఆ తర్వాత మూసీ ప్రాజెక్టుపై మాట్లాడాలంటూ కిషన్‌రెడ్డికి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సూచించారు. మహారాష్ట్రలో బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు ఇచ్చి ఉండవచ్చునని, కానీ ఆ రాజకీయాలను ప్రజలపై రుద్దవద్దని హితవు పలికారు. ఫార్మా కంపెనీల్లో స్థానికులకు ఉద్యోగాలను కల్పిస్తామని, నష్ట పరిహారం ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నా స్థానిక ప్రజలను బీఆర్ఎస్ నేతలు రెచ్చగొట్టి దాడులు చేయిస్తున్నారని ఎంపీ బలరాం నాయక్ అన్నారు.



రేవంత్‌కు రక్షణ కవచంగా కమలదళం

- రాష్ట్ర సర్కార్‌పై ఏఐసీసీకి ఎందుకంత సంతృప్తి
- భూసేకరణను రాహుల్ గాంధీ అడ్డుకోలేదే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కమల దళం రక్షణ కవచంలా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. లగచర్ల ఘటనను పక్కదారి పట్టించేందుకే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మూసీ నిద్ర అంటున్నారని తెలిపారు. మూసీ బాధితుల ఆక్రందనలు కిషన్ రెడ్డికి ఇప్పటికీ గుర్తొచ్చాయా? అని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ ఆదివారం పోస్టు చేశారు. స్నేహితుడిని(రేవంత్ రెడ్డిని) కాపాడేందుకు బీజేపీ చీకటి రాజకీయం చేస్తోందని విమర్శించారు. హైడ్రాను మొదట స్వాగతించింది బీజేపీ అని, మూసీ బాధితులకు భరోసా ఇచ్చింది బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. బీజేపీకి అకస్మాత్తుగా మూసీ బాధితులు గుర్తుకు రావడం వెనుక మతలబు ఏమిటి? అని నిలదీశారు. లగచర్ల రైతులకు బీజేపీ అన్యాయం చేస్తోందని, ప్రజలు సరైన వేళ బీజేపీ, కాంగ్రెస్ ఆట కట్టిస్తారని హెచ్చరించారు. ఇక, రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ఏఐసీసీ సంతృప్తిగా ఉందంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలపైనా కేటీఆర్ స్పందించారు. అమాయకులైన రైతులను జైలు పెట్టినందుకు, కొడంగల్‌లో బలవంతంగా భూ ములు గుంజుకున్నందుకు, మూసీ ప్రాజెక్టు అని వేల ఇళ్లు కూల్చివేతకు సిద్ధమైనందుకు, హైడ్రా పేరిట ప్రజలను భయపెట్టినందుకు సర్కారుపై ఏఐసీసీ సంతృప్తిగా ఉందా? అని నిలదీశారు. కాగా, దేశవ్యాప్తంగా భూసేకరణపై రాహుల్‌గాంధీ చేస్తోన్న రణగర్జన తెలంగాణలో భూసేకరణను ఎందుకు అడ్డుకోలేదని కేటీఆర్ మరో పోస్టు చేశారు. రామన్నపేటలో అదానీ పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారాలు తెరవడమేంటని రాహుల్‌ను ప్రశ్నించారు. అదానీ, అంబానీలపై రాహుల్ పోరాటం ఓ బూటకమని ఆరోపించారు.

పత్తి రైతుల సమస్యలు పరిష్కరించాలి

» గురుకులాల్లో చావులకు సీఎందే బాధ్యత: హరీశ్‌రావు



హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో మద్దతు ధర దక్కక పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, పత్తి రైతులతోపాటు కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు ఇరు ప్రభుత్వాలు తక్షణం పరిష్కారం చూపాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. 'కౌలు రైతులకు కాంగ్రెస్ అమలు చేస్తా నన్న రైతుభరోసా సంగతి దేవుడెరుగు.. వారు పండించిన పత్తిని మద్దతు ధరకు అమ్ముకోలేని దుస్థితిని గుర్తించి వారికి మద్దతుగా నిలవాలి' అని ఆదివారం 'ఎక్స్' వేదికగా ఆయన పేర్కొన్నారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా తెలంగాణ గురుకులాల్లో ఫుడ్ పాయి జన్లు, ఆత్మహత్యలు పెరిగి మరణ మృదంగం వినిపిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ 11 నెలల పాలనలో 42 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన దుస్థితి ఏర్పడిందని.. అయినా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడకపో వడం సిగ్గుచేటన్నారు. ఈ చావులు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని, దీనికి సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన వి ద్యార్థుల కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు.



శ్రీవారి ఆలయం వద్ద జస్టిస్ హరినాథ్, జస్టిస్ వినోద్ కుమార్

శ్రీవారి సేవలో ఏపీ, తెలంగాణ హైకోర్టు జడ్జిలు

తిరుమల, నవంబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం ఏపీ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హరినాథ్, జస్టిస్ వినోద్ కుమార్ దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో వీరు ఆల యంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాల యంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోని రంగ నాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు.

ఢిల్లీకి 'లగచర్ల' బాధిత రైతుల కుటుంబసభ్యులు

» నేడు ఎస్సీ, ఎస్టీ, మానవ హక్కుల కమిషన్లకు ఫిర్యాదు


బొంరాస్‌పేట్, వికారాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో అధి కారులపై దాడి ఘటనలో అరెస్టయిన బాధిత రైతుల కుటుంబాల సభ్యులు తమపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు ఆదివారం ఢిల్లీకి చేరుకున్నారు. సోమ వారం జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, జాతీయ మానవ హక్కుల కమి షన్‌ను కలిసి రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులపై వారు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. వారి వెంట సత్యవతి రాథోడ్, బీఆర్‌ఎస్ నేతలు తరలివెళ్లారు. కాగా సోమవారం జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్.. లగచ ర్లకు రానున్నట్లు సమాచారం. అలాగే రాష్ట్ర బీజేపీ నేతలు కూడా లగచర్లకు రానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా, లగచర్ల కేసులో అరెస్టయిన పట్నం నరేందర్‌రెడ్డికి బెయిల్ ఇవ్వాలని కోరుతూ గురువారం బీఆర్‌ఎస్ లీగల్ సెల్ వికారాబాద్ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచా రణ జరగనుంది. అలాగే నరేందర్‌రెడ్డి కస్టడీ కోరుతూ కొడంగల్ కోర్టులో పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పైనా ఈ రోజే విచారణ జరగనుంది.

శబరిలో శీఘ్ర సేవల అంబులెన్స్‌లు

తిరువనంతపురం, నవంబరు 17: శబరిమలలో అయ్యప్ప భక్తులకు వైద్య సేవలు అందించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు కేరళ ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ చెప్పారు. ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేస్తూ భక్తుల కోసం ప్రత్యేకంగా 'శీఘ్ర సేవల అంబులెన్స్'లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆరోగ్య శాఖ పరిధిలో ఉన్న అంబులెన్స్‌లు, కనివ్-108 అంబులెన్స్‌లకు అదనంగా ఈ ర్యాపిడ్ యాక్షన్ అంబులెన్స్‌లు పనిచేస్తాయని తెలిపారు. ఇవి కాకుండా 19 అత్యవసర వైద్య కేంద్రాలు, పలు ఆక్సిజన్ పార్లర్లు ఏర్పాటు చేశామని వివరించారు.

సామాజిక సవాల్‌గా మూర్ఛ వ్యాధి

ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి.. ఏఐజీలో 'సెంటర్ ఫర్ ఎపిలెప్సీ' ప్రారంభం





ఏఐజీలో సెంటర్ ఫర్ ఎపిలెప్సీ ప్రారంభోత్సవంలో వైద్య నిపుణులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మూర్ఛ వ్యాధి ఒక సామాజిక సవాలుగా మారిందని ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డీ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. మూర్ఛకు అత్యుత్తమ చికిత్సను అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని తెలిపారు. జాతీయ మూర్ఛ వ్యాధి దినం సందర్భంగా ఆదివారం ఏఐజీ ఆస్పత్రిలో 'సెంటర్ ఫర్ ఎపిలెప్సీ'ని ప్రారంభించారు. వివిధ వైద్య విభాగాల నిపుణులు ఒకేచోట ఉండి మూర్ఛ రోగులకు చికిత్స అందించేందుకు వీలుగా ఈ అత్యా ధునిక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని నాగేశ్వర్‌రెడ్డి చెప్పారు. పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ మూర్ఛ రోగుల్లో చాలామందికి చికిత్సపై అవగాహన ఉండడం లేదన్నారు. దాంతో 70 నుంచి 80శాతం కేసుల్లో చికిత్సతో నయం చేసే అవకాశం ఉన్నా చాలామంది రోగులు మూర్ఛతో బాధపడుతూనే జీవిస్తున్నారన్నారు. ఇది సామాజిక ఒంటరితనానికి, ఉత్పాదకత కోల్పోవడానికి దారితీస్తుందని, జీవిత నాణ్యతను దెబ్బతీస్తుందన్నారు. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మూర్ఛ రోగులు సకాలంలో వైద్య సహాయం తీసుకోవడం లేదన్నారు. మూర్ఛ గురించి అపోహలను తొలగించడానికి, సకాలంలో చికిత్స పొందేలా ప్రోత్స హించడానికి 'సెంటర్ ఫర్ ఎపిలెప్సీ' కృషి చేస్తుం దని ఏఐజీ ఆస్పత్రి న్యూరాలజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎ జబీన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ సెక్రటరీ సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ, డాక్టర్లు మల్లా భాస్కరరావు (బెంగళూరు నిమ్హాన్స్ ఆస్పత్రి), దినేష్ నాయక్ (చెన్నై గ్లోబల్ ఆస్పత్రి), రమేష్ దొడ్డమణి (ఢిల్లీ ఎయిమ్స్), ఏఐజీ వైస్ చైర్మన్ పీవీఎస్ రాజు, డైరెక్టర్ డాక్టర్ జీవీ రావు, డాక్టర్ సుబోధ్ రాజు పాల్గొన్నారు.

ఈవీ.. ట్యాక్స్ ఫ్రీ

(మొదటిపేజీ తరువాయి)

వాహనాలకు పరిమితి లేకుండా రాయితీలు అందించి వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఈవీ పాలసీ తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 1.7 లక్షల ఈవీలు రిజిస్ట్రేషన్ అయినట్లు వెల్లడించారు. కాగా కాలుష్య నియంత్రణ మండలి అధ్యయనం ప్రకారం ప్రస్తుతం హైదరాబాద్‌లో 83, పటాన్‌చెరులో 82, సంగారెడ్డిలో 79 పాయింట్లకు తీవ్రత నమోదైనట్లు వివరించారు. కాలుష్య సమ స్యను పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంద న్నారు. గ్రేటర్‌లో మూడువేల ఈవీసిటీ బస్సులు ప్రవేశపెట్టాలని సీఎం ఆదేశించినట్లు గుర్తు చేశారు. 15ఏళ్లు దాటిన పాత వాహనాలకోసం స్క్రాప్ పాలసీ తీసుకువచ్చినట్లు తెలిపారు. త్వర లో రెండు స్క్రాప్ కేంద్రాలు అందుబాటులోకి రానున్నట్లు వివరించారు. వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలకు త్వరలో ఆటోమాటిక్ టెస్టింగ్ సెంటర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. దేశంలో ఏటా 1.60లక్షల మంది, రాష్ట్రంలో రోజుకు సగటున 20 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతు న్నట్లు పేర్కొన్నారు.

రోడ్ ట్యాక్స్ 17శాతం మిగులు



టీజీ రెడ్కో ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈవీ చార్జింగ్ స్టేషన్

రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపులివ్వ డంతో ఈవీలు కొన్నవారికి ప్రయోజనం కలుగనుంది. కార్ల ధర 10 లక్షల లోపు అయితే 14శాతం, ధర 10 లక్షలపైన అయితే 17శాతం రోడ్ ట్యాక్స్ మిగులు తుంది. ఒకవేళ కొనుగోలుదారు పేరిట అప్పటికే బైక్ గనక ఉంటే 2 శాతం అదనంగా ట్యాక్స్ పడుతుంది. అంటే మొత్తం 19శాతం మిగులుతుంది. ఆ రకంగా ఈవీ కారు కొన్నవారికి రూ.1.40 లక్షల నుంచి రూ.1.90 లక్షల దాకా మిగులుతుంది. ద్విచక్రవాహనా లయితే కొన్న ధరలో 12శాతం రోడ్ ట్యాక్స్ మిగులు తుంది. బైక్‌లు, కార్లకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1500-2వేల వరకు మిగలనుంది. వాస్తవానికి ఈ మినహాయింపు పథకాన్ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2020 అక్టోబరు 29న పరిమితులతో అమల్లోకి తెచ్చింది. తొలి 2లక్షలు బైక్‌లు కొన్నవారికి, తొలి 8వేల కార్లు కొన్నవారికి, తొలి 2వేల ఆటోలు కొన్నవా రికి రోడ్డు ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజును రద్దు చేస్తామని ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎలాంటి పరిమితి విధించలేదు.

రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేసిన వివిధ రకాల ఎలక్ట్రిక్ వాహనాల వివరాలు

టూ వీలర్స్	143535
ఫోర్ వీలర్స్ (కార్లు)	8000
ఫోర్ వీలర్స్ (టాక్సీక్యాబ్స్)	2000
ఆటోలు (జీహెచ్ఎంసీ)	2007
ఆటోలు (జిలాల్లో)	933
చిన్న తరహా గూడ్స్ (జీహెచ్ఎంసీ)	2000
చిన్న తరహా గూడ్స్ (జిల్లాల్లో)	2323

రవాణా శాఖకు కొత్త లోగో

రవాణా శాఖ అధికారులు, ఉద్యోగులను గుర్తించేం దుకు కొత్తగా లోగో రూపొందించనున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. డీటీసీ స్థాయి అధికారులందరికీ వాహనాలు సమకూర్చనున్నట్లు వివరించారు. రహ దారి నిబంధనలు కచ్చితంగా పాటించే విధంగా వాహనదారుల్లో అవగాహన పెంచేందుకు కొత్తగా నియమితులైన ఏఎంవీఐల సేవలను వినియోగించ నున్నట్లు పేర్కొన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో ఆర్టీఏ చెక్‌పోస్టుల కొనసాగింపు పై ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదన్నారు. రవాణా శాఖలో అనేక సంస్కర ణలు తీసుకొస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు పాటిం చని వాహనదారులపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. గ్రేటర్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం కోసం పది రోజుల్లో జీహెచ్ఎంసీ, రవాణా, పోలీస్ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

మరో 80 ఈవీ ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్లు

హైదరాబాద్‌లో ఏర్పాటుకు టీజీ రెడ్కో కసరత్తు.. 20 స్థలాల పరిశీలన

హైదరాబాద్ సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్యకు అనుగుణంగా ఈవీ ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్లు అందుబా టులోకి తెచ్చేదిశగా టీజీరెడ్కో (తెలంగాణ పునరుద్ధర ణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ లిమిటెడ్) చర్యలు తీసుకుంటోంది. గ్రేటర్‌జోన్ పరిధిలో 70 ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసిన టీజీరెడ్కో మరో 80 ఏర్పాటుచేసే దిశగా ముందుకువెళ్తుంది. అందులో భాగంగా 20 ప్రాంతాల్లో స్థలాలు కూడా పరిశీలించింది. త్వరలో ఆయా ప్రాంతాల్లో ఈవీ ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభిం చారు. తెలంగాణ ప్రభుత్వం 2026 డిసెంబరు 31 వరకు ఎలక్ట్రిక్ వెహికిల్ పాలసీని కొనసాగిస్తునట్లు ప్రకటించడంతో ఈవీ వాహనాల కొనుగోళ్లు మరింత పెరిగే అవకాశాలుంటాయని టీజీ రెడ్కోకు చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు. గ్రేటర్‌జోన్ పరిధిలో 2025 నాటికి 600 ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు లక్ష్యంగా చర్యలు తీసుకుంటునట్లు అధికారులు చెబుతున్నారు. 2030 నాటికి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 6 వేలకు పైగా ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు లక్ష్యంగా టీజీ రెడ్కో ముందుకువెళ్తోంది. కాగా గ్రేటర్‌లో ప్రతి 22 ఈవీ వాహనాలకు ఒక పబ్లిక్ చార్జింగ్ స్టేషన్ అందు బాటులో ఉందని టీజీరెడ్కో అధికారులు తెలిపారు. గ్రేటర్‌పరిధిలో 17 వేల ఈవీ ద్విచక్ర వాహనాలుం డగా, 4800 వరకు త్రీ, ఫోర్ వీలర్ వాహనాలు ఉన్నాయి. టీజీరెడ్కో ఏర్పాటుచేసిన ఈవీ చార్జింగ్ స్టేషన్ల వివరాలు ఎలక్ట్రిక్ వాహనదారులు సులభంగా తెలుసుకునేందుకు వీలుగా టీజీఈవీ యాప్‌ను రెడ్కో ప్రత్యేకంగా అందుబాటులోకి తెచ్చింది. టీజీఈవీ యాప్‌లో ప్రైవేట్ ఈవీ చార్జింగ్ స్టేషన్ల వివరాలను అనుసంధానం చేసే దిశగా టీజీరెడ్కో పలు ప్రైవేట్ కంపెనీలతో సంప్రదింపులు చేస్తోంది. టీజీరెడ్కో ఈవీ చార్జింగ్ స్టేషన్లలో జీఎస్టీతో కలిపి ఒక్క యూనిట్‌కు రూ. 15.38 పైసలు వసూలు చేస్తుండగా, ప్రైవేట్ ఈవీ చార్జింగ్ స్టేషన్లలో రూ. 25-28 వరకు వసూలు చేస్తున్నారు. గ్రేటర్‌లో ఐదు కిలోమీటర్ల పరిధిలో ఓ ఈవీ చార్జింగ్ స్టేషన్ అందుబాటులో ఉందని అధికా రులు చెబుతున్నారు.

వణుకు మొదలైంది

(మొదటిపేజీ తరువాయి)

మండలాల్లో చలిగాలుల తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. ఆయా చోట్ల ఉదయం 6 గంటలకు కూడా ప్రధాన రహదారులను పొగమంచు కప్పేస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని గిన్నెధరిలో రాష్ట్రంలోనే అత్యల్పంగా 11.8 డిగ్రీల ఉష్ణో గ్రత నమోదైంది. అదే జిల్లాలోని సిర్పూర్‌లో 12.3, వాంకిడి, కెరమెరి ప్రాంతాల్లో 13.2 డిగ్రీల అత్యల్ప ఉష్ణో గ్రతలు నమోదయ్యాయి. అలాగే ఆదిలాబాద్‌లో 13.2, మెదక్‌లో 14.2, రామగుండంలో 16.4, హన్మకొండలో 17.3, భద్రాచలంలో 17.9, డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డ్ అయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగా రెడ్డి జిల్లాల పరిధిలోనూ ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. రంగారెడ్డి జిల్లా చౌదరిగూడంలో 14.4, వికారాబాద్ జిల్లా మర్పల్లిలో 14.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణో గ్రత నమోదైంది. అలాగే గ్రేటర్ హైదరాబాద్ శివారు లోని పటాన్‌చెరులో అత్యల్పంగా 15.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డ్ అయింది. కాగా, నల్లగొండ జిల్లాలో చలి తీవ్రత అంతగా కనిపించకపోవడం విశేషం. మరో వైపు రాబోయే రోజుల్లో చలి తీవ్రత మరింత పెరగను న్నట్లు వాతావరణశాఖ హెచ్చరించింది. రాత్రివేళ ఉష్ణో గ్రతలు గణనీయంగా తగ్గుతాయని పేర్కొంది. పగటి పూట ఉష్ణోగ్రతలు ఐదారు డిగ్రీల మేరకు, రాత్రివేళ సైతం అంతేస్థాయిలో తగ్గుతాయని తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో పగటిపూట సగటు 35-39 డిగ్రీల మధ్య నమోదు అవుతుండగా.. రాత్రివేళ 15-19 మధ్య రికార్డ్ అవుతున్నాయి. అయితే రాగల మూడు రోజులు రాత్రివేళ ఉష్ణోగ్రతలు 11-14 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ మేరకు చలికి సంబంధించిన యెల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. సాధార ణంగా 10-15 మధ్య ఉష్ణోగ్రతలు నమోదైతే యెల్లో అలెర్ట్, అంతకు మించి తగ్గితే ఆరెంజ్, ఇంకా తగ్గితే అంటే 0-5 డిగ్రీల మధ్యకు పడిపోతే రెడ్ అలెర్ట్ జారీ చేస్తారు. రాబోయే మూడు రోజులకు వాతావరణ కేంద్రం అన్ని జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. ముఖ్యంగా ఆదిలాబాద్, నిర్మల్, సంగారెడ్డి, మెదక్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, సంగారెడ్డి జిల్లాల్లో రాత్రివేళ ఉష్ణోగ్రతలు బాగా తగ్గుతాయని పేర్కొంది. రాత్రివేళ 12.30 నుంచి ఉదయం 5.30 గంటల మధ్య ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గే అవకా శముందని నిపుణులు చెబుతున్నారు.

చంద్రబాబు అరెస్టు వెనుక ఏపీ సీఐడీ కుట్ర!

సీనియర్ ఐఏఎస్ పీవీ రమేశ్ వాంగ్మూలం తారుమారు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అక్రమ కేసుల గురించి చాలాసార్లు వినుం టారు! ఏ తప్పూ చేయని వ్యక్తిని రాజకీయ కక్షసా ధింపుతో అరెస్ట్ చేయడానికి ఏకంగా ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి వాంగ్మూలాన్నే తారుమారు చేయడం గురించి విన్నారా? వైసీపీ అధినేత జగన్ ఏపీ సీఎంగా ఉన్నప్పుడు ఈ 'ఘనకార్యం' కూడా చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో నాటి ప్రతి పక్ష నేత చంద్రబాబును జైల్లో పెట్టేందుకు జగన్ సర్కారు కుట్రపూరితంగా వ్యవహరించిన వి షయం, 'తాడేపల్లి' డైరెక్షన్‌లో సీఐడీ అధికారులు నడుచుకున్న వైనం తాజాగా వెలుగులోకి వచ్చింది. జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ కేసుపై ప్రత్యేక దృష్టి పెట్టింది. కానీ ఎక్కడా స్కామ్ జరిగినట్టు నిరూ పించలేకపోయింది. చంద్రబాబు పాత్ర ఉన్నట్లు అధికారికంగా ఎక్కడా నిరూపణ కాలేదు. అయినా బలమైన ఆధారాలు లభించాయంటూ సీఐడీ అధి కారులు హడావుడి చేశారు. చంద్రబాబు నంద్యాల పర్యటనలో ఉన్నప్పుడు అప్పటి సీఐడీ డీఐజీ కొల్లి రఘురామరెడ్డి బృందం అక్కడికి వెళ్లి హైడ్రామా మధ్య ఆయన్ను అరెస్టు చేసింది.

అడ్డగోలు ఆరోపణలు

అప్పట్లో ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేసిన పీవీ రమేశ్ ఇచ్చిన వాంగ్మూలం ఆధా రంగా చంద్రబాబును అరెస్టు చేసినట్లు సీఐడీ అధి కారులు ప్రకటించారు. చంద్రబాబు మొత్తం నిబం ధనలన్నీ తుంగలో తొక్కారని, వందల కోట్ల రూపా యల కుంభకోణానికి ఆయన చర్యలే కారణమని పీవీ రమేశ్ తన వాంగ్మూలంలో చెప్పినట్లు పేర్కొ న్నారు. ఒప్పందం ప్రకారం.. సుమారు రూ.3,500 కోట్ల విలువైన స్కిల్ ప్రాజెక్టులో 90 శాతాన్ని సీమెన్స్, డిజైన్‌టెక్ కంపెనీలు గ్రాంట్ కింద (సాఫ్ట్ వేర్, సేవల రూపంలో) భరించాల్సి ఉండగా, 10 శాతం రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద ఇవ్వాల్సి ఉంది. అయితే రూ.370కోట్ల రాష్ట్ర ప్రభుత్వ వాటాను ఆ కంపెనీలకు అక్రమంగా చెల్లించారని, ఆ డబ్బులు తిరిగి షెల్ కంపెనీల ద్వారా చంద్రబా బుకే వచ్చాయని అప్పట్లో సీఐడీతో పాటు జగన్ అనుకూల మీడియా ఆరోపించింది. కానీ.. చంద్ర బాబు దిగిపోయే సమయానికి ఏపీవ్యాప్తంగా 40 ఇంజనీరింగ్ కాలేజీల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటుచేశారు. 4 లక్షల మందికి శిక్షణ ఇవ్వగా, అప్పటికే 60 వేలమందికి పైగా ఉద్యో గాల్లో చేరారు. ఆ తర్వాత వచ్చిన జగన్ సర్కార్ కూడా ఆ కేంద్రాలను కొనసాగించింది. సీఐడీ చెప్పినట్లు ప్రభుత్వం చెల్లించిన డబ్బంతా తిరిగి చంద్రబాబుకే ఇస్తే ఆ కంపెనీలు ఇన్ని లక్షల మందికి ఎలా శిక్షణ ఇస్తాయన్న ప్రశ్న అప్పట్లోనే తలెత్తింది. అలాగే.. స్కిల్ ప్రాజెక్టు మొత్తం స్కామ్ అయితే శిక్షణా పరికరాలు ఎలా వచ్చాయి? అన్నది మరో ప్రశ్న. సీఐడీ.. ఇవేమీ పట్టించుకోకుండా చెల్లింపుల మీదే అడ్డగోలుగా వాదించింది.

పీవీ రమేశ్ చెప్పిందిదీ..

ఒక పథకానికి లేదా ప్రాజెక్టుకు శాసనసభలో బడ్జెట్ ఆమోదం ఉన్నప్పుడు నిధుల విడుదలలో ఎలాంటి అభ్యంతరాలూ ఉండబోవు. ఏదైనా పని సత్వరం కావాలనుకున్నప్పుడు ముఖ్యమంత్రి సంబంధిత అధికారులకు చెప్పడం రివాజు.

సీఐడీ అధికారులు అల్లిన 'కథ' ఇదీ!

స్కిల్ ప్రాజెక్టులో చెల్లింపులు నిబంధనలకు వి రుద్ధంగా జరిగాయి. నేను కుదరదని అభ్యంతరం చెబితే నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక సార్లు ఫోన్ చేసి, ఒత్తిడి చేసి డబ్బులు విడుదల చేయించారు.

సీఐడీ వక్రభాష్యం

స్కిల్ ప్రాజెక్టు చెల్లింపుల విషయంలో తాను అభ్యంతరం చెబితే నాటి ముఖ్యమంత్రి చంద్ర బాబు అనేకసార్లు ఫోన్ చేసి, ఒత్తిడి చేసి డబ్బులు విడుదల చేయించారని పీవీ రమేశ్ చెప్పినట్లు సీఐడీ కోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. చంద్రబాబు అరెస్టుకు దాన్నే ప్రధాన ఆయుధంగా సీఐడీ మలుచుకుంది. కానీ.. తాను ఇచ్చిన స్టేట్ మెంట్ ద్వారా చంద్రబాబును అరెస్టు చేశారన్న వి షయాన్ని పీవీ రమేశ్ అప్పుడే ఖండించారు. స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో ఆర్థిక చెల్లింపులపై అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎలాంటి తప్పులు చేయ లేదని, అలాంటప్పుడు తప్పు జరిగినట్లు తాను ఎలా చెబుతానని పీవీ రమేశ్ నిలదీశారు. అసలు విషయం ఏంటంటే.. అప్పట్లో దీని వెనుక పెద్ద కుట్రే నడిచింది. పీవీ రమేశ్ ఇచ్చిన 161 స్టేట్‌మెం ట్‌ను.. సీఐడీ అధికారులు 'తాడేపల్లి' డైరెక్షన్‌లో మార్చేశారు. ఆయన చెప్పని విషయాలను జోడిం చారు. దాన్నే తమ కేసులో బలంగా చూపించి చంద్రబాబును అరెస్టు చేశారు. తాజాగా ఈ కేసు విచారణలో భాగంగా సీఐడీ అధికారులు ఆయ నతో మాట్లాడినప్పుడు ఈ విషయం బయటప డింది. తన పేరుతో సీఐడీ రికార్డుల్లో 161 స్టేట్ మెంట్‌లో ఉన్న అంశాలు ఏవీ తాను చెప్పినవి కావని ఆయన కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. తాను సీఐడీకి పంపించిన స్టేట్‌మెంట్ కాపీ తన వద్ద ఉందని, సీఐడీకి తానిచ్చానని చెబుతున్న స్టేట్‌మెంట్ ప్రతిని పంపితే ఎక్కడ ఎలాంటి గోల్ మాల్ జరిగిందో గుర్తించి చెప్పగలనని పీవీ రమేశ్ సీఐడీని కోరినట్లు తెలిసింది. తప్పుడు పద్ధతుల్లో స్టేట్‌మెంట్‌లను తారుమారు చేసి ఒక మాజీ ముఖ్యమంత్రిని అరెస్టు చేయించిన జగన్ లీలా వి న్యాసాలు ఇప్పుడు బయటకు రావాల్సి ఉంది.

సచివాలయం ప్రధానద్వారం గేట్ల తొలగింపు



ప్రధాన ద్వారం గేట్లు తొలగించి రెయిలింగ్ నిర్మిస్తున్న దృశ్యం

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సచివాలయంలోని ప్రధాన ద్వారానికి ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న నేప థ్యంలో అక్కడ ఆదివారం కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రస్తుత ప్రధాన మహా ద్వారానికి ఉన్న గేట్లను తొలగించారు. వాటి స్థానంలో అక్కడ ఇనుప రేలింగ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటివరకు ఉన్న ప్రధాన మహాద్వారం గుండా నేరుగా సచి వాలయంలోకి వెళ్లేందుకు అవకాశం ఉండేది. తాజా మార్పులతో అది ఈశాన్యం వైపుకు వెళ్లనుంది. దాదాపు 27 అడుగుల ఎత్తులో గేటును ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ప్రధాన మహాద్వారాన్ని ఈ ఏడాది జూన్‌లోనే మూసివేశారు. కాగా కొత్తగా ఏర్పాటు చేయబోయే గేటు గుండానే సీఎం రాకపోకలు సాగించను న్నట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం సచివాలయంలోని సౌత్‌ఈస్ట్ (ఆగ్నేయం గేటు నెంబర్ 2) నుంచి నార్త్ ఈస్ట్ (ఎన్‌టీఆర్ గార్డెన్ వైపున్న గేటు నెంబర్ 4) వరకు నేరుగా వెళ్లేలా ఒక రహ దారిని నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు రెండో గేటు నుంచి నాలుగో గేటు మార్గంవైపునకు వెళ్లేందుకు అవకాశం లేదు.

ఓరుగల్లుకు.. ఎయిర్‌బస్ 320!

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వనున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. దీనిపై అక్టోబరు 24న 'మామునూరుకు మోక్షం' శీర్షికన కథనం ప్రచురించింది. కాగా, మామునూరులో ఏ-320 (ఎయిర్‌బస్-320) లాంటి పెద్ద విమానాలు రాకపోకలు సాగించేలా విమానా శ్రయం నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి డిజైన్లు, వివిధ సాంకేతిక అంశాలు కొలిక్కివచ్చి నట్టు తెలిసింది. ఏ-320 స్థాయి విమానమంటే 180 మంది ప్రయాణించే అవకాశం ఉంటుంది. అదే సమయంలో వివిధ సంస్థలకు దేశ, విదేశాల నుంచి సామగ్రి, ముడి పదార్థాలను తీసుకొచ్చే పెద్ద కార్గో విమానాలు కూడా దిగేందుకు వీలుగా రన్ వే ఏర్పాటు చేయనున్నారు. 2,800 మీటర్ల పొడవు, 75 మీటర్ల వెడల్పుతో రన్‌వే నిర్మించను న్నట్టు తెలిసింది. మామునూరును భవిష్యత్తులో అంతర్జాతీయ విమానాశ్రయంగా అభివృద్ధి చేసే అవకాశాలు కనబడుతున్నాయి. ప్రస్తుతం దీనికి ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) పరి ధిలో 696 ఎకరాలు ఉండగా.. కొత్తగా సేకరించే భూములతో కలిపితే 949 ఎకరాలు అవుతుంది. దీన్నిబట్టి అంతర్జాతీయ విమానాశ్రయాల ఏర్పాటు నిబంధనల మేరకే భూమి కేటాయింపు జరిగిందని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. 2023 జూలై, 2024 ఏప్రిల్‌లో ఏఏఐ నిర్వహించిన భూ పరీక్షలు, టెక్నో ఎకనామికల్ ఫీజిబిలిటీ స్టడీ నివేదికను కేంద్రానికి సమర్పించింది. మూడు విమానాలతో ఎయిర్ వ్యూను కూడా చేపట్టి, విమానాల రాకపోక లకు వాతావరణం ఏ సమయాల్లో ఎలా ఉందనే అంశాన్ని కూడా పరిశీలించారు. ఈ పరీక్షల నేప థ్యంలో మామునూరు నుంచి అంతర్జాతీయ విమా నాలను నడిపేందుకు సానుకూల వాతావరణం ఉన్నట్టు తెలిపినట్టు సమాచారం.

1930లోనే వరంగల్‌లో ఎయిర్‌పోర్టు..

మామునూరులో 1930లో నిజాం హయాంలోనే విమానాశ్రయం ఏర్పాటవ్వగా వివిధ కారణాలతో 1980లో మూతపడింది. విమానాశ్రయం కోసం నిజాం కాలంలోనే 1,875 ఎకరాలు కేటాయించారు. ఆ భూమి నుంచే ప్రస్తుతం నవోదయ విద్యాలయా నికి 23.20 ఎకరాలు, పోలీసు శిక్షణ కేంద్రానికి 59, ఏసీపీ కార్యాలయానికి 10, వరంగల్ సెంట్రల్ జైలుకు 101, ఫోర్త్ బెటాలియన్‌కు 241, వెటర్నరీ యూనివర్సిటీకి 675 ఎకరాలు కేటాయించారు. ఇవి పోగా ప్రస్తుతం ఏఏఐ పరిధిలో 696.14 ఎకరాల భూమి ఉంది. విమానాశ్రయం ఏర్పాటుకు మరో 253 ఎకరాల భూమి కావాలని ఏఏఐ ప్రభుత్వాన్ని కోరింది. గత ప్రభుత్వ హయాంలోనే ఈ భూమి కేటాయింపునకు చర్చలు జరిగినా పూర్తిస్థాయిలో సఫలం కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత మంత్రి కొండా సురేఖ శ్రద్ధ వహించి, రైతులతో మాట్లాడి, భూములు ఇచ్చేలా ఒప్పించ డంతో సమస్య కొలిక్కివచ్చింది. ఈ విమానాశ్రయ నిర్మాణం పూర్తయితే ఢిల్లీ సహా ఇతర ప్రాంతాలకు 'ఎయిర్ కనెక్టివిటీ' పెరగడంతో పాటు పరిశ్రమల స్థాపనకు పెద్ద కంపెనీలు ఆసక్తి కనబరుస్తాయి. తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

2007 నుంచే ప్రయత్నాలు..

దేశంలో అభివృద్ధి చెందుతున్న నగరాలకు రాష్ట్ర, దేశ రాజధాని ప్రాంతాలతో 'ఎయిర్ కనెక్టివి టీ' కల్పించాలని నిర్ణయించిన కేంద్రం 2017లో 'ఉడాన్' పథకాన్ని తీసుకురాగా, మామునూరుకు ఇందులో అవకాశం కల్పించింది. ఈ క్రమంలోనే ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త విమానాశ్ర యాల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న వాటి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. భూ సేకరణ సహా సాంకేతిక సమస్యలు పరిష్కారమవడంతో మామునూరు విమానాశ్రయ నిర్మాణ పనులు త్వరలోనే పట్టాలెక్కనున్నాయి.

వరంగల్ ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది

ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ఎంతగానో సహకరిస్తున్నారు. మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి సీఎం వేగంగా చర్యలు తీసుకోవడంతో పాటు, భూ సేకరణకు రూ.205 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసి వరంగల్ ప్రజల దశా బ్దాల చిరకాల వాంఛను నెరవేర్చారు. విమానా శ్రయం ఏర్పాటు నా రాజకీయ ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలుస్తుంది.

\- కొండా సురేఖ, రాష్ట్ర మంత్రి

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.